ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 08.11.2025 | సంపుటి :12 సంచిక : 108 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# చర్చలు సఫలం

- బంద్ విరమించిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు
- డిప్యూటీ సీఎం భట్టితో చర్చల అనంతరం ప్రకటన



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. తక్షణమే రూ.600 కోట్లు విడుదలకు డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. మరో రూ.300 కోట్లు త్వరలో చెల్లించేందుకు హామీ ఇచ్చారు. గతంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు ఫీజు బకాయిలు చెల్లించింది. అంతకు ముందు ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ ముగించింది. దరఖాస్తును పరిశీలించి వారంలో నిర్ణయం తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం పోరాటంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 'సాంత్వన సభ' నిర్వహించేందుకు మిగతా 2లో..



# బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కలుండొద్దు

**వెంటనే షెల్టర్లకు తరలించాలి • 8 వారాల్లోగా ప్రక్రియ పూర్తి చేయండి**

- విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, బహిరంగ ప్రదేశాలో వీధి శునకాలు కనబడొద్దు
- ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దు
- వాటికి బహిరంగంగా ఆహారం అందించడానికి అనుమతి లేదు
- ఆలనాపాలనా లేని పశువులనూ షెల్టర్లకు తరలించాలి
- అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కీలక ఆదేశాలు


2లో

## రహస్య అణుపరీక్షలు పాకిస్తాన్ నైజం



ఈ విషయంలో ఆ దేశానికి దశాబ్దాల చరిత్ర ఉంది:భారత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచంలో అణ్వాయుధాలను పరీక్షిస్తున్న దేశాల్లో పాకిస్థాన్ కూడా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. రహస్యంగా, చట్టవిరుద్ధంగా అణు కార్యకలాపాలు కొనసాగించడంలో పాకిస్థాన్‌కు

## బండి సంజయ్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

2లో..



# అభివృద్ధిని చూసి ఓటేయండి

**కాంగ్రెస్,బీఆర్ఎస్ పాలనను పోల్చుకోండి**

- హైదరాబాద్ అభివృద్ధికి కిషన్‌రెడ్డి, కేటీఆర్‌లు మోకాలడ్డు
- ఈ బ్యాడ్‌బ్రదర్స్ వల్లే పలు కీలక ప్రాజెక్టులకు అడ్డంకులు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కదు

భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలనే దానిపై విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌లను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్?కు తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు' - సీఎం రేవంత్ రెడ్డి

- ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి
- హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కేటీఆర్
- నగరంలో చెరువులను కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతలు
- ఎన్నిక ఏదైనా నేనే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా
- ఓట్లు వేసి గెలిపిస్తే నగరాభివృద్ధికి పెద్దపీట
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఎపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని బీఆర్ఎస్ రాష్ట్రానికి మిగతా 2లో..

# అవకాశాలు పుష్కలం.. పెట్టుబడులకు స్వాగతం

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ
- యూటా పారిశ్రామికవేత్తల బృందంతో భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఈజ్‌ఆఫ్‌డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణలో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా - యూటా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా-తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్ కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుం దన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల మిగతా 2లో..



# అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- రెండేండ్ల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై తేల్చుకుందాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



## ముఖ్యమంత్రివి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

ఓటర్లను బెదిరించే ధోరణిలో ప్రసంగాలు

ఓట్లు వేయకుంటే రేషన్ కార్డులు ఇవ్వమనడం దారుణం : హరీశ్


2లో

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్‌లో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో దమ్ముంటే చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్లో ఏదేదో మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఆయన భాషలో ఆయనకు అర్థమైయేటట్లు చెప్పే సత్తా తమకు ఉందని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి మమ్మల్ని తిట్టినా.. మేం మాత్రం గౌరవంగానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో రేవంత్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించిన ఆయన.. దీంతో చెత్త ఎవరిది.. సత్తా ఎవరిదో తేలిపోతుందని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన అంశాలను కేటీఆర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాం.. తమ హయాంలో స్టార్ట్ చేసినవాటికే కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేసిందని వివరించారు. అవి కాకుండా.. కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించావా అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. మిగతా 2లో..



## ఢిల్లీ ఏటీసీలో సాంకేతిక లోపం

- సమస్యతో 500 విమానాలకు పైగా ఆలస్యం
- ముంబయితో సహా దేశవ్యాప్తంగా విమానాలపై ప్రభావం
- సైబర్ దాడే కారణమని అనుమానాలు

**ఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఎయిర్‌పోర్టు ఏటీసీ సిస్టమ్‌లో సాంకేతిక లోపం కారణంగా 500 పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. విమానాల ఆలస్యంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో రద్దీ పెరిగింది. సాంకేతిక సమస్యను పునరుద్ధరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే షెడ్యూల్ చేసిన విమానాలు రద్దు చేశారు. ఆటోమేటిక్ మెసేజ్ స్విచ్చింగ్ సిస్టం పనిచేయడం లేదు. మాన్యువల్ డేటాతో విమాన రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 1500 విమానాల రాకపోకలు సాగిస్తుంటాయి. సైబర్ దాడి జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, సైబర్ మిగతా 2లో..

## డిసెంబర్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

మంత్రి కోమటిరెడ్డి 2లో..

# మాది దేవుడి పార్టీ.. వాళ్లకు రాముడంటే ఇష్టం ఉండదు

**బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌కు ఘోర ఓటమి తప్పద్దు : ప్రధాని మోదీ**

**పాట్నా(జనంసాక్షి):**ఆర్జేడీ నేతలకు లక్ష కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా తెలియదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌కు ఘోర ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కూటమికి సారథ్యం వహిస్తున్న ఆర్‌జేడీ మూడు దశాబ్దాలకుపైగా తాను గెలవని స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయించిందన్నారు. పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి సీఎం పదవిని లాలు పార్టీ తస్కరించిందని ప్రధాని ఆరోపించారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఔరంగాబాద్ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, కాంగ్రెస్, ఆర్జేడీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మిగతా 9లో..



## డయాబెటిస్, ఒబెసిటీ ఉంటే..

# నో వీసా

**ట్రంప్ మరో సంచలన నిర్ణయం**




**వాషింగ్టన్(జనంసాక్షి):**అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలసదారులపై కఠిన నిబంధనలు అమలు చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కొత్త రూల్ తీసుకొచ్చారు. డయాబెటిస్ ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. టీబీ వంటి అంటు వ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వలసదారుల మెడికల్ హిస్టరీపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వనరులపై అదనపు భారం పడే అవకాశమున్న దరఖాస్తుదారులను అమెరికాలోకి రానివ్వకుండా వీసాను తిరస్కరించేలా నిబంధనలను కఠినతరం చేసినట్లు సమాచారం. "దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి మిగతా 2లో..

## త్వరలోనే మోదీని కలుస్తా

- అతడు గొప్ప వ్యక్తి, నా మిత్రుడు కూడా..
- వచ్చే సంవత్సరం భారత్‌లో పర్యటిస్తా
- వాణిజ్య చర్చలు సాగుతున్నాయి
- మా మధ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- నా ఒత్తిడితో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపారు: ట్రంప్

2లో..

## ఏకంగా ఎంపీకే స్కామర్ల షాక్

తృణమూల్ పార్టీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ బ్యాంకు ఖాతా నుంచి రూ.56 లక్షలు మాయం



**కోల్‌కతా(జనంసాక్షి):**చిన్నా పెద్దా అనే తేడా లేదు. అకౌంట్లో భారీ ఎత్తున డబ్బులున్నాయని పసిగడితే చాలు. ఆన్‌లైన్ స్కామర్లు వాలిపోతారు. లక్షలకు లక్షలకు, ఒక్కోసారి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. తృణమూల్ పార్టీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ బ్యాంకు ఖాతాలోకి స్కామర్లు చొరబడి రూ.56 లక్షలు మాయం చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని సెరంపూర్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన తృణమూల్ కాంగ్రెస్ మిగతా 2లో..

## పాకిస్తాన్ పత్రికలు మాపై విషం చిమ్ముతున్నాయి

మాకు వ్యతిరేకంగా కథనాలు ప్రచురిస్తున్నాయి: రష్యా



**మాస్కో(జనంసాక్షి):**పాకిస్థాన్‌కు చెందిన 'ది ఫ్రాంటియర్ పోస్టు అనే ఆంగ్ల భాషా దిన పత్రికపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. మాస్కోకు వ్యతిరేకంగా ఈ పత్రిక కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు పాక్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.'పాక్ ఆంగ్ల మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
08.11.2025

## చర్చలు సఫలం

ఉన్నతా విద్యాసంస్థల సమాఖ్య దరఖాస్తు చేసుకుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉన్నందున సాంత్వన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేసింది.పోలీసుల నుంచి వివరాలు తీసుకోవాల్సి ఉందని హెూంశాఖ జీపీ మహేశ్.. విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. బండ్లగూడలోని అరోరా కళాశాలలో సభ పెట్టుకుంటామని సమాఖ్య తరపు న్యాయవాది తెలిపారు. ఎక్కడ సభ పెట్టుకోవాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని హెూంశాఖ జీపీ స్పష్టం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. వారంలో పోలీసులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది.

సాంత్వన సభ వాయిదా..

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న నిర్వహించ తలపెట్టిన సాంత్వన సభ వాయిదా వేసినట్టు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రకటించింది. హైకోర్టు సూచనల మేరకు ఈనెల 14 వరకు సభను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

## ఢిల్లీ ఏటీసీలో సాంకేతిక లోపం..

అటాక్ వార్తలను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ధ్రువీకరించలేదు.

ముంబయితో సహా దేశవ్యాప్తంగా విమానాలు ఆలస్యం

సాంకేతిక సమస్య కారణంగా దిల్లీలో వందలాది విమానాల రాకపోకలపై ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ముంబయి లోనూ అదే పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ జారీ చేసింది. దిల్లీలో ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించింది విమానాలు ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని ప్రయాణికులను అప్రమత్తం చేసింది. అప్‌డేట్ల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని సూచించింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది.ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే వెల్లడించింది దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది. ఈ సమస్యకు సైబర్ దాడి ఏమైనా కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ముంబయితో పాటు జైపుర్, లఖ్‌నవూ, వారణాసి, ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోంది. దిల్లీ నుంచి ఈ ఎయిర్‌పోర్టులకు వచ్చే విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

సైబర్ దాడే కారణమా?


దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు, మూడు రోజులుగా సాంకేతిక సమస్యతో వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సమస్యే దీనికి కారణంగా భావిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. సైబర్ దాడే దీనికి కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటీసీ ఆటోమేషన్ వ్యవస్థలోకి మాల్‌వేర్‌ను చొరబాటు వల్లే ఈ సమస్య తలెత్తిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినళ్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది.

## డిసెంబర్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం ఈమేరకు జీవో విడుదల చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వెబ్‌సైట్ వినియోగంలోకి వచ్చింది. సదరు వెబ్‌సైట్‌ను ఎఫ్‌డీసీ ఎండీ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్నవారు.. 3 సెకన్ల నుంచి 25 నిమిషాల పాటు నిడివి గల లఘు చిత్రాలను పంపాలని కోరారు. ఆయా వీడియోలను ఈ వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐమాక్స్ వేదికగా నిర్వహించనున్న వేడుకకు అంతర్జాతీయ ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణుల హాజరవుతారని తెలిపారు. ముగింపు వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నవంబరు 14 నాటికి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది.

# అభివృద్ధిని చూసి ఓటేయండి



చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరని అన్నారు. ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని అన్నారు. హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం అని సిఎం అన్నారు. 2047 నాటికి స్వాతంత్య్రం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ రాదని...రాసిపెట్టుకోవాలని సీఎం రేవంత్ అన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కలుండొద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):వీధి కుక్కల కేసులో శుక్రవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపం నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. అలాగే అవి ఈ ప్రదేశాల లోపలికి వెళ్లకుండా కంచెలు వేయాలని సూచించింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని ఆదేశించింది కుక్కల తరలింపునకు కోర్టు 8 వారాల సమయం ఇచ్చింది. జాతీయ రహదారులపై తిరుగుతున్న ఆలనాపాలనా లేని పశువులను షెల్టర్లకు తరలించాలని సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు హైవే గస్తీ బృందాలకు ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

## పాక్ పత్రికలు మాపై విషం చిమ్ముతున్నాయి

వార్తా పత్రిక ది ఫ్రాంటియర్‌లో రష్యన్ వ్యతిరేక కథనాలను మేం గమనించాం. ఈ పత్రికకు సంబంధించిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లో ఉన్నందున దీన్ని పాకిస్థానీ అని పిలువలేము. పత్రిక తన సంపాదకీయంలో నిరంతరం రష్యా విదేశాంగ విధానం, నాయకత్వాన్ని విమర్శిస్తూ కథనాలు ప్రచురిస్తుంది' అని పేర్కొంది. ఇతర దేశాల అజెండాపై కథనాలను ఎంపిక చేసే విషయంపై అమెరికనైజ్డ్ బృందం బాధ్యత వహిస్తుందని.. అది రష్యా విదేశాంగ విధానాలకు, అధ్యక్షుడు పుతిన్ విమర్శకులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించింది. తమ దేశానికి సానుకూలంగా ఉండే ఒక్క కథనం కూడా ఈ పత్రికలో రాలేదని పేర్కొంది. అఫ్గాన్ వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ఈ వార్తా పత్రిక.. మాస్కో ఫార్మాట్ ఆఫ్ కన్సల్టేషన్స్‌ను పూర్తిగా విస్మరించడం గమనార్హం అని వెల్లడించింది. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఫ్రాంటియర్ పత్రిక జర్నలిస్టులు.. రష్యా ఆర్థిక పతనం అంచున ఉన్న దుర్భల దేశంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించింది. తమ దేశ ఆర్థికవ్యవస్థను సమర్థించింది. ఏ దేశ చరిత్రలోనూ ఇంతకుముందు లేనివిధంగా.. బయట ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నా తమ ఆర్థికవ్యవస్థ స్థిరమైన పురోగతిలో ఉందని వెల్లడించింది. 2024లో రష్యా జీడీపీ 4.1 శాతం పెరిగిందని పేర్కొంది.

## బండిపై సంజయ్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగానూ ఆయనపై చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఈవోకు ఫిర్యాదు చేసింది.

## అవకాశాలు పుష్కలం.. పెట్టుబడులకు స్వాగతం

అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టీ-హబ్, టీ- వర్క్స్, వీ హబ్ లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా, సిలికాన్ స్లోప్స్ యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు.ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్ లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'యూటా' రాష్ట్రంతో పటిష్ఠమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లోఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచీగా మారాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.తెలంగాణ లాంటి ఫాస్ట్-గ్రోయింగ్, డైనమిక్, ప్రో-యాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కో-ఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ వుడ్, సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మీనారాయణ, ఐఐఆర్ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.

## ఏకంగా ఎంపీకే స్కామర్ల షాక్

నాయకుడు, పార్లమెంటు సభ్యుడు(ఎంపీ) కళ్యాణ్ బెనర్జీకి చెందిన కోల్‌కతాలోని హైకోర్టు శాఖ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాలోకి స్కామర్లు చొరబడి రూ.56 లక్షలు దోచేశారు. కోల్‌కతా పోలీసుల సైబర్ క్రైమ్ సెల్‌కు బ్యాంక్ అధికారికంగా ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.బ్యాంక్ ఫిర్యాదు ప్రకారం, అక్టోబర్ 28న సైబర్ నేరగాడు నకిలీ పాన్ , ఆధార్ కార్డులను సూపర్ ఇంపోజ్డ్ ఫోటో , నకిలీ ఫోన్‌నెంబరు వివరాలతో బెనర్జీ



అకౌంట్‌ను అప్‌డేట్ చేశాడు. దీంతో ఖాతాపై పూర్తి నియంత్రణ లభించింది. ఈ తర్వాత, ఆ వ్యక్తి బహుళ ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించాడని, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా దాదాపు రూ. 56,39,767ను దొంగిలించాడని ఆరోపించారు. ఇలా కొట్టేసిన మొత్తాన్ని అనేక మంది లబ్ధిదారుల ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొంత ద్వారా విత్‌డ్రా చేసి,ఆభరణాలను కొనుగోలు చేయడానికి కూడా ఉపయోగించాడని పోలీసు అధికారులు తెలిపారు.

# సీఎంవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సిఎం రేవంత్ చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు. చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సినీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు.బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్ధన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఎ÷-లాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమిషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అని ఆరోపించారు. ప్రధాని చెప్పిన ఆర్ఆర్ టాక్స్‌పై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడు వచ్చింది? ముస్లింలు ఎప్పుడు నుంచి ఉన్నారు అని నిలదీశారు. కాంగ్రెస్ లేకుంటే.. ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి కామెంట్స్ అన్యాయమన్నారు. ముస్లింలను రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు.

# డయాబెటిస్, ఒబెసిటీ ఉంటే.. నో వీసా

తీసుకోవాల్సి ఉంట్నుంది. హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక, ఒబెసిటీ కారణంగా ఆస్తమా, స్లీప్ ఆప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడుతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలి" అని ఆ మార్గదర్శకాల్లో వెల్లడించారు.అంతేకాదు.. ఒకవేళ వలసదారులు అమెరికా ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది కూడా నిర్ధరించుకోవాలని వీసా అధికారులను ఆదేశించారు. ఇక, కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిశీలించాలని స్పష్టం చేశారు. అయితే, ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు. దీంతో ఈ రూల్స్ అమల్లోకి వచ్చాయా లేదా అన్న దానిపై స్పష్టత లేదు.ఇప్పటికే వలసదారులకు సంబంధించి అమెరికా యంత్రాంగం కఠిన విధానాలను అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజీ విజిటర్ల 'డ్యురేషన్ ఆఫ్ స్టే'పై పరిమితి విధించడం, హెచ్-1బీ వీసాపై వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేశాయి.

## త్వరలోనే మోదీని కలుస్తా

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా- భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా? అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్‌లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ - అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. బరువు తగ్గించే మందుల ధరలను తగ్గించడానికి సంబంధించి కొత్త ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు.

## అభివృద్ధిపై చర్చకు సిద్ధం

కొత్త రోడ్ల సంగతి తర్వాత.. కనీసం రోడ్లపై పడిన గుంతలైనా పూడ్చారా అని నిలదీశారు. నగర ప్రజలకు మళ్లీ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కూడా సీఎంగా ఒక ఏరియాను ఎంచుకొని అక్కడ శానిటేషన్ పనులు పర్యవేక్షించారని గుర్తు చేశారు. స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. వేలాది స్వచ్ఛ్ ఆటోలను ప్రవేశపెట్టామని అన్నారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా ప్రవేశపెట్టారా అని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి రోజు 7.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించామని వెల్లడించారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు సాధించామని తెలిపారు. బెస్ట్ క్వాలిటీలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డు వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడే కూడా స్టార్ట్ చేసినట్లు తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మురికికూపంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిదని గుర్తు చేశారు కేటీఆర్. ఈ రెండేళ్లలో ఒక్క ఇల్లైనా కట్టారా అని ప్రశ్నించారు. దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని రేవంత్ రెడ్డికి చాలెంజ్ చేశారు కేటీఆర్. కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఇల్లు కట్టకపోగా.. వేలాది ఇళ్లను హైడ్రా పేరుతో ఈ ప్రభుత్వం కూలగొట్టిందని ఫైరయ్యారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రోను పూర్తి చేసింది కూడా తమ ప్రభుత్వమేనని కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మెట్రో సీఎఫ్‌వో, ఎల్ అండ్ టీ సీఎఫ్‌వోలను బెదిరిస్తోందని ఫైరయ్యారు. కాంగ్రెస్ బాధ తట్టుకోలేక, వాళ్ల బెదిరింపులకు తాళలేక ఎంత మంది పారిశ్రామికవేత్తలు పారిపోయారో చర్చకు సిద్ధమా అని నిలదీశారు.ఇక.. కరెంటు విషయంలోనూ కాంగ్రెస్ తీరును ఎండగట్టారు కేటీఆర్. కాంగ్రెస్ హయాంలో వారానికి రెండు, మూడు రోజులు పవర్ హాలిడేస్ ఉంటే.. తాము అధికారం చేపట్టిన తర్వాత 24 గంటలు కరెంటు ఇచ్చామని గుర్తు చేశారు. ఎల్ఈడీ బల్బులతో తెలంగాణను దేదీప్యమానంగా చేశామని.. కానీ ఈ రెండేళ్లలో రేవంత్ సర్కార్ ఒక్క ఎల్ఈడీ అయినా పెట్టిందా అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో విద్యుత్ వెలుగులు కొనసాగాయో.. ఎవరి హయాంలో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడ్డారో చర్చిద్దామా అని సవాల్ విసిరారు కేటీఆర్. కాంక్రీట్ జంగిల్‌లో కొత్తగా లంగ్ స్పేస్‌లు ఏర్పాటు చేసిన ఘనత తమదే అన్నారు కేటీఆర్. ప్రతి గ్రామంలో నర్సరీలు పెట్టి.. 16వేల నర్సరీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మీ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క నర్సరీ కూడా పెట్టకపోగా.. ఉన్న చెట్లను నరికేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు.. రూ.10వేల కోట్లకు కక్కుర్తిపడి జీవవైవిధ్యాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. ఐటీ ఉద్యోగాలను కూడా మూడు లక్షల నుంచి 9 లక్షలకు పెంచామని గుర్తు చేశారు.

## రహస్య అణపరీక్షలు పాక్ నైజం

దశాబ్దాల చరిత్ర ఉందని స్పష్టం చేసింది.స్మగ్లింగ్, ఎగుమతి నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలు దశాబ్దాలుగా పాకిస్థాన్‌కు అలవాటేనని, ఏకే ఖాన్ నెట్‌వర్క్ విస్తరణ చుట్టూ ఇది కేంద్రీకృతమైందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. వచ్చే ఏడాది భారత్‌లో పర్యటిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దీనిపై ప్రస్తుతానికి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని, ఆ జాబితాలో పాకిస్థాన్ ఉందని అమెరికా అధ్యక్షుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయని, వాళ్లెవ్వరూ ప్రశ్నించరని అన్నారు. తాము మాత్రం బహిరంగంగానే చెబుతామన్నారు. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా వాటి జోలికి వెళ్లలేదని.. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగానే తామూ అణు పరీక్షలు నిర్వహిస్తామని ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# మినిట్‌మ్యాన్‌-3 క్షిపణి ప్రయోగం



- శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన అమెరికా

**కాలిఫోర్నియా, నవంబర్ 7 (జనంసాక్షి) :** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నవంబర్ 5న 'మినిట్‌మ్యాన్‌-3' అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వసనీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చితత్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని, ఇందులో ఎలాంటి అణు వార్‌హెడ్‌లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించబోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు. మినిట్‌మ్యాన్‌-3 అమెరికా అమ్ములపొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయోగించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించగలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోంది. ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన B83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇది ఒక నగరంపై పడితే 10-15 కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదైపోతుంది. ఇటీవల, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 100-400 అణు వార్‌హెడ్‌లు చాలు. ఈ నేపథ్యంలో, మినిట్‌మ్యాన్‌-3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## దౌత్య సాధనంగానే భారత్‌పై టారిఫ్‌లు

- అమెరికా మంత్రి కీలక వ్యాఖ్యలు

భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారీ సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం గురించి అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ఆపేందుకు దౌత్యపరమైన మార్గంగానే భారత్‌పై టారిఫ్‌లు విధించారని తెలిపారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ లుట్నిక్ ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయం కోసమే అధ్యక్షుడు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగించడానికి ఈ సుంకాలను దౌత్యమార్గంగా ఉపయోగిస్తున్నారన్నారు. రష్యా చమురు కొనుగోలు ఆపేయాలని భారత్‌కు ట్రంప్ ఇప్పటికే చెప్పారని అన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ఉపయోగించి భారత్‌తో సహా అనేక దేశాలపై విధించిన పరస్పర సుంకాలు చట్టబద్ధమైనవేనా అని కోర్టు పరిశీలిస్తున్న నేపథ్యంలో లుట్నిక్ దీనిపై మాట్లాడారు. ట్రంప్ అధికారాలను పరిమితం చేయడం వల్ల.. ప్రపంచాన్ని, అమెరికాను సురక్షితమైన ప్రదేశంగా మార్చాలన్న ఆయన లక్ష్యం బలహీనపడుతుందన్నారు. ఈ సందర్భంగా సుంకాలపై నమోదైన దావాల్లో ట్రంప్ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో.. 50 శాతం సుంకాలతో ట్రంప్ విరుచుకుపడ్డారు. దీంతో భారత్- అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అతి త్వరలోనే వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 50 శాతంగా ఉన్న టారిఫ్‌లు.. 15-16 శాతానికి తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### వనపర్తి డీఎంహెచ్‌వో శ్రీనివాసులు బదిలీ

**వనపర్తి, నవంబర్7 (జనంసాక్షి) :** జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులును ప్రభుత్వం బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు నారాయణపేట జిల్లా వైద్య కళాశాల సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా పదోన్నతి కల్పించారు. ప్రోగ్రాం అధికారి సాయినాథ్ రెడ్డిని ఇంఛార్జ్ జిల్లా వైద్యాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## జూబ్లీహిల్స్‌లో ముమ్మర తనిఖీలు

మద్యం, డబ్బు స్వాధీనం

**హైదరాబాద్, నవంబర్7 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా నగదు, మద్యం పట్టుబడుతోంది. నవంబర్ 7 ఉదయం వరకు రూ. 3.3 కోట్ల నగదు ..701 లీటర్ల మద్యం సీజ్ చేశారు అధికారులు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.4 లక్షల 74 వేల 322. 2 కిలోలకు పైగా గంజాయి . 0.11 గ్రాముల ఓఆఓంతో సహా మాదకద్రవ్యాలను కూడా ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ రూ.లక్షా 97 వేల 600 ఉంటుందని అధికారులు వెల్లడించారు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా 24 కేసులు నమోదయ్యాయి. వీటిలో 15 ఎన్నికల సంబంధిత హింసకు సంబంధించినవి, ఏడు అనుమతి లేకుండా సమావేశాలు , ప్రసంగాలకు సంబంధించినవి. రెండు ఓటర్లను ఆకర్షించే ఉద్దేశ్యంతో నగదు, సరకుల పంపిణీకి సంబంధించినవి. నియోజకవర్గంలో 45 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 45 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు . ఈ బృందాల వాహనాలకు జీపీఎస్, పీటీజెడ్ కెమెరాలను అమర్చి, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి 24గంటలు పర్యవేక్షిస్తున్నారు.

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. సిట్టింగ్ సీటు దక్కించుకోవాలని బీఆర్‌ఎస్, జూబ్లీహిల్స్ లో గెలవాలని అధికార పార్టీ, సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్ .. 14న కౌంటింగ్ జరగనుంది. జూబ్లీహిల్స్ లో మొత్తం 4,లక్షల 13వందల 65 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు - 2 లక్షల8 వేల 561.. లక్షా 92వేల779 మహిళల ఓట్లు,25 ఇతరుల ఓట్లు ఉన్నాయి .నియోజకవర్గంలోని మొత్తం 407 పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా, వీటిలో 54 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. పోలింగ్ రోజున ఈ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్

**హైదరాబాద్, నవంబర్7 (జనంసాక్షి) :** సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ.62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ.107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు. 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ.1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ.24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

## లండన్‌లో ఘనంగా దన్నంనేని యశస్వినీ, రీతిశ్రీ భరతనాట్య అరంగేట్రం

- ముఖ్య అతిథిగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల హాజరు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** లండన్‌లో చారిత్రత్మక వాటర్స్‌మీట్ థియేటర్ లో దన్నంనేని యశస్వినీ, రీతిశ్రీ లు వారి భరతనాట్య అరంగేట్రం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసారు. ఈ వేడుక వారి కళా జీవితంలో ఒక మైలురాయిగా నిలిచింది. కార్యక్రమానికి 500 మందికి పైగా కళా ప్రేమికులు, ప్రేక్షకులు హాజరై, ఇద్దరు బాలికల నృత్య ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. యశస్వినీ, రీతిశ్రీ 10 సంవత్సరాలుగా భరతనాట్యం అభ్యసిస్తూ ఈ సంవత్సరం తమ భరతనాట్య డిప్లొమా పూర్తి చేశారు. ఈ అరంగేట్రం వేడుకకు ఇండియా నుండి తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, బ్రిటన్ మాజీ పార్లమెంట్ సభ్యుడు వీ రేందర్ శర్మ, ఓఈబీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అంబికా థామోధరన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, అలాగే లండన్ నగరంలోని వివిధ తెలుగు, తెలంగాణ సంఘ ప్రముఖులు, సామాజిక నాయకులు హాజరయ్యారు. దన్నంనేని సంపత్ కృష్ణ, లావణ్య దంపతులు, కరీంనగర్ జిల్లాలోని నల్లగొండ గ్రామానికి చెందినవారు. లండన్‌లో స్థిరపడి తమ కుమార్తెల కళాభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. నాలుగు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో మొత్తం ఎనిమిది నృత్య ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. వీటిలో అలారిప్పు, జతీస్వరమ్, సరస్వతి కీర్తనం, వర్నం స్వామీ నాన్ ఉండన్, రాధా సమేత కృష్ణ మరియు తిల్లానా వంటి ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే జయ జయ దుర్గా కీర్తనం మరియు నాగ నర్తనం వంటి సోలో ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ లలిత కళలు మానవ సంస్కృతిని మలచడంలో, మానవతా విలువల పెంపొందింపులో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు . వారు బాలికల తల్లిదండ్రులు దన్నంనేని సంపత్ కృష్ణ, లావణ్య దంపతులను, వారి గురువు రాధిని గారిని యువ ప్రతిభను ప్రేమతో, క్రమశిక్షణతో పెంచడంలో చూపిన అంకితభావానికి అభినందించారు.

## అక్టోబర్ విప్లవంతో వినూత్నమార్పు

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** శాంతి, అందరికీ భూమి, ఆహారం హామీలను నెరవేర్చిన సోవియట్ యూనియన్ అక్టోబర్ విప్లవం సమాజంలో వినూత్న మార్పును తీసుకొచ్చిందనీ, దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని చూపెట్టినదని మహోత్తర పోరాటం అది అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కొనియాడారు. అక్టోబర్ విప్లవ దినోత్సవానికి నవంబర్ ఏడో తేదీన జరుపుకోవడానికి గ్రిగేరియన్ క్యాలెండర్ కారణమన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం(ఎంబీ.భవన్)లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి అధ్యక్షతన అక్టోబర్ విప్లవం-విశిష్టత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ, బూర్జువాలు కలిసి రష్యాలో జార్ చక్రవర్తుల పాలనను కూలదోసి ఫిబ్రవరి 17న ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే, ప్రజలు ఆశించిన విధంగా యుద్ధాల నుంచి విముక్తి, రైతులకు భూమి, అందరికీ రేషన్ అందించేందుకు బూర్జువాలు సిద్ధంగా లేకపోవడంతో ప్రజల సహకారంతో అక్టోబర్ విప్లవం ద్వారా లెనిన్ నాయకత్వంలో రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుచేశారు. ఉత్పత్తి విధానంలో మార్పు, ఆర్థిక విధానాలు, ఉద్యోగాల కల్పన, మహిళలకు సమాన అవకాశాలు వంటి అంశాల్లో మార్పులు రాకుండా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చినంత మాత్రాన సోషలిస్టు వ్యవస్థగా మారిందని చెప్పలేమన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలనీ, సంపద సృష్టించాలనీ, పోగైన సంపదను పంచాలని చెప్పారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కడు పేదరికాన్ని నిర్మూలించడంలో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం వచ్చాక మహిళలకు, పురుషులకు సమాన హక్కులు కల్పించబడ్డాయనీ, పేదరిక నిర్మూలన జరిగిందనీ, ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించిందనీ, రాజ్యపాలన నుంచి మతాన్ని వేరు చేసిందనీ, చర్చి నుంచి పాఠశాలలను దూరం చేసిందని వివరించారు. సెమినార్ లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, బండారు రవికుమార్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కేంద్రం కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కోసం సైబర్ ఉచ్చులో పడ్డ నిరుద్యోగులు

- వారిని కాపాడి స్వదేశానికి రప్పించిన కేంద్రం

**న్యూఢిల్లీ, నవంబర్ 7 (జనంసాక్షి) :** ఉద్యోగాల పేరిట మోసపోయి, మయన్మార్, థాయ్‌లాండ్ సరిహద్దులో సైబర్ నేర కేంద్రంలో చిక్కుకున్న పలువురు బాధితులు దిల్లీ చేరుకున్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న చొరవతో వీరు బంధవిముక్తులు అయ్యారు. ఉద్యోగాల పేరుతో మోసపోయి వీరు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కున్నారు. ఇందులో ఏపీకి చెందిన 11 మంది, తెలంగాణకు చెందిన మరో 11 మంది ఏపీ, తెలంగాణ భవన్‌లకు చేరుకున్నారు. అక్కడి అధికారులు నేటి మధ్యాహ్నం లోగా బాధితులను స్వస్థలాలకు చేర్చనున్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకున్న పలువురు భారతీయులను ప్రత్యేక వైమానిక దళ విమానంలో విదేశాంగశాఖ అధికారులు దిల్లీకి తీసుకొచ్చారు. ఐటీబీపీ కేంద్రంలో అన్ని రకాల పత్రాలను పరిశీలించి, సంబంధిత రాష్ట్రాల యంత్రాంగంతో సంప్రదించిన తర్వాత తెలుగు రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయి, నకిలీ ఉద్యోగాల మోజులో పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

## వందేమాతరం మూలభావం అదే: ప్రధాని మోదీ



వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళుతుందని చెప్పారు. "వందేమాతరం శబ్దం ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుంది. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుంది" అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోదీ అన్నారు. "వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి" అని పేర్కొన్నారు. శుక్రవారం దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది.

## కర్నూలు బస్సు దగ్ధం కేసులో ఓనర్ వేమూరి వినోద్ అరెస్ట్

**కర్నూలు, నవంబరు 7 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లాలో 19 మంది మృతికి కారణమైన ఈ ఘోర ప్రమాదానికి సంబంధించి వి.కావేరీ ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను ఎ1 నిందితుడిగా ఇప్పటికే అరెస్టు చేయగా, ట్రావెల్స్ యజమాని వినోద్ కుమార్‌ను ఎ2 నిందితుడిగా పోలీసులు చేర్చారు.

ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రావెల్స్ ఓనర్ వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు వినోద్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఈ బస్సు కర్నూలు జిల్లా, ఉలిందకొండ మండలం చిన్నటేకూరు క్రాస్ రోడ్డు వద్ద ఒక బైకును ఢీకొనడంతో మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 19 మంది సజీవ దహనమయ్యారు. పోలీసుల ఈఎఫ్‌ఐ కాపీ ప్రకారం డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్పష్టం చేశారు. డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై ఉలిందకొండ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## వీరు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు?

- సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లపై కమిషనర్ ఆగ్రహం



**హైదరాబాద్, నవంబరు7 (జనంసాక్షి) :** ప్రజాభిమానాన్ని వ్యాపారంగా మలచుకోవడం దారుణమని క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్‌ధావన్‌పై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌లకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉంటూ వీరు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకున్నారని మండిపడ్డారు. ప్రేక్షకుల అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారని ప్రశ్నించారు. బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారు. వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా అని అన్నారు. సమాజ మేలు కోసం, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నాలుగు మంచి మాటలు చెప్పండి. అంతే కానీ మిమ్మల్ని అభిమానించే వాళ్లను తప్పుదోవ పట్టించి.. వారి ప్రాణాలను తీయకండి అని ఎక్స్‌లో సజ్జనార్ పోస్టు పెట్టారు.

## పోచారంలో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా



**మేడ్చల్, నవంబర్7 (జనంసాక్షి) :** కబ్జారాయుళ్ల నుంచి పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాస కాలనీలో 400 గజాల పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి హైడ్రా అధికారులు రక్షించారు. లే అవుట్ చేసిన సమయంలో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దాన్ని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు. కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన రాలేదు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. కబ్జాకు గురయినట్లు తేలడంతో శుక్రవారం అధికారులు పార్కులో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యల పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వందేమాతరం గీతం ఆలాపన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది

**హైదరాబాద్, నవంబర్7 (జనంసాక్షి) :** రామాయంపేట మండల కేంద్రంలోని మంజీరా విద్యాలయంలో నిర్వహించిన వందేమాతర గీతం ఆలాపన కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై బాలరాజ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. వందేమాతర గీతం ఆలపించి 150 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంలో సామూహిక వందేమాతర గీతం ఆలపించారు. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని దేశాల రక్షణ కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# ఫీజు గోడు తీరేదెన్నడు..?

**ప్రతి విద్యార్థి విద్య అనేది ప్రాథమిక హక్కు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అనేవి దానం కాదు. విద్యార్థుల హక్కు. ఒకవైపు 'విద్యావంతమైన తెలంగాణ' అని చెబుతూనే, రాష్ట్రంలో మరోవైపు విద్యార్థుల భవిష్యత్తు చీకటిలో మిగిలిపోతుంది.**

ఉన్నత చదువు అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లాంటి పథకాలు ఒక గొప్ప ఆర్థిక భరోసా. ఇవి ఉన్నంత వరకూ ఉన్నత చదువు చదవాలనుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఏ ఢోకా ఉండదు. కానీ, గత కొన్నేళ్లుగా ఈ పథకం కింద ప్రభుత్వం విడుదల చేసే బకాయిలు సమయానికి విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయింది.




తెలంగాణాలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు మొత్తం 10,400 కోట్లకు పైగా చేరుకుంది. ప్రతీ సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరుతున్నారు. వారి ఆశలు మాత్రం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌పైనే ఆధారపడి ఉంటాయి. కానీ ప్రభుత్వాలు ఈ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపోయాయి. కొన్ని ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల చదువు పూర్తయినా స్కాలర్‌షిప్ ,ఫీ రీయంబర్స్‌అకౌంట్లలో పడలేదని సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆపేస్తున్నాయి. దీంతో కొందరు విద్యార్థులు లోన్లు తీసుకుని, అప్పు తీసుకొని చదువు కొనసాగిస్తున్నారు. వారిని బ్యాంకు, అప్పు వడ్డీలు తల్లిదండ్రులను బరువు వెక్కిస్తున్నాయి. దీంతో చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువును మానేయాల్సి వస్తోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు. విద్యార్థుల కలలు, కుటుంబాల ఆశలు ధ్వంసం అవుతున్నాయి. 2019 నుండి ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు సక్రమంగా జరగలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా, విడుదలలో ఆలస్యం కారణంగా మొత్తం బకాయిలు రూ. 10,400 కోట్లకు పైగా చేరుకున్నాయి.

పేద విద్యార్థులు అందులోనూ ఎస్.సి. ఎస్టీ, బి.సి. సామాజికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఉన్నత చదువులు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ పై ఆధారపడి చదువుతున్నారు.గత ఆరేళ్ళ నుండి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి సంవత్సరానికి 3000 వేల కోట్లు అవసరం అవుతాయి.కానీ 2019 నుండి ఇప్పటి వరకు బకాయిలు పేరుకోని ఉన్నాయి.

2019 నుండి 2023 వరకు -4865 కోట్లు బకాయిలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3177 కోట్లు పెండింగ్ లో ఉంచింది. ఇంకా 2025 -2026 సంవత్సరం బకాయిలు కూడా ఇంకా అదనం.ప్రభుత్వం ఒక్కోక విభాగంలో ఉన్న వాటిని క్రమంగా విడుదల చేసిన ఈ బకాయిలు లేకుండా చేయవచ్చు.ఆ వివరాలు చూస్తే ఇంజినీరింగ్ విద్యార్థులకు -2947కోట్లు, ఫార్మసి విద్యార్థులకు - 553 కోట్లు ,డిగ్రీ, పి.జీ,ఒకేషనల్ విద్యార్థులకు - 1462 కోట్లు, పాలిటెక్నిక్, ఐటిఐ,జూనియర్ కళాశాలకు -178 కోట్లుమొత్తం బకాయిలు ఉన్నాయి.

అయితే వీటిలో విద్యార్థులకు ఇచ్చే స్కాలర్ షిప్స్ మొత్తం 1924 కోట్లు పెండింగ్ లోఉన్నాయి. వీటిలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం ఇచ్చే నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటుంది. ఎస్సీ విద్యార్థులు - 842 కోట్లు, ఎస్టీ విద్యార్థులకు - 318 కోట్లు, బిసి విద్యార్థులకు - 536కోట్లు, మైనారిటీ విద్యార్థులకు -228 కోట్లు బకాయిలు ఉన్నాయి.

విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుండి ఒక్కరూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదు.

సమ్మె బాటలో యాజమాన్యాలు - ఆందోళనలో విద్యార్థులు:

ప్రభుత్వం 2025 -2026 రాష్ట్ర బడ్జెట్లో విద్యార్థుల సంక్షేమానికి 3246 కోట్లు కేటాయిస్తే 1384 (42%) కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కళాశాలకు ఇవ్వవలసిన బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూసివేశారు. 2024లో 22 ఇంజనీరింగ్ కళాశాలలు,17 డిగ్రీ,23 ఒకేషనల్ కళాశాలలు మూసివేశారు. గత ఆరేళ్ల నుండి ఉన్న బకాయిలు విడుదల కోసం ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రైవేటు యాజమాన్యాలు దఫా దఫాలుగా ఆందోళనలు బంద్ చేశారు.ప్రభుత్వం చర్చలు జరుపుతుంది తప్ప బకాయిలు విడుదల చేయడం లేదు.నిరవధికంగా బంద్ ప్రకటించిన తర్వాత వారిపై బెదిరింపులకు దిగి విజిలెన్స్ దాడులు చేస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి విద్యాసంస్థలపైకి పంపుతుంది. లక్షలాది మంది అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్న ప్రభుత్వం కనీసం భాద్యతతో వ్యవహారించడం లేదు.

**ఫీజు పథకం ఎత్తివేసేందుకు కుట్రలు:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఫీజులను విడుదల చేయాలని నాటి అధికార పక్షంపై పోరాడి, మేం అధికారంలోకి వస్తే మరింత పారదర్శకంగా అమలు చేస్తామని వారి ఎన్నికల ప్రణాళికలో పెట్టారు. వారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా అసలు ఫీజు పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నారు.రాజశేఖర్ రెడ్డి ఫీజు పథకం తెస్తే రేవంత్ రెడ్డి ఫీజు పథకం ఎత్తివేసేందుకు చర్యలు ప్రారంభించారు. నగదు బదిలీ పేరుతో డైరెక్టుగా విద్యార్థి ఖాతాలో ఫీజులు వేస్తున్నారు.ప్రభుత్వ కళాశాలలో, యూనివర్శిటీలలో ఫీజులు పెంచడం,రెగ్యులర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చడం వల్లన ప్రభుత్వ విద్యాసంస్థలలో కూడా విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ తీసుకోవాలన,కళాశాలలో చేరాలనా ముందు డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది.క్రమంగా ఫీజులు ఇవ్వడం తగ్గించడం, ఫీజుల ఖర్చులలో అవీనీతి జరిగింది అనే పేరుతో విజిలెన్స్ దాడులు చేసి నిధులు తప్పుదోవ పట్టాయనే పేరుతో ఈ పథకం ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ,స్కాలర్ షిప్స్ అనేది కేవలం పథకం కాదు ‌ అది సామాజిక న్యాయం యొక్క ఆర్థిక స్తంభం. ఈ స్తంభం కూలిపోతే, సమాన విద్యా హక్కు అనే కల సాక్షాత్కారం అవదు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి, ఈ పాస్ వ్యవస్థను పారదర్శకంగా మార్చి, ప్రతి విద్యార్థికి చెల్లింపు తేదీని నిర్ధారించాలి. విద్యార్థుల భవిష్యత్తు కాగితాల బంధనంలో కాకుండా, విద్యా సమానత్వంలో నిలబడేలా చర్యలు తీసుకోవాలి.



**టి.నాగరాజు**
**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి,**
**ఫోన్: 9490098292**

# సాహితీ నెలరేడు 'పున్నమి'

తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవం కోసం, తెలుగు భాషా వికాసం కోసం 92 ఏళ్ళుగా కృషిచేస్తున్న సాహిత్య సంస్థ 'సాహితీ మేఖల'. ఈ సంస్థను కవిరత్న అంబటిపూడి వెంకటరత్నం శాస్త్రి నల్లగొండ జిల్లా చండూరులో 1934లో స్థాపించి తెలుగు జాతికి వెలుగు బాటగా నిలిచారు. మరుగున పడిన ఈ సంస్థ కార్యభారాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని నాటి నుండి నేటి వరకు సాహితీ మేఖల కీర్తిని, ఖ్యాతిని దశ దిశలకు వ్యాపింపజేసినవారు చండూరు ప్రాంతానికి చెందిన పున్న అంజయ్య. 1982 నుండి నేటి వరకు ఈ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ పుస్తక ప్రచురణలు, సాహిత్య సభలను, కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు.



సాహితీ రంగంలో అతడొక పరిమళ పుష్పం. పత్రికారంగంలోనూ అతడు చెయ్యని సాహసం లేదు. పుట్టింది నిరుపేద చేనేత కుటుంబంలో అయినా అభిరుచి మాత్రం విడువలేదు. నిరంతర దీక్షా పట్టుదల అతని విజయానికి సోపానాలయ్యాయి. ఎన్ని విమర్శలు పొగడ్తలు వచ్చినా అతడు పొంగిపోలేదు. కృంగనూలేదు. అందుకే పత్రికారంగంలోనూ సాహితీ రంగంలోను తనదంటూ ఒక శైలిని ఏర్పరచుకున్నాడు. పాఠశాల నుండి కళాశాల స్థాయి వరకు తెలుగు అధ్యాపక వృత్తిలో కొనసాగుతూనే పాత్రికేయరంగంలో స్థిరపడినాడు. 1982 నుండి సాహితీ మేఖల పేరుతో లిఖిత మాసపత్రికను ప్రారంభించి ఆ తర్వాత పూర్తిస్థాయి సాహిత్య మాసపత్రికగా ఒక దశాబ్దకాలంపాటు నడిపారు.

తెలంగాణలో జాగృతి కలిగించిన నీలగిరి పత్రికా సంపాదకులైన షబ్నవీసు వేంకటరామ నరసింహారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా 1996 లో నీలగిరి పత్రికను పున:ప్రారంభించి కొంతకాలం నడిపారు. ఆ తర్వాత కృష్ణా పత్రికకు జిల్లా స్టాఫర్‌గా బ్యూరో ఇన్‌చార్జ్‌గా పనిచేసి పత్రికారంగంలో నిలదొక్కుకున్నారు. పున్నమి కలం పేరుతో ఇప్పటి వరకు 50కి పైగా పుస్తకాలను వెలువరించి నల్లగొండ జిల్లాలోనే ప్రముఖ కవిగా రచయితగా గుర్తింపు పొందారు. సురవరం ప్రతాపరెడ్డి వెలువరించిన గోలకొండ కవుల సంచిక మాదిరిగా 1990లో నీలగిరి కవుల సంచికను వెలువరించి నల్లగొండ జిల్లాకు సాహిత్య రంగంతోపాటు చారిత్రక పరంగా ఎంతో పేరుందని నిరూపించాడు. నీలగిరి కవుల సంచిక గురించి గ్రూప్ - 4, గ్రూప్ - 1 పరీక్షా పత్రాలలో ఒక ప్రశ్న రావడంతో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో కవికి బాగా గుర్తింపు వచ్చింది. ఇదే స్ఫూర్తితో నీలగిరి కవుల చరిత్ర పేరుతో రెండు సంపుటాలను వెలువరించి నల్లగొండ గుండెచప్పుళ్ళను ఎలుగెత్తిచాటారు.

నల్లగొండ జిల్లా చారిత్రక రాజకీయ సాహిత్య సాంస్కృతిక అంశాలను వివరిస్తూ నల్లగొండ కవులు చల్లగుండ అనే మకుటంతో శతక పద్యాలను రాశారు. నల్లగొండ జిల్లాలో శతక కవులు ఒక పరిశీలన అనే అంశంపై తెలుగు విశ్వవిద్యాలయం బొమ్మూరులో పరిశోధన చేసిన వీరు విశ్వరూప విమలచరిత పున్నమి వెలుగులు పున్నా శతకాలను కూడా రాసి శతక రచనలో మేటి అనిపించుకున్నారు.

అంతరించి పోతున్న చేనేత వృత్తిపై ఆవేదనతో రాసిన ఆకలి చావు అనే కవిత తెలంగాణ సోయిలో అచ్చయి పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టింది.

తరతరాల వృత్తిని నమ్ముకున్న పాపానికి
బతుకంతా అతుకులమయమే
మూరెడు బట్ట నేసినా
జానెడు పొట్ట నిండని దౌర్భాగ్యం
పగలంతా పట్టు పుట్టాల్ నేసినా పస్తులు
అస్తిపంజరాలే వాళ్ల ఆస్తిపాస్తులు
కాయలు గాచిన చేతుల్లో
కష్టాలు, తిష్ట వేసుక్కూర్చుంటాయ్
ఇనుప గజ్జెల తల్లి వానిల్లు ఇల్లాలు పిల్లల్ని
గుత్త చేసుకుని పెత్తనం చెలాయిస్తుంది
ఆకలి రోగాలు రొప్పులు అప్పులు
అనుక్షణం రాబందుల్లా పీక్కుతింటాయ్
గుప్పెడు వసంతం కోసం
చెట్టు ఆకుల్ని రాల్చుకున్నట్లు
తమ కళల సర్వస్వాన్నర్పించి
కలల అంచుల్లో వేళ్ళాడుతుంటారు
నిత్యం మృత్యు గీతాల్నాలపిస్తూ
అక్కడ శవాలుగ బ్రతుకులీడుస్తున్నారు

ప్రపంచ మానవాళినే గడ గడ లాడించిన కరోనా మహమ్మారి నేపథ్యంలో కాలం పేరుతో కవితా సంపుటిని వెలువరించి కవిగా నిద్రాణమై వున్న సమాజాన్ని మేల్కొలిపి కర్తవ్యోన్ముఖులుగా చేయడానికి చైతన్యపరచడానికి దోహదపడ్డారు.

సాహిత్య సాంస్కృతిక కళారంగాలకు వెన్ను దన్నుగా ఉండి ఉద్యమాలకు కేంద్ర బింధువుగా నిలిచిన నల్గొండను కీర్తిస్తూ మొత్తం 58 కవులు రచించిన కవితలు పద్యాలు గేయాలతో మన నల్లగొండ పేరిట సంకలనంగా తెచ్చారు.

నల్లగొండ నుండి వెలువడిన ప్రజాపోరు సాయంకాల దినపత్రికలో ప్రజాభేరి శీర్షికన సుమారు వెయ్యి రన్నింగ్ కామెంటరీలను రాసి పాఠకుల నుండి విశేషాదరణ పొందారు. అదే విదంగా చండూరు మండలం అంగడిపేట గ్రామానికి చెందిన ఒక యదార్ధ వృదార్ధ గాధను ఇతి వృత్తంగా చేసుకొని ప్రజాపోరులో 48 వారాలు సీరియల్‌గా వచ్చిన మరో మౌనపోరాటం నవల కూడా పాఠకుల నుండే కాకుండా దర్శకరత్న దాసరి ప్రశంసలందుకుంది. ఇవేకాకుండా కథావళి (కథల సంపుటి) వ్యాసావళి (వ్యాసాల సంపుటి ) నల్లగొండ నానీలు, చేనేత నానీలు, గీతావళి, తెలుగు తల్లి, తెలంగాణ తల్లి, తెలుగు వెలుగు, పున్నమి రన్నింగ్ కామెంటరీ సాహితీ కుసుమాలు ప్రతిభావంతుడు డా॥ ఎం ప్రభాకర్ రెడ్డి వంటి విలువైన రచనలతో సాహిత్య సృజన చేశారు. ఈ విధంగా నల్లగొండ జిల్లాలో కవిగా రచయితగా పరిశోధకుడుగా పత్రికా సంపాదకుడుగా సాహిత్య సేవలందిస్తూ నేటి యువకులకు స్ఫూర్తిగా నిలుస్తున్న సాహితీ కృషీవలుడు పున్నమి.

**(నవంబర్ 10న 65వ జన్మదినోత్సవము సందర్భంగా)**



**డా॥ తిరునగరి శ్రీనివాస్**
**సెల్: 9441464764**

# మొగ్గ..



మొగ్గ ఇంకా పుష్పించలేదు..
ప్రకాశించలేదు
ఒక సుహృద్భావ
వాతావరణంలో ఒక స్నేహ సామరస్యంలో
అల్లారుముద్దుగా పెరిగి
ఏదితప్పో ఏదిఒప్పో తెలియని దశలో
కాళ్ళకి పట్టీలు వేసుకొని అవి శబ్దిస్తుంటే
పరవశించే మొగ్గ
ఒక ముందుచూపు ఒక జాగరూకత ఎరగని
మొగ్గ
అల్లకల్లోల రాత్రి లోంచి వికసిత కుసుమం
కాలేని మొగ్గ
గాయపడింది
గ్రీష్మతాపానికి వడలిపోయిన మొగ్గ
గొంతు పెగలడం లేదు
మాట రావడం లేదు
రాజకీయ బలిమిని చూసుకొని
ఒక అజ్ఞాత బాహుబంధనాల్లో
బుగ్గలు ఎర్రబడ్డాయి
సిగ్గులు రాలిపడ్డాయి
కాలచక్రంలో వంతెన దాటాలి
అడివిలో పూసిన ఓ పున్నమి మొగ్గ
కొలిమిలో కాలిన ఓ పసిడి మొగ్గ
కట్టాలు పోతాయి
నీకు నీవే..
వెన్ను తట్టుకో ధైర్యం చెప్పుకో..
వేకువకి ఎర్రతివాచి పరిచేసుకో..

**కోటం చంద్రశేఖర్**
**9492043348**


## నవ శకం@298

పురిటి నొప్పుల అమ్మతనం
జీవననాద యుద్ధంలో
'అబ్బాయి' వారసత్వ పరిమళాల
అజ్ఞాన సమాజ గమనంలో
హర్మన్ ప్రీత్ గాల్లో ఎగురుతూ
రెండు చేతులతో కలల రెక్కల
కప్ క్యాచ్ గట్టిగానే పట్టుకుంది
ఐదు దశాబ్దాల పోరాట సంకేత కాంతికి
అమ్మాయిల ఆశయాల ఆట శక్తికి
విశ్వ విజేతగా స్వేచ్ఛా స్వేదపు
కొత్త పసిడి రంగులద్దింది..!

ఆత్మవిశ్వాసాల శాటిలైట్ బంతి సిగ్నల్స్
క్రికెట్ రాకెట్ బ్యాట్ పట్టుకొని
అమ్మాయిల మైదాన అంతరిక్షంలో
వందేమాతర ధ్వనుల వనంతో నిండిపోయింది
మిథాలీ రాజ్ గుండెలయలు
సగర్వంతో ఆనంద వర్షాన్ని కురిపిస్తుంటే
సచిన్ మది సౌధం సంబరపడిపోయింది
రోహిత్ పరుగుల భావోద్వేగం
విజయాకాశం అంచును దాటింది..!

జెమీమా గెలుపు పిలుపుల హైవేను నిర్మిస్తే
దీప్తి శర్మ ఆల్ రౌండ్ కాంతుల
తారాలోకం తరలివచ్చింది
షెఫాలీ వర్మ అడుగుల జ్వాలలు
వికెట్ల గుండె ఊపిరి ఆపేస్తుంటే
పదకొండు కోహినూరు వజ్రాలు
భారతీయుల గుండెలయలను
ఒక్కటి చేసి త్రివర్ణ పతాక శిఖరమై మోస్తూ
ఉత్సాహంగా పరిగెడుతుంటే
మతసామరస్య వెలుగుల చినుకులు
విశ్వ వేదికపై కరతాల ధ్వనులతో
కొత్త చరిత్రను రాశాయి

లింగ వివక్షత సిగ్గుతో తలదించుకుంది
అవమానాల సమూహం ఒంటరిదైపోయింది
వైఫల్యాల విషాద సంద్రం
స్త్రీ శక్తి వికాస కెరటాల సాక్షిగా
విను వీధుల్లో మేరా భారత్ మహాన్
నినాదమై ప్రతిధ్వనిస్తుంది
కాలం కంగ్రాట్యులేషన్ గా మారి
నవ శకానికి ప్రభాత గీతం అయింది..!




**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

# నూతన చరిత్ర సృష్టించిన న్యూయార్క్

**జోహ్రాన్ మందానీ విజయ ప్రసంగం..**

ఈ సాయంత్రం మన నగరంపై సూర్యుడు అస్తమించినా, యూజీన్ డెబ్స్ అన్నట్లు: "మానవత్వానికి ఒక మంచి ఆరుణోదయం వస్తుందని నాకు కనిపిస్తోంది."ఎప్పటి నుంచో, న్యూయార్క్‌లోని ధనవంతులు, వారితో సంబంధాలు ఉన్నవారు ఇక్కడి కార్మికులకు ఇలా చెబుతూనే ఉన్నారు, అధికారం మీ చేతుల్లో ఉండదని.

గోదాంలో పెట్టెలు మోసి నీలి మచ్చలు పడ్డ వేళ్లు, డెలివరీ సైకిల్ హ్యాండిల్స్ వల్ల గట్టిగా మారిన అరచేతులు, కిచెన్‌లో కాలిన గాయాలు ఉన్న ముడివేళ్లు... ఇలాంటి చేతులకు అధికారాన్ని పట్టుకునే అవకాశం ఎవరూ ఇక్కడ ఇవ్వలేదు.




కానీ గత 12 నెలల్లో మీరు మరింత పెద్ద ఊహాకోసం చేయి చాచారు. ఈ రాత్రి, ప్రతి అడ్డంకిని దాటుకుని మన చేతుల్లో భవిష్యత్తును పట్టుకున్నాం. నా మిత్రులారా, ఒక రాజకీయ వంశాన్ని మనం కూల్చేశాం! ఆండ్రూ కువోమో గారి వ్యక్తిగత జీవితానికి శుభాకాంక్షలు. కానీ ఈ రాత్రి ఆయన పేరును నేను చివరిసారిగా పలుకుతున్నాను. ఎందుకంటే మనం కొద్దిమందికి మాత్రమే సేవ చేసే అలాంటి రాజకీయానికి ముగింపు పలుకుతున్నాం.

న్యూయార్క్!, ఈ రాత్రి మీరు తీర్పు ఇచ్చారు మార్పు కోసం తీర్పు. కొత్త రాజకీయ శకం కోసం తీర్పు. అందరికీ అందే ఒక నగరం కోసం తీర్పు. సేవ చేసే ప్రభుత్వానికి తీర్పు. జనవరి 1న నేను న్యూయార్క్ సిటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తాను. అది మీ వల్లే. కాబట్టి ముందుగా మీ అందరికీ ధన్యవాదాలు. మెరుగైన భవిష్యత్ అనే ఆశ గతంలో ముగిసిందని అనుకోకుండా నాతో నిల్చుకున్నందుకు - రాబోయే తరానికి చెందిన న్యూయార్కర్లకు కూడా ధన్యవాదాలు. రాజకీయాల్లో అరుదుగా కనిపించే ఒక సరికొత్త నాయకత్వ శకానికి మీరు మార్గం చూపారు. మేము మీ కోసం పోరాడతాము ఎందుకంటే మేము మీలో ఒకళ్ళం.

స్టెయిన్ వే లో ఎలా చెబుతారో అలాగే: "అనా మింకుమ్ వ అలైకుమ్ " నేను మీలో ఒకణ్ణి, మీకోసమే ఉన్నాను. మన నగర రాజకీయాలు తరచూ మరచిపోతూ వచ్చినవారికి ధన్యవాదాలు. యెమెన్ బోడేగా యజమానులు, మెక్సికన్ అమ్మమ్మలు, సెనెగల్ టాక్సీ డ్రైవర్లు, ఉజ్బెక్ నర్సులు, ట్రినిడాడ్ వంటవారు మరియు ఇథియోపియన్ అత్తలు. అవును, అత్తలు కూడా. కెన్సింగ్టన్, మిడ్వుడ్, హంట్స్ పాయింట్‌లోని ప్రతి న్యూయార్కర్ గమనించండి: ఈ నగరం మీదే. ఈ ప్రజాస్వామ్యం మీదే. ఈ ప్రచారం వెస్లీలాంటి వారిదే , వారికోసమే ఎల్మ్‌హర్స్ట్ ఆసుపత్రి బయట నేను కలిసిన 1199 ఆర్గనైజర్. అతడు న్యూయార్క్ కోసం పనిచేసి రెంటు ఎక్కువ కాబట్టి పెన్సిల్వేనియాలో ఉండాల్సి వస్తుంది. Bx33 బస్సులో నేను కలిసిన ఆ మహిళ కోసం "నాకు న్యూయార్క్‌పై ఉన్న ప్రేమ తగ్గిపోయింది%'%ఇప్పుడు ఇది కేవలం నేను జీవించే స్థలం" అన్న ఆమె కోసం. సిటీ హాల్ బయట నాతో కలిసి 15 రోజుల నిరాహార దీక్ష చేసిన టాక్సీ డ్రైవర్ రిచర్డ్ కోసం అన్నా...! మనం ఇప్పుడు సిటీ హాల్‌లో ఉన్నాం.

ఈ విజయం వాళ్లది. మీ అందరిది. 100,000 కుపైగా వాలంటీర్లది. ఈ ప్రచారాన్ని అప్రతిహత శక్తిగా మార్చిన మీరు. ప్రతి తలుపు తట్టి, ప్రతి సంతకం తీసి, ప్రతి నిజాయితీ మాటతో ఇక్కడి రాజకీయాల్లోని నిరాశను కరిగించేశారు మీరంతా. గత ఏడాది నేను చాలా కోరాను. మీరు ప్రతిసారి స్పందించారు.

ఇప్పుడు ఒక చివరి అభ్యర్థన:

ఓ న్యూయార్క్ ! ఈ క్షణాన్ని లోపలికి పీల్చుకోండి. మన శ్వాసను ఎన్నాళ్లుగానో పట్టుకున్నాం. ఓటమి భయంలో, ఆశలు విరిగినప్పుడు, ఊపిరి అందని పరిస్థితుల్లో కూడా. అందుకే ఇప్పుడు పుడుతున్న కొత్త నగర గాలిని మనం లోపలికి పీలుద్దాం. నా ప్రచార బృందానికి మీరు నమ్మారు, చరిత్ర సృష్టించారు. ఇప్పుడు మీరు నిద్ర పోవచ్చు. అమ్మ, నాన్న మీరు నన్ను ఇలా తీర్చిదిద్దారు. నా భార్య రమా హయాతీ ఈ క్షణానికైనా, ప్రతి క్షణానికైనా, నీతోనే ఉండాలని కోరుకుంటాను. నన్ను ఓటు చేసినవారైనా, చేయనివారైనా, నిరాశతో ఓటు వేయని వారైనా మీ విశ్వాసానికి తగినవాడినని నేను ప్రతిరోజూ నిరూపిస్తాను. కొంతమంది ఈ రోజు రాదనుకున్నారు. ప్రతి ఎన్నికలో మార్పు అసాధ్యం అనుకున్నారు. కానీ ఈ రాత్రి ఆ భయాలకు మనం సమాధానం ఇచ్చాం. ఆశ ఇంకా బతికే ఉంది. దాడుల తర్వాత కూడా వాలంటీర్‌గా నిలిచే వేలాది మంది దానిని నిరూపించారు. మన ఓట్లు ఒంటరిగా వేసినా ఆశను మనతో కలుపుకుని ఎన్నుకున్నాం. అధికారానికి కాదు, మన ఆశకు గెలుపు.

జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్లు : "చరిత్రలో అరుదుగా వచ్చే క్షణాలు ఉంటాయి. పాతదాని నుంచి కొత్తదానికి అడుగుపెట్టే వేళ "అని ఈ రాత్రి మనం అదే చేశాం. ఇప్పుడు ఈ కొత్త శకం ఏమి ఇస్తుంది చెప్పాలి... స్పష్టంగా, ధైర్యంగా. నాయకులు కారకులు కాదు, మనం చూసే దృష్టే ఒక యుగాన్ని నిర్మిస్తుంది. జీవన వ్యయ సంక్షోభంపై చరిత్రలోనే పెద్ద పోరాటం: 2 మిలియన్ల రెంట్-స్టెబిలైజ్డ్ ఇళ్లకు రెంట్ ఫ్రీజ్, ఫాస్ట్ & ఫ్రీ బస్సులు, యూనివర్సల్ చైల్డ్‌కేర్.

సంవత్సరాల తర్వాత మన పశ్చాత్తాపం ఒక్కటే. ఈ రోజు కొంచెం ముందే రావాల్సింది అని. మనము మరిన్ని టీచర్లను నియమిస్తాము. వ్యవస్థలో వృథా ఖర్చులను తొలగిస్తాము.

NYCHAలో దీపాలు మళ్లీ వెలిగిస్తాము. సురక్ష, న్యాయం కలిసి నడుస్తాయి. మెంటల్ హెల్త్, నిరాశ్రయుల సమస్యలు నేరుగా ఎదుర్కొంటాం. అత్యుత్తమ నియమం. ఏమాత్రం మినహాయింపు కాదు.

ఇక్కడ ద్వేషం ద్వారా గెలవలేరు. న్యూయార్క్ ఒక కాంతి. వలసదారుల హక్కు, ట్రాన్స్ సమాజ రక్షణ, బ్లాక్ మహిళలకు, సింగిల్ మదర్స్‌కి మేమున్నాం.

యూదు న్యూయార్కర్లతో నిలబడతాం. 1 మిలియన్ ముస్లింలకు ఇది వారి నగరమని చెప్తాం. ఇస్లామోఫోబియాతో గెలిచే రాజకీయం ఇక ముగిసింది. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుంది.మానవతతో పని చేస్తుంది. ఆర్థిక బలం ఉన్నవారు మమ్మల్ని విభజించాలనుకుంటారు. $30 సంపాదించే వారిని $20 సంపాదించే వారితో పోరాడించాలని చూస్తుంటారు.

మనం అలా జరగనివ్వం. ఇప్పుడు మనం కొత్త మార్గం. ధైర్యమయిన మార్గం. డోనాల్డ్ ట్రంప్! మీరు ఈ కార్యక్రమం చూస్తున్నారని తెలుసు. అందుకే మీకు చెబుతున్నాను

మీ టీవీ వాల్యూమ్ పెంచుకోండి. చెడ్డ ల్యాండ్‌లార్డులను బాధ్యత వహింపజేస్తాం. బిలియనీర్లు తప్పించుకునే మార్గాలు నిలిపేస్తాం. యూనియన్లతో నిలబడతాం. వలసవాదుల నగరం, వలసవాదుల శక్తి ఈ రాత్రి నుంచి, వలసవాదుల నాయకత్వం. ఈ నాయకత్వం అందరికీ చేరాలి. క్యాంపెయిన్ కవిత్వమైతే, పాలన గద్యమని అంటారు. అయినా, ఆ గద్యం కూడా రాగంతో కలిసే ఉంటుంది. నేను యువకుడిని. ముస్లింని. సోషలిస్ట్‌ని. దీనికి నేను క్షమాపణ చెప్పను. ఇక జాగ్రత్తల పేరుతో వెనకడుగు లేదు. మన గొప్పతనం ఇప్పుడు పుస్తకాల్లో కాదు, మన జీవితాల్లో ఉంటుంది. ప్రతి కుటుంబం, ప్రతి అద్దెదారు, ప్రతి అమ్మ, ప్రతి తాతమ్మకి ఈ నగరం తిరిగి ప్రేమ చూపే రోజులు వచ్చాయి.

**క్యాంపెయిన్ కవిత్వమైతే, పాలన గద్యమని అంటారు. అయినా, ఆ గద్యం కూడా రాగంతో కలిసే ఉంటుంది. నేను యువకుడిని. ముస్లింని. సోషలిస్ట్‌ని. దీనికి నేను క్షమాపణ చెప్పను. ఇక జాగ్రత్తల పేరుతో వెనకడుగు లేదు. మన గొప్పతనం ఇప్పుడు పుస్తకాల్లో కాదు, మన జీవితాల్లో ఉంటుంది. ప్రతి కుటుంబం, ప్రతి అద్దెదారు, ప్రతి అమ్మ, ప్రతి తాతమ్మకి ఈ నగరం తిరిగి ప్రేమ చూపే రోజులు వచ్చాయి.**

కలిసి రెంటు ఫ్రీజ్ చేస్తాం. బస్సులు వేగంగా, ఉచితంగా చేస్తాం. యూనివర్సల్ చైల్డ్‌కేర్ విస్తరిస్తాం. మన కలలు ‌ మన కార్యాచరణ. మన శబ్దం ‌ మన విధానం. ఈ శక్తి మీదే. ఈ నగరం మీదే.

**తెలుగు అనువాదం : దేవి పాలిన**

## "జన్మల విడదీతల్లో..."

ఏదో ఒక రోజు
నువ్వు మళ్ళీ నన్ను చూడలేవు!

నువ్వెంత పిలిచినా
నే తిరిగి రాలేను!

నువ్వు నన్ను చూడాలంటే...
నువ్వే నా దగ్గరికొచ్చేయ్యాలంతే!

ఆపై ఈ జన్మల విడదీతల్లో,
నీవెక్కడో!? ఇక నేనెక్కడో!?

**-బాలాజీ పోతుల**
**8179283830**

## పాత దోస్తు పలకరించిన వేళ!



ఎండా పొడసూపింది,
ఈ వారం దినాలల్ల ఒకటే కుండపోత
వర్షం.

బయట కాలు పెడితే గిజ్జుమనటం,
ఎక్కడన్నా తిరుగుదామంటే ఒకటే
ఈదురుగాలి.

చీమిడి చీదీ చీదీ,
ముక్కు ఎర్రబడ్డది.

ఉతికిన బట్టలు ఎండక,
ఎండ కోసమే ఎదురుచూపులాయే!

ఎండ పడ్డంకా,
ఎన్నాళ్లకో తిరిగి కానొచ్చిన దోస్త్ మల్లే,
సూర్యున్ని జూడటం ఒకింత సంతోషం!

**బాలాజీ పోతుల**
**8179283830**

## అనాథ అమ్మాయిలకు అండగా ఉందాం



**తాండూరు, నవంబర్ 7 (జనంసాక్షి) :** ఇద్దరు అనాథ అమ్మాయిలకు అండగా ఉందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేశ్ కుమార్ పిలుపునిచ్చారు.చేవెళ్ల బస్సు ప్రమాదం లో తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన హాజీపూర్ చిన్నారులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేశ్ కుమార్ గ్రాసరి అందించారు.శుక్రవారం యాలాల మండలం హాజీపూర్ లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేశ్ కుమార్ తల్లి తండ్రి ని కోల్పోయిన పిల్లలకు గ్రాసరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసు లోనే తనవాళ్ళను కోల్పోయి గుండెలవిసేలా రోదిస్తున్న ఆ పిల్లలను చుస్తే ఎవ్వరికైనా గుండె బరువెక్కుతుందన్నారు. మనమందరం ఉన్నామని వాళ్ళు ఒంటరి కాదని వారికీ భరోసా కల్పిద్దాం,భవిష్యత్తులో వాళ్లకు మంచి జీవితం కలిగేలా మనవంతు సహాయం అందిద్దాం అన్నారు. పెద్దఅమ్మాయికి పదవతరగతి క్లాస్ ఎగ్జామ్స్ రాయిస్తానని చెప్పారు. అదేవిదంగా ప్రభుత్వం అమ్మాయికి ఉద్యోగ భరోసా నివ్వాలని విజ్ఞప్తి చేసారు. ఈ విషయం స్థానిక ఎ మ్మెల్యే మనోహర్ రెడ్డికి మరియు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ద్రుష్టి కి తీసుకెల్తానని అన్నారు.

# చేవెళ్ల బస్సు ప్రమాదం బాధితులకు కవిత పరామర్శ

- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

**చేవెళ్ల, నవంబర్ 7 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధి మిర్జాగూడ సమీపంలో జరిగిన టిప్పర్ - ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఆమె, గాయాల తీవ్రత, చికిత్స స్థితిగతులపై వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...19 మంది మరణం, 40 మందికి పైగా గాయాలు కావడం హృదయ విదారకమని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారంతా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారేనని, గాయపడిన వారు కనీసం ఆరు నెలలు చికిత్స అవసరం ఉన్నవారని పేర్కొన్నారు. వీరికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎన్హెచ్-163



రహదారిపై నిర్మాణ లోపాలే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని కవిత అన్నారు. రహదారి ఇరువైపులా కుంగిపోవడం వల్ల వాహనాలు మధ్యభాగంలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు నిధులు కేటాయించి, టెండర్లు పూర్తి అయ్యి సంవత్సరాలు గడిచినా పనులు నిలిచిపోయాయని విమర్శించారు. పర్యావరణ ప్రేమికులు వృక్షాల సంరక్షణ పేరుతో వేసిన కేసులను పరిష్కరించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహించిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రహదారి విస్తరణను అత్యవసరంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దారిలో ఇప్పటికే మూడు వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ప్రతి సారి ప్రమాదం తర్వాత ప్రజలు రోడ్డుపై ధర్నాలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వాలు మాత్రం కనీస స్పందన చూపడం లేదని విమర్శించారు. తాండూరులో రోడ్డు విస్తరణ కోసం ధర్నా చేసిన 30 మందిపై కేసులు నమోదు చేయడం అన్యాయం అని ఆమె అన్నారు. ప్రజల బాధను అర్థం చేసుకోవాల్సిన బదులు వారిపైనే కేసులు పెట్టడం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని, రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభించి, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం, గాయపడిన వారికి పది లక్షల సహాయం అందించాలని కవిత స్పష్టం చేశారు.

## రైతు ఆదాయానికి బంగారు పంటగా ఆయిల్‌పామ్

- రఘునాథపాలెం మండలంలో అవగాహన సదస్సు
- తుమ్మల యుగంధర్ ఆధ్వర్యంలో రైతు వేదికలో విశేష స్పందన



**రఘునాథపాలెం, నవంబర్ 7 (జనం సాక్షి) :** రఘునాథపాలెం మండలం రైతు వేదికలో శుక్రవారం ఆయిల్ పామ్ తోటల సాగుపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కుమారుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ "ప్రస్తుత కాలంలో పంటలలో లాభాలు తగ్గిపోతున్న తరుణంలో ఆయిల్ పామ్ సాగు రైతులకు బంగారు అవకాశం. ఈ పంట నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఆదాయం అందిస్తుంది" అని తెలిపారు. ఆయిల్ పామ్ పెంచడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ, ప్రోత్సాహకాలు అందుతాయని చెప్పారు. ప్రసంగించిన నాయకులు ఆయిల్ పామ్ పంటతో రైతులు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని, పంటలో కొత్త సాంకేతికతలను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ హనుమంతరావు, మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, గుత్త వెంకటేశ్వరరావు, తాత రఘురాం, నల్లమల వెంకటేశ్వరరావు, దీప్లా నాయక్, దుంపటి నగేష్, బావ్ సింగ్, మరియు రఘునాథపాలెం మండలం పరిధిలోని పలు గ్రామాల గ్రామ నాయకులు, రైతు సమితి ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగి, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. సమాప్తి సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ, "రైతు అభివృద్ధే నా లక్ష్యం. ప్రతి రైతు కుటుంబం స్వయం సమృద్ధిగా మారే దిశగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

## నాగారం మద్యం దుకాణంపై రగడ...

- ఇదే కాలనీలో పాత మద్యం దుకాణంపై ఎందుకు మౌనం
- భాగస్వామ్యం ఇవ్వనందుకే చంద్రారెడ్డి మద్యం దుకాణంపై తిరుగుబాటు
- జీవన్ రెడ్డి, పవన్ రెడ్డి

**కాప్రా, నవంబర్ 7 (జనం సాక్షి) :** నాగారం మున్సిపాలిటీ లో నూతన మద్యం దుకాణం ప్రభుత్వ లక్కీ డ్రా లో షాప్ 1. పవన్, జీవన్ కు వచ్చింది అని అన్నారు. ఇందులో భాగంగానే నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి స్థలం లీజుకు అడగగా రెంట్ కాకుండా,భాగస్వామ్యం అడిగారు.మేము అందుకు ఒప్పుకోనందుకు నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి కాలనీ వాసులనూ ఉసిగొల్పి కుట్రా పూరితంగా నిరసన కార్యక్రమం చేయిస్తూ, పలు విధాలుగా అడ్డంకులు సృష్టిస్తున్నారు. సత్యనారాయణ కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెక్యూరిటీ గార్డ్స్ ను ఏర్పాటు చేస్తామని, అలాగే ఈ మెయిన్ రోడ్డులోని సిసి కెమెరాలను కీసర పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేసి సెక్యూరిటీ కల్పిస్తామని కాలనీ వాసులుకు తెలియచెప్పడం జరిగింది.శుక్రవారం రోజు నిరసన కార్యక్రమం లో పూర్తిగా సత్యనారాయణ కాలనీ వాసులు లేకుండా కూడా రోడ్డు మీద నుంచి కొంత మంది రోజు వారి కూలీలను



తీసుకొచ్చి, చంద్రారెడ్డి తన స్వార్ధ కోసం కాలనీ లో అలజడులు సృష్టించి ఈ నూతన మద్యం దుకాణం పై లేనిపోని వదంతులు కలగచేస్తున్నాడు. ఇక్కడా ఉన్నా ప్రైవేట్ పాఠశాల కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దూరం లో ఉంది. మరియు ఇదే కాలనీ లోని రోడ్డు నెంబర్ 12 లో పాత మద్యం దుకాణం చంద్రారెడ్డి ప్లాట్ లో ఉంది. ఆ పాత మద్యం దుకాణం వెనకాల చైతన్య ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది అయినా ఆనాడు ఎలాంటి అభ్యంతరం కాలనీ వాసులు తెలపలేదు. ఈ రోజు అభ్యంతరం తెలుపుతున్నారు అంటే అది కేవలం చంద్రారెడ్డి కుట్ర పూరితమే అని పవన్ రెడ్డి,జీవన్ రెడ్డి అన్నారు. ఈ కొత్త మద్యం దుకాణం అన్ని విధాల ప్రభుత్వ నియమ నిబంధనల కు అనుగుణంగా సంబంధిత శాఖ అనుమతి తో వైన్స్ షాప్ ప్రారంభం చేయబడుతుంది అని పవన్ రెడ్డి, జీవన్ రెడ్డి ప్రెస్ మీట్ లో తెలిపారు.

## గిరిజనులను భయబ్రాంతులకు గురి చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

- సర్వేల పేరుతో వేధిస్తున్నారని గిరి పుత్రుల ఆందోళన
- సిపిఐ పార్టీ గిరిజనులకు అండగా ఉంటుంది
- పేరాల శ్రీనివాస్



**బూర్గంపహాడ్, నవంబర్ 7 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీ గిరిజనులను ఫారెస్ట్ అధికారులు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని, గిరిజనులను భూ సర్వేల పేరుతో వేధిస్తున్నారని గిరి పుత్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలో 2018 లో నాలుగుసార్లు రెవెన్యూ పంచాయతీ అధికారులు అందరూ కలిసి సర్వే చేశారు. సర్వే చేసిన ప్రతిసారి మా దగ్గర నుంచి కొంత భూమి లాక్కుంటున్నారని, ఈసారి కూడా సర్వే అని చెప్పి భూమి లాక్కుంటారేమో అని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. గత్యంతరం లేక 30 సంవత్సరాలుగా చీకటి లోనే ఉంటున్నామని, మాకు ఎలాంటి మౌలిక ఆవసతులు కల్పించకపోగా మా భూములు లాక్కోవటానికి ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. మా గ్రామం గత 30 సంవత్సరాలుగా ఏ నాయకులు మా గ్రామానికి చేసింది ఏమీ లేదని, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మా గ్రామంపై చొరవ తీసుకొని మాకు 23 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డు వేయించారన్నారు. మా గ్రామానికి కరెంటు కరెంటు మంజూరు అయింది కానీ ఫారెస్ట్ అధికారులు కరెంటు వేయకుండా అడ్డుకుంటున్నారని, గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగకుండా ప్రతి పనిని అడ్డుకుంటూ మమ్మల్ని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి వెళ్లి మీకు సిపిఐ పార్టీ అండగా ఉంటామని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోడే చంద్రయ్య, సీతారామయ్య, జగ్గయ్య, కన్నయ్య, బాబురావు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల నైపుణ్యం పెంచుకోవాలి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీసులకు సైబర్ క్రైమ్, కాల్ డేటా రికార్డు (సి డి ఆర్) అనాలిసిస్‌పై జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో (డిటిసి) నిపుణులతో ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి ఆధునిక యుగంలో సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని అన్నారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే పోలీసు సిబ్బంది తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాల్ డేటా రికార్డు (సి డి ఆర్) విశ్లేషణ ద్వారా నేరాలను ఛేదించడంలో మరింత వేగం, స్పష్టత సాధ్యమవుతుందని వివరించారు. జిల్లాలో సైబర్ క్రైమ్ సంఘటనలను గణనీయంగా తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ముఖ్యంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన ఆవశ్యకత గురించి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ఎస్.శ్రీనివాసులు (డిఎస్పి), శ్రీనివాస్ రెడ్డి (డిఎస్పి వికారాబాద్), జానయ్య (డిఎస్పి, డిసిఆర్‌బి వికారాబాద్) తో పాటు, సిఐ అధికారులైన శ్రీధర్ రెడ్డి (కోడంగల్) ఎస్.శ్రీనివాస్ రెడ్డి (పరిగి) వెంకట్ (మొమింపేట్) నాగేశ్ (కరణ్ కోట్) హాజరయ్యారు. వీరితో పాటు 09 మంది ఎస్.ఐ.లు, 02 మంది హెచ్.సి.లు, మరియు 19 మంది పి.సి.లు సహా మొత్తం 34 మంది పోలీసు సిబ్బంది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని శిక్షణ వివరాలను తెలుసుకున్నారు.



## గర్భిణీలకు 102 సర్వీస్ ఉచిత సేవలు

**కొడంగల్, నవంబర్ 7 (జనం సాక్షి) :** గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో గర్భిణీలకు ఉచిత వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 102 సర్వీస్ కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా అందుబాటులో ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గర్భధారణ ప్రారంభం నుంచే నెలనెలా వైద్య పరీక్షల కోసం గర్భిణీలను ఆసుపత్రులకు తరలించి, పరీక్షల అనంతరం తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుస్తుంది. పురిటి నొప్పులు వచ్చినప్పుడు 102 నంబరుకు ఫోన్ చేస్తే వాహనం ఇంటి వద్దకే వచ్చి గర్భిణీని సమీప ఆసుపత్రికి తరలిస్తుంది. ప్రసవం అనంతరం తల్లి, శిశువును తిరిగి స్వగ్రామానికి తీసుకువెళ్తుందనీ అన్నారు.ఈ సేవ 24 గంటలు నిరంతరంగా అందుబాటులో ఉంటుంది. అలాగే అత్యవసర పరిస్థితుల్లో శిక్షణ పొందిన సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, అవసరమైతే ఆసుపత్రిలో చేరుస్తారు అన్నారు.ఈ సర్వీస్‌ను ప్రభుత్వం జాతీయ ఆరోగ్య భద్రత పథకం కింద పూర్తిగా ఉచితంగా అందిస్తోంది.దీనికి సంబంధించి వికారాబాద్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పీ.ఏ. శ్రీకాంత్ పవర్ మరియు జిల్లా ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఈ.ఎం.ఇ. ప్రదీప్ కుమార్ తెలిపారు.సేవలు సమయానుసారం, పూర్తితీ బాధ్యతో నిర్వహిస్తున్నాం అని తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంలో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది అని పేర్కొన్నారు.




# వందేమాతరం గీతం దేశ ఐక్యతకు ప్రతీక

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) :** వందేమాతరం గీతం దేశ ఐక్యతకు ప్రతిక అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు వందేమాతర సామూహిక గీతాలాపన బంకిమ్ చంద్ర ఛటర్జీ వందే మాతరం జాతీయ గీతాన్ని రచించి150 సంవత్సరాలు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందే మాతరం గీతాన్ని సామూహిక గానం చేశారు రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతలతో కలిసి ఉదయం 10.గంటలకు వందే మాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరు ఈ భావనను మనసులో నిలుపుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ పాఠశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత భావాలు మరింత బలపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి పౌరుడు, విద్యార్థులు ఈ గీతం ద్వారా దేశసేవా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ



చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముంపు బాధిత విద్యార్థులకు అండగా తుమ్మల యుగంధర్

- ఆపద్బాంధవుడిగా నిలిచిన నేత
- నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ
- చిన్నారులతో సహపంక్తి భోజనం

**జలగంనగర్, నవంబర్ 7 (జనం సాక్షి) :** ఇటీవల అకాల వర్షాల ప్రభావంతో జలగం నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ముంపునకు గురై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవనం నీటిలో మునిగిపోవడంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి స్కూల్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చమని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పాఠశాలను అరెంపులలోని మహమ్మదీయ కాలేజీ వద్దకు తరలించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, స్థానికుల మన్ననలు పొందింది. ఆ సందర్భంలో పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదల అవసరాన్ని కూడా గుర్తించారు. ఆ అవసరాన్ని తీర్చడానికి ముందుకు వచ్చినవారు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్. తుమ్మల



యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం డాక్టర్ తుమ్మల యుగంధర్ వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థుల కోసం తన సొంత ఖర్చుతో నోట్ బుక్స్ అందజేశారు. ఆయన ఆప్యాయతకు కృతజ్ఞతగా పాఠశాల యాజమాన్యం యుగంధర్ ని పాఠశాలకు ఆహ్వానించింది. శుక్రవారం ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులను స్వయంగా పలకరించారు. తుమ్మల యువసేన తరఫున 250 స్కూల్ బ్యాగ్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఒక్కొక్కరితో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాల పెంపుకు సూచనలు చేశారు. పాఠశాల వాతావరణంలో ఉత్సాహం నింపుతూ యుగంధర్ మాటలు పిల్లల్లో కొత్త ఆశను నింపాయి. సేవే ధర్మమని ఆయన ప్రవర్తనతో చూపించారు. మాటల్లో కాదు, మానవత్వంలో మమకారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన యుగంధర్ పిల్లలకు మానవత్వ పాఠం నేర్పారు. భోజన సమయంలో పిల్లలతో ముచ్చటిస్తూ వారి కలలను తెలుసుకున్నారు. "మీరు బాగా చదివి మంచి స్థాయిలో నిలవాలి" అని ప్రోత్సాహపరిచారు. ఆయన సాన్నిహిత్యం చూసి పిల్లలు ఆనందంతో కళకళలాడారు. ఉపాధ్యాయులు, యాజమాన్యం ఆయన వినమ్రతను ప్రశంసించారు. స్థానికులు కూడా ఆయన సానుభూతి దృష్టిని కొనియాడారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన వసతులు కల్పిస్తామని యుగంధర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భం పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే అభిప్రాయం వ్యక్తమైంది. పాఠశాల యాజమాన్యం ఆయన సహాయానికి కృతజ్ఞతలు తెలిపింది. స్థానిక ప్రజలు కూడా ఆయన సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. యుగంధర్ సందర్శన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని రేకెత్తించింది.

## సామూహిక వందేమాతరం గీతాలాపన

**ఖమ్మం, నవంబర్ 7 (జనం సాక్షి) :** వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటీతో 150 ఏళ్ల పూర్తయ్యాయని తెలిపారు. వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారతదేశం ఒకటే అని గర్వంగా చెబుతుందని అన్నారు. ఈ గీతం మన దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ఈ భావనను మనసులో నిలుపుకోవాలని తెలిపారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు కళా రంగాల్లోనూ ప్రతిభ చాటాలి

• పేటలో అట్టహాసంగా యువజనోత్సవాలు



**నారాయణపేట, నవంబర్ 7 (జనం సాక్షి) :** విద్యార్థులు చదువు, క్రీడలతో పాటు కళా రంగాలలోనూ రాణించి ప్రతిభ చాటాలని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.ఏ. రషీద్ అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ (పోలేపల్లి) గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక / సైన్స్ మేళా నిర్వహించారు. ముందుగా వందేమాతర గీతం 150 వ వార్షికోత్సవం పురస్కరించుకుని అందరూ సామూహిక వందే మాతరం గీతాన్ని ఆలపించారు. తర్వాత స్వామి వివేకానంద చిత్ర పటానికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీ .వై.ఎస్. ఓ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన డీ పీ ఆర్ వో రషీద్ మాట్లాడుతూ.జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిగా వెంకటేశ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తూ వచ్చారని, ఓ వైపు విద్యార్థులను క్రీడా రంగాలలో ప్రోత్సహిస్తూనే మరో వైపు యువ కళాకారులను ఎంపిక చేసి రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని వారు ప్రతిభ చాటేలా తర్ఫీదు ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.స్వామి వివేకానందుడిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల కుటుంబాలన్నీ రైతు కుటుంబాలేనని, అలాంటి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదవాలని, చదువుతోపాటు ఇలాంటి కళా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. దేశం ముందు, కుటుంబం తర్వాత అనే నైజంతో నేటి యువత ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు ఏవీ లేవని, కానీ ప్రస్తుతం చదువు, ఆటలు, కళలు ఇలా ఎన్నో అంశాలు నేర్చుకునే అవకాశం నేటి విద్యార్థులకు ఉందని, ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థులు ఎంతో అదృష్టవంతులు అని ఆయన కొనియాడారు. వివేకానందుడు అంటే వివేకం ఆనందం కలిసిన యువకుడు అని చెబుతూ.. వివేకం ఉంటేనే ఆనందం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్నవిద్యార్థుల నిర్వహించే కార్యక్రమాలన్నింటికీ తమ ఉపాధ్యాయ సంఘం తరపున సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.అనంతరం విద్యార్థులకు నృత్యం, చిత్రలేఖనం, వ్యాసరచన, సైన్స్ ఫెయిర్ ఎంపిక పోటీలను నిర్వహించగా పోటీలలో పాల్గొన్న జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ తమ అంశాలలో చక్కటి ప్రతిభ కనబర్చారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ హెచ్ ఎం ల సంఘం అధ్యక్షులు నిజాముద్దీన్, తపస్ జిల్లా కార్యదర్శి నరసింహ,బాల కేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, ఫర్విన్ బేగం, అనంత సేన, అక్తర్ పాషా, మౌలానా, న్యాయ నిర్ణేతలు సంగ నర్సింహులు, నర్సప్ప, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంతోషిమాత దేవాలయ అభివృద్ధికి 50 వేల విరాళం అందజేత



**నాగర్‌కర్నూల్, నవంబర్ 7 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ రోడ్ నెంబర్ 2లో గల సంతోషిమాత దేవాలయనికి, అభివృద్ధి కొరకు కార్తిక శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన టాక్స్ కన్సల్టెంట్, వ్యాపారి గాజుల సురేష్, స్వాతి దంపతులు సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులకు దేవాలయంలో 50వేల రూపాయలు అందజేశారనీ, ఆలయ ప్రధాన అర్చకులు అల్లాడి ప్రకాష్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్న భక్తులకు అమ్మవారి కృపా కటాక్షాలు ఉంటాయని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సురేష్ స్వాతి దంపతులను శాలువలతో, అమ్మవారి ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఆంజనేయస్వామి, రామాలయం, సంతోషిమాత దేవాలయానికి కార్తిక దీపారాధనకు సరిపోను నువ్వుల నూనె డబ్బాలను అదే కాలానికి చెందిన బ్యాంక్ రిటైర్డ్ అధికారి పీ.విజయలక్ష్మి అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాగ్యమ్మ, శివకుమార్, రాజేశ్వరి, మొల్గర వేణుగోపాలరావు, నరసింహారావు, జీయర్, శ్రీనిధి, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు




**మక్తల్, నవంబర్ 7 (జనంసాక్షి) :** మక్తల్ మండలం జక్లైర్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణను బలోపేతం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే బాధ్యతతో జక్లైర్‌కు చెందిన చెందిన వెంకటేష్ గౌడ్ సమాజ సేవలో భాగంగా 4 నూతన ట్రాఫిక్ బారికేడ్లను విరాళంగా అందించారు. ప్రజల భద్రత కోసం ముందుకు వచ్చి ఇలాంటి సేవ చేయడం చాలా ఆదర్శప్రాయమని మక్తల్ సీఐ రామ్ లాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జక్లైర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మక్తల్ సీఐ రామ్‌లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జక్లైర్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై రోజూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ప్రమాదాలు నివారించేందుకు బారికేడ్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, ఈ విరాళం ద్వారా రహదారి భద్రత మరింత మెరుగుపడుతుందని సీఐ తెలిపారు. అలాగే వెంకటేష్ గౌడ్ ని ప్రత్యేకంగా అభినందిస్తూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో యువత ముందుకు రావడం పోలీసు శాఖకి, సమాజానికి ప్రేరణగా ఉంటుంది. ప్రజల భద్రత కోసం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అని అన్నారు. విరాళంగా అందించిన 4 బారికేడ్లను జక్లైర్ వద్ద ప్రమాదాలకు గురయ్యే పాయింట్ల వద్ద తక్షణమే ఉపయోగంలోకి తీసుకువస్తామని సీఐ రామ్‌లాల్ తెలిపారు. బారికేడ్లు అమలు చేయడం ద్వారా వాహనాల వేగ నియంత్రణ, ప్రమాదాల తగ్గింపు, రాత్రి వేళల్లో విజిబిలిటీ పెరగడంలో విశేష ప్రయోజనం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, జక్లేర్ గ్రామ యువత పాల్గొన్నారు.

## బస్సు కోసం డిపో ముందు విద్యార్థుల ధర్నా



**నారాయణపేట, నవంబర్ 7 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల గ్రామానికి విద్యార్థుల సమయానికి అనుకూలంగా ఆర్టీసీ నడిపించాలని పిడి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ముందు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ వత్తుగుండ్ల గ్రామానికి సమయానికి ఆర్టీసీ నడపడం లేదని దానివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు పై చదువులు చదువుకోవడం కోసం చిన్నపిల్లలతో మొదలుకొని 150కి పైగా విద్యార్థులు జిల్లా కేంద్రానికి చదువుకోడానికి వస్తున్నారు. అయితే ఉదయం సమయంలో 6:30కి బస్సు రావడం వల్ల విద్యార్థులు ఉదయం పూట టిఫిన్ చేయకుండా వచ్చే పరిస్థితి వస్తుంది అలాగే రాత్రి 8:00కి బస్సు ఊరికి పోగా విద్యార్థులు చదువుకోడానికి సమయం కూడా దొరకడం లేదు అని తిని పడుకునే పరిస్థితి ఉందని దానివల్ల విద్యార్థులు చదవడంలో వెనక్కి పడిపోతున్నారు అని వారు అన్నారు. ఇదొక గ్రామమే కాకుండా అనేక గ్రామాలకు ఇలాంటి పరిస్థితి ఉందని వారు అన్నారు. అంతేకాకుండా అనేకసార్లు ఆయా గ్రామాలకు బస్సులు నిలిపివేశారు అని ఇది సరైనది కాదని అన్నారు. దీని ఇలాగే కొనసాగిస్తే తీవ్ర ఇబ్బందిని ఎదుర్కోవాల్సి వస్తుందాని దానికి బాధ్యత పూర్తిగా వారే వహించాలని అన్నారు.కాబట్టి విద్యార్థుల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాలకు సమయానికి అనుకూలంగా ఆర్టీసీ బస్సు నడిపించాలని అన్నారు. ఒకవేళ చేయని పక్షాన విద్యార్థులతో కలిసి డిపో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం జిల్లా కోశాధికారి మహేష్ నాయకులు రమేష్ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వికాస్, అయ్యప్ప తోపాటు శ్రీకాంత్, శివ, వెంకటేష్, రాధిక, మౌనిక, శిరీష తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనం సాక్షి) :** వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి అధికారులకు సూచించారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా కోస్గి సాంఘిక సంక్షేమ శాఖ బాలికలు, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కోస్గి బాలికల వసతి గృహంలో వంటగదిని, నిత్యాసర సరకులను, మరుగు దొడ్లు,స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులకు వండిన అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం వసతి గృహ విద్యార్థినులతో కలిసి అల్పాహారం తిన్నారు. తర్వాత గుండుమల్ లోని బాలుర వసతి గృహాన్ని కూడా ఆమె సందర్శించి పరిశీలన చేశారు. అనంతరం ఆమె నారాయణ పేట కలెక్టరేట్ లో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బ లక్ష్మి మాట్లాడుతూపోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి విద్యార్థుల బ్యాంక్ ఖాతాల సీడింగ్‌ను సంబంధిత కళాశాలలకు ఎచ్ డబ్ల్యు ఓ లను వినియోగించడం ద్వారా, బ్యాంకు ఖాతాల సీడింగ్ మరియు ఆధార్ సీడింగ్‌లను త్వరగా మరియు ఖచ్చితంగా చేయడానికి ఫాలో అప్ చేయాలని నారాయణపేట జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ ను ఆదేశించారు. అలాగే ప్రీమెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం హాస్టళ్లకు మ్యాప్ చేసిన ప్రీమెట్రిక్ విద్యార్థుల లక్ష్యాన్ని సంబంధిత పాఠశాలలకు ఎచ్ డబ్ల్యూ ఓలను నియమించడం ద్వారా పూర్తి చేయాలని సూచించారు. ఈపాస్ లాగిన్‌లో విద్యార్థుల పునరుద్ధరణకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కోస్గి బాలికల హాస్టల్‌లో టాయిలెట్ల మరమ్మతులు మరియు విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన చిన్న పనులకు సంబంధించిన మరమ్మతు పనులను చేపట్టాలని అబ్దుల్ ఖలీల్ కు తెలిపారు. నారాయణ పేట జిల్లా ఆవిర్భావం తర్వాత నారాయణపేటలో ఎస్సీ,ఎస్టీ కళాశాల వసతి గృహం లేనందున కళాశాల హాస్టళ్లకు ప్రతిపాదనలు పంపించాలని ఖలీల్ కు సూచించారు. కళాశాల విద్యార్థుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్, టాయిలెట్లు



మరియు ఇతర పనులతో సహా అన్ని హాస్టళ్ల మరమ్మతులకు సంబంధించిన పూర్తి అంచనాలను విడిగా అందిస్తే తద్వారా పనులు చేపట్టడానికి, కలెక్టర్‌కు పరిపాలనా అనుమతులు అందేలా చూసుకోవడానికి 2005- 26 గాను అవసరమైన అంశాలను గుర్తించడం ద్వారా వస్తువుల కోసం డీ పీ సీ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వసతి గృహ వార్డెన్లు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయిలో పనిచేసే అధికారులే కీలకం

• అదనపు కలెక్టర్ దేవ సహాయం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి) :** గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిం చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామస్థాయి అధికారులే కీలకమని, సమాచార హక్కు చట్టం, గ్రామసభల నిర్వహణ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డాక్టర్ మర్రి చె న్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి మాస్టర్ ట్రైనర్ కృష్ణ గ్రామ సభల్లో పాల్గొనే గ్రామస్థాయి పనిచేసే వివిధ శాఖల అధికారులకు శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ దేవ సహాయం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ప్రతి నెలా గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న అ భివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడ డమే కాకుండా సమస్యలను పరిష్కరిం చాల్సి పూర్తి బాధ్యత గ్రామస్థాయిలో పనిచేసే అధికారులకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. లైన్ డిపార్ట్ మెంట్లు అయిన పంచాయతీరాజ్, సంక్షేమ శాఖ, నీటిపారుదల, వ్యవసాయం, గ్రామీణా భివృద్ధిశాఖ, విద్య,వైద్య శాఖల నుంచి 35 మంత్రి గ్రామస్థాయి సిబ్బంది శిక్షణ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు,లైన్ డిపార్ట్ మెంట్ సిబ్బందితోపాటు సెం టర్ ఆఫ్ ఎక్సలెన్స్ సహాయ కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర గీతం వందేమాతరం

• జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనం సాక్షి) :** వందేమాతరం గీతం పవిత్రమైంది, భారతీయులందరికీ గర్వకారణం అని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈ గీతాన్ని మొదటిసారి ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వర్, శ్రీను, డిప్యూటీ కలెక్టర్లు, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులతో కలసి ఉదయం 10.00 గంటలకు "వందే మాతరం" గీతాన్ని సామూహికంగా ఆలపించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. భారతీయులందరూ ఒకటేనని ఐక్యతను చాటుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన వందేమాతరం గీతం గొప్పదనాన్ని మరోసారి నేటితరానికి కూడా తెలియజేసేలా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ గీతాలాపనకు పిలుపునిచ్చిందన్నారు. వందేమాతర గీతం విశిష్టతను అందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ గీతం స్వాతంత్రోద్యమ సమయంలో ప్రజల్లో శక్తిని నింపిందని అన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ కోట్లాది మందిని ఏకతాటిపైకి తీసుకొచ్చిందన్నారు. నాటి స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేసేలా ఏడాది పాటు ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణి కుమార్, ఆర్డీఓ రామచంద్రనాయక్, ఏవో శ్రీధర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ లోని అన్ని విభాగాల అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 7 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ అవసరాల నిమిత్తం మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన నూతన జెసిబి వాహనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసిబి వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్చర్ల మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ పట్టణ అభివృద్ధికి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్ పర్సన్ సారిక, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

• పనిచేయని ఉద్యోగులపై చర్యలు తప్పవు
• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 7 (జనం సాక్షి) :** జిల్లా విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వర్తించే పై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో పీఎం పోషణ్, పీఎం శ్రీ పథకాల అమలు, సహా పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయడమే కాకుండా, వాటిని సంబంధిత పోర్టల్స్ లో అప్డేట్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం కూడా విద్యాశాఖ అధికారుల బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లాలో అమలు చేస్తున్న పలు పథకాలు యూడైస్ పోర్టల్ లో డేటా ఎంట్రీ చేయని కారణంగా రాష్ట్రంలో జిల్లా వెనుకబడుతోందని కాబట్టి తప్పనిసరిగా ఎంఐఎస్ ఆపరేటర్ల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను డేటా ఎంట్రీ చేయించాలని ఆదేశించారు.జిల్లా విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వర్తించేపై స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల విద్యాధికారి నుంచి ఆపరేటర్ వరకు సమన్వయం చేసుకొని జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాల గణాంకాలను అప్డేట్ చేయాలన్నారు. జిల్లాలో ఇంటర్నెట్ కనెక్షన్ లేని పాఠశాలలకు వెంటనే ఇంటర్నెట్ కనెక్టివిటీ చేయించి సంబంధిత పోర్టల్ లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. రాబోయే పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించి గ్యాస్ సిలిండర్ ద్వారానే వంట చేయాలని, ఇందుకోసం అన్ని పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ కలెక్టర్ నిధుల నుంచి ఇప్పించడం జరుగుతుందని తదుపరి సిలిండర్లను కొనసాగించేవిధంగా హెడ్మాస్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయించడం జరిగిందని పది రోజుల్లో ఆ డేటాను కూడా పోర్టల్ లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో టాయిలెట్స్ లేని పాఠశాలలకు సంబంధించి తప్పుగా డేటా ఎంట్రీ నమోదు చేశారని, కొన్ని



పాఠశాలల్లో టాయిలెట్స్ ఉన్నప్పటికిని లేనట్లుగా నమోదు చేశారని, అలాంటి వాటిని తిరిగి డేటా సరి చేయాలన్నారు.ఇక పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరైన 15 పనులను త్వరగా చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డిఈఓ అబ్దుల్ ఘని, ఎంఈఓలు, హెడ్మాస్టర్లు, ఏం ఐ ఎస్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లను గుర్తించాలి
- ప్రజల జీవితాల్లో త్వరితగతిన మార్పు తీసుకురావాలి
- నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి, డిప్యూటీ సెక్రటరీ, వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారి అన్వేష్ కుమార్



ములుగు ప్రతినిధి, నవంబర్ 07(జనంసాక్షి) : అభివృద్ధి సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లను గుర్తించాలని, ప్రజల జీవితాల్లో త్వరితగతిన మార్పు తీసుకురావాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి, డిప్యూటీ సెక్రటరీ, వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అన్వేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కన్నాయిగూడెం బ్లాక్ కార్యక్రమంపై కేంద్ర ప్రబరీ అధికారి నీతిఆయోగ్ వాణిజ్య, పరిశ్రమల శాఖ డిప్యూటీ సెక్రటరీ అన్వేష్ కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కన్నాయిగూడెం బ్లాక్ అభివృద్ధిని కొలవడానికి ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం నిర్దేశించిన ఐదు ప్రధాన రంగాలలో సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం, పోషకాహారం గర్భిణీ స్త్రీలకు ప్రథమ త్రైమాసికంలో నమోదు, సంస్థాగత ప్రసవాలు, పిల్లల్లో పోషకాహార లోపం తగ్గింపు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల లభ్యత వంటి అంశాలను సమీక్షించారు. వ్యవసాయం, అనుబంధ సేవలు కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) పంపిణీ, సూక్ష్మ నీటిపారుదల (మైక్రో ఇరిగేషన్) విస్తీర్ణం, సాయిల్ హెల్త్ కార్డుల జారీ మరియు పశువులకు టీకాలు వేసే కార్యక్రమాలపై దృష్టి సారించారు. ప్రతి ఇంటికి కుళాయి నీటి కనెక్షన్ (టాప్ కనెక్షన్), ఓపెన్ డెఫెకేషన్ ఫ్రీ (ఓడిఎఫ్) ప్లస్ గ్రామాల ప్రకటన, భారత్‌నెట్ కనెక్టివిటీ మరియు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై-జి) కింద గృహాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. స్వయం సహాయక బృందాలకు (ఎస్ హెచ్ జిస్) రివాల్వింగ్ ఫండ్ మంజూరు, కొత్త ఎస్ హెచ్ జి ల ఏర్పాటు మరియు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా అన్వేష్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర పథకాల కలయిక (కన్వెర్జెన్స్), కేంద్ర ప్రభారీ అధికారులు, జిల్లా కలెక్టర్ల సహకారం (కాలేబరేషన్), మరియు బ్లాక్‌ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ (కాంపిటీషన్) అనే మూడు ప్రధాన సూత్రాలపైనే ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉందని పునరుద్ఘాటించారు. "కన్నాయిగూడెం బ్లాక్‌లో పథకాల అమలులో అధికారుల అంకితభావం అభినందనీయం. అయినప్పటికీ, కీలక సూచికలలో మరింత వేగంగా అభివృద్ధి సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లను గుర్తించి, లక్షిత జోక్యాల ద్వారా ప్రజల జీవితాల్లో త్వరితగతిన మార్పు తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమీక్ష కన్నాయిగూడెం బ్లాక్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమిచ్చి, స్థానిక పరిపాలనలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, నీతి అయోగ్ బ్లాకు కోఆర్డినేటర్ రవీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆధునిక పంటలవైపు మళ్లించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): రైతాంగాన్ని ఆధునిక పంటలవైపు మళ్లించాలని, అవసరం మేర మందుల వినియోగంపై రైతులకు అవగహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన దేశీ డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ప్రోగ్రామ్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని ఇన్పుట్ డీలర్లకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 6 బ్యాచ్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాలలో పురుగుమందు దుకాణాలు నిర్వహించుకోవడాకి అవకాశం లభించిందని 7వ బ్యాచ్ లోని వ్యక్తులు సైతం వ్యవసాయ సైంటిస్టులచే నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడులు నేర్చుకొని గ్రామీణ స్థాయిలో రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని స్పష్టం చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వాడకం వంటి అంశాలపై సరైన అవగాహన కలిగించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇన్‌పుట్ డీలర్లు రైతులకు నమ్మకమైన సమాచారం, నాణ్యమైన ఉత్పత్తులు అందించి వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే వ్యవసాయ రంగం ఆధునికత వైపు దూసుకుపోతున్న ఈ కాలంలో, ప్రతి ఇన్‌పుట్ డీలర్ రైతుల మిత్రుడిగా, మార్గదర్శిగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఔత్సాహిక డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

### సామూహికంగా వందేమాతరం గీతాలాపన

దేశభక్తిని మరింతగా పెంపొందించే విధంగా కార్యక్రమంగా సామూహికంగా వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజలలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి, భారత చరిత్రలో వందే మాతరం గీతానికి ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ పట్ల ప్రజల్లో ఉత్సాహం గుండెల నిండుగా జాతీయ భావం నెలకొందని వెల్లడించారు. జాతీయ భావన, ఐక్యత, సామూహిక భావం పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఐక్యతకు దోహదపడతాయని తెలిపారు. వందేమాతర గీతం భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్లో దేశభక్తి భావాన్ని రగిలించిన గీతమని, స్వాతంత్ర్య సమరయోధులందరిలో ఉత్సాహానికి, శక్తికి ప్రతీకగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలి

- పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి - తాడ్వాయి, నవంబర్ 07(జనంసాక్షి) : శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం పునర్మాణ పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. శుక్రవారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం పునర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి పని వివరాలను ఎన్ని రోజులలో పూర్తి చేస్తారని, ఇంజనీర్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాకార మండపం, గద్దెల ఆవరణలో జరుగుతున్న పనులన్నీ పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. మేడారం చేరుకున్న రాతి కట్టడాలకు సంబంధించిన రాళ్ళను కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వీరస్వామి, ఐటిడిఏ ఏపిఓ వసంత రావు, ఆర్ అండ్ బిపిఆర్, ఆర్ డబ్లు ఎస్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత

- ఇద్దరు అరెస్ట్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగడం లేదు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఒక కుటీర పరిశ్రమలాగా కొనసాగుతోంది. ఎన్టీఆర్ నగర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. గురువారం నాడు ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో ఇల్లీగల్‌గా పిడిఎస్ రైస్ సరఫరా జరుగుతుందనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రమోద్‌రావు, ఎస్ఐ సి.హెచ్. తిరుపతి, సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఐచర్ వ్యాన్‌లో 120 రేషన్ రైస్ బ్యాగులు, అశోక్ లేలాండ్ ట్రాలీలో 56 బ్యాగులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 176 బ్యాగులు (సుమారు 88 క్వింటాళ్లు) పిడిఎస్ బియ్యం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా రవాణా చేస్తున్నట్లు తేలింది. వీటిని సీజ్ చేయడంతో పాటు వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్ రైస్ అంచనా విలువ సుమారు రూ.3,80,000 ఉంటుంది. అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నారు . ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# కలెక్టరేట్‌లో ఘనంగా సామూహిక వందేమాతరం గేయాలాపన



నిర్మల్ బ్యూరో, నవంబర్07, (జనంసాక్షి) : జాతీయ గేయం వందేమాతరం రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి "వందేమాతరం" ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య సమరయోధుల్లో దేశభక్తిని రగిలించిన మహత్తర గీతమని తెలిపారు. జాతీయ గేయం దేశ సమైక్యతకు, దేశభక్తి భావాల పెంపుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ప్రతి భారతీయుడు దేశంపై గౌరవం, సేవాభావం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ బ్యూరో, నవంబర్7 (జనంసాక్షి) : సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహించిన 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2025-26 లో రాష్ట్రబీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి, మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, జమాల్, ఉదయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌లను ఆర్థికంగా బలపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- రిజర్వాయర్ లో చేపపిల్లలు వదిలిన ఎంఎల్ఏ కడియం, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 07 (జనంసాక్షి) : ముదిరాజ్ సమాజాన్ని ఆర్థికంగా బలపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంఎల్ఏ కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్, గండి రామారం రిజర్వాయర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి శుక్ర వారం ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. ఈ రిజర్వా యర్ ద్వారా ఏటా సుమారు నాలుగువందల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుందని,దాదాపు నాలుగు కోట్ల రూపాయల విలువైన చేపలు మార్కెట్లోకి వస్తున్నాయి అని తెలిపారు. మత్స్యకారుల ఆదాయం పెరగడం కోసం చేపలను పెంచడంతో పాటు మార్కెటింగ్ సదు పాయాలు,రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారుల ను సూచించినట్టు తెలిపారు. ప్రస్తుతం ఘనపూర్ రిజర్వాయర్ పరిధిలో 319 మహిళా సంఘాల సభ్య లు, 700 మంది మత్స్యకార సంఘ సభ్యులు, మరో 300 మంది సభ్యత్వం కోసం అప్లై చేసుకున్నారని మొత్తం 1300 మంది మత్స్యకారులు నెలకు పదివేల రూపాయలకు పైగా సంపాదించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మాట్లాడుతూ జిల్లా లోని మొత్తం 736 చెరు వులు,9 రిజర్వాయర్ లలో 2 కోట్ల 72 లక్షల చేప పిల్ల ల విడుదల లక్ష్యం కాగా, లాంచనం గా ఈ కార్యక్రమా న్ని ప్రారంభించామని,మొత్తం ప్రక్రియ ఈ నెల ఆఖరి వరకు పూర్తి అవుతుందన్నారు. ఈ చేప పిల్లల విడు దల వల్ల 190 మత్స్యకారుల సహకార సంఘాల్లోని 19 వేల సభ్యులతో పాటు వీరి మీద ఆధార పడిన దాదాపు80వేల మత్స్యకార్మికుల జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే చేపలను డిమాండ్ ఎక్కువగా ఉండే ఇతర రాష్ట్ర ప్రాంతాలకు కూడా మార్కెటింగ్ చేసి అధిక లాభాలను పొంది ఆర్థి కంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, జిల్లా మత్స్య శాఖ అధికారి రానా ప్రతాప్, డీపీవో, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్, జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు నీల రాజు,ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, స్టేషన్ఘన్పూర్ మత్స్య సొసైటీ అధ్యక్షుడు నీల సోమన్న ముదిరాజ్, గోనెల ఐలోని, మునిగల ఐలోని, గోనెల వెంకన్న, నీల సాంబరాజు, గోనెల ఉప్పలయ్య, మునిగల రాజు, కుంభం సాంబరాజు, నక్క శ్రీను, మాజీ అధ్యక్షుడు మునిగల వెంకన్న, అనిల్, గోనెల ఎల్లయ్య, నీల ఐలయ్య, గోనెల ఉపేందర్, గోనెల రాజయ్య, కుంభం కుమార్ స్వామి ముదిరాజ్, గోనెల యాదగిరి, రాజు, రవి సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి): వరంగల్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ఏర్పాటు చేయనున్న163 జి నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను కోరారు. శుక్రవారం గీసుగొండ మండలం ఉకల్ , బొడ్డు చింతలపల్లి గ్రామాల రైతుల తో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి డిఆర్వో విజయలక్ష్మిలతో కలసి భూ నిర్వాసితులతో ఆర్బిట్రేషన్ నిర్వహించారు. ఈ ఆర్బిట్రేషన్ లో భూమి కోల్పోయిన ఉకల్ గ్రామ రైతులు 7 గురు, బొడ్డు చింతలపల్లి 13 మంది రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించగా, వారికి నష్టపరిహారం త్వరగా అందించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ ఆర్బిట్రేషన్కు వరంగల్ ఆర్డీవో సుమ, గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్, నేషనల్ హైవే బ్రిడ్జ్ ఇంజనీర్ ఈశ్వర్ కుమార్ మరియు ఉకల్ బొడ్డు చింతలపల్లి రైతులు పాల్గొన్నారు.

# గంజాయి మొక్కను సాగు చేస్తున్న మహిళపై కేసు



నస్పూర్(జనంసాక్షి): నిషేధిత గంజాయి మొక్కని అక్రమంగా సాగు చేస్తున్న మహిళ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు నస్పూర్ ఎస్ఐ ఉపేందర్ రావు తెలిపారు.ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆర్కే 5 కాలనీ లో నివాసం ఉంటున్న సల్లూరి శంకరమ్మ అనే మహిళా బంధువు కయ్యుం సహాయంతో ఇంటి ఆవరణలో అక్రమంగా గంజాయి మొక్కను సాగుచేస్తుందని,గంజాయి మొక్కను జప్తు చేసి ఆమె పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మంచి భావనతో బతకడానికే చట్టాలు


- జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): మంచి భావనతో బతకడానికే చట్టాలు రావడం జరిగిందని, ప్రతి పౌరునికి న్యాయ సేవలు అందించాలని ప్రిన్సిపల్, జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ న్యాయసేవల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి హాజరై మాట్లాడుతూ మనుషులు కలసి మెలసి జీవించడానికే చట్టాలు ఏర్పడ్డాయని, ఎప్పుడైతే ఇద్దరి మధ్య వివాదం తలెత్తుతుందో అప్పుడు వారిని చక్కదిద్దడానికి చట్టం పనిచేయడం ప్రారంభిస్తుందని అన్నారు. చట్టాలను వినియోగించుకోవడంతో పాటు పౌరులు బాధ్యతలను తెలుసుకొని మెలగాలని సూచించారు. న్యాయ సహాయం అనేది ముందుకు నడిపించే విధంగా ఉండాలని, సామజిక స్పృహ కలిగి వున్నప్పుడే అది సాధ్యం అవుతుందని తెలిపారు. కేసులు, వివాదాలు లేని సమాజ నిర్మాణం కోసమే న్యాయసేవాధికార సంస్థ పనిచేస్తుందని, లక్ష్యం నెరవేరినప్పుడు గొప్ప సమాజం ఏర్పడుతుందని జడ్జి చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, చీఫ్ డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ శ్రీనివాస్, అక్షయ, న్యాయవాదులు మంగళపల్లి రాజ్ కుమార్, అఖిల, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### తాడిచర్లలో డేంజర్ జోన్ గృహాలను సేకరించాలి

- డిప్యూటి సిఎం కు విన్నవించిన దండు రమేష్



మల్హర్, నవంబర్ 07 (జనం సాక్షి) : మండల కేంద్రమైన తాడిచెర్ల లోని టిజి జెన్కో ఓసిపి కి 500 మిటర్ల డేంజర్ జోన్లో ఉన్న నివాస గృహాలను సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గురువారం ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ దండు రమేష్ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క్ మల్లు ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా డేంజర్ జోన్లో నివాసం ఉంటున్న ప్రజలు పడుతున్న కష్టాలు, కూలడానికి సిద్ధంగా ఉన్న వారి నివాస గృహాల ఫోటోలు, వివరాలు నివేదిక రూపంలో డిప్యూటీ సీఎం కు అందజేశారు. ఇండ్ల సేకరణకు సానుకులంగా స్పందించినట్లుగా దండు రమేష్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
08 నవంబర్ 2025

# దేశ ఐకమత్యాన్ని, ఔన్నత్యాన్ని చాటాలి

- ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) :** 150 వసంతాల వందేమాతర ఉత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో వందలాది మంది పౌరులు, విద్యార్థులు, పోలీసు సిబ్బందితో నిర్వహించిన భారీ ర్యాలీలో జిల్లా ఎస్పీ కె.నరసింహ పాల్గొని మాట్లాడారు.వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డు నుండి వాణిజ్య భవన్ సెంటర్ వరకు వందేమాతరం నినాదాలు, భారత్ మాతాకీ జై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం యొక్క స్థితిగతులను, భారతదేశంలో ఉన్న పరిస్థితులను ప్రజల యొక్క అభిమతాన్ని తెలియపరుస్తూ బంకించంద్ర చటర్జీ ఈ వందేమాతర గీతాన్ని రచించారని అన్నారు.నేటికీ 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఘనంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. వందేమాతర గీతం భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు ప్రతి పల్లెలో, పట్టణంలో కులమతాలకు అతీతంగా ప్రజలను చైతన్యపరిచి ముందుకు తీసుకువచ్చి ఐక్యతతో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడంలో ముఖ్య భూమిక పోషించిందని తెలిపారు. వందేమాతరం యొక్క గొప్పతనం ఈ పాట వలన ఎందరో త్యాగధనులు దేశం కోసం పోరాడిన గొప్ప చరిత్ర ఈ పాటకు ఉందని పేర్కొన్నారు.సూర్యాపేట పట్టణంలో వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీగా పాల్గొని వాణిజ్య భవన్ సెంటర్లో జాతీయ పతాకావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, డిఎస్పి ప్రసన్నకుమార్, నరసింహ చారి, సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు, వందేమాతరం గీతాలాపన కమిటీ సభ్యులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ కుమార్, తోట శ్యామ్ ప్రసాద్, ప్రసన్న, దశరథ, సృజన కుమార్,ఉపేందర్, వెంకట్ రెడ్డి, హైమవతి, శ్రీదేవి, నరసింహ,వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**పినపాక, నవంబర్ 7 (జనం సాక్షి) :** విద్యార్థులు, స్థానిక ప్రజలు ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ కంది చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పినపాక మండలం ఈ.బయ్యారం పంచాయతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ ను ఆయన ప్రారంభించారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయామం అలవాటు చేసుకొని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, కాంగ్రెస్ నాయకులు కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ నాగయ్య, పీడీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లిలో సీసీ రోడ్లకు సొంత నిధులు

- 12 లక్షలు ఇవ్వడం అభినందనీయం
- ఏబీవీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్
- సీసీ రోడ్డు పనులు గ్రామస్తులతో ప్రారంభం



**మొయినాబాద్, నవంబర్ 7 (జనం సాక్షి) :** ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువనాయకుడు షాపురం రాజు (మాణిక్యం) సొంత డబ్బులు 12 లక్షలతో పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి శుక్రవారం నాయకులు, యువకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులు వేయిస్తున్న షాపురం రాజు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఇళ్లు చక్కబెట్టుకోని దేశాన్ని చక్కబెట్టుకోవచ్చునని తెలిపారు. రెడ్డిపల్లి గ్రామంలో పలు కాలనీల్లో రోడ్లు లేక వర్షాలు పడ్డప్పుడు బురదమయంగా నీరు నిలవడం జరుగుతుందని తెలిపారు. కాలనీ ప్రజల కోరిక మేరకు సొంత నిధులు 12 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు పనులను చేయిస్తున్నానన్నారు. అందరి అభివృద్దే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు తనవంతు కృషిగా సీసీ రోడ్డు పనులను వేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిడి శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, కాంతిరెడ్డి, చిన్నయ్య, సత్యనారాయణరెడ్డి, మోర మల్లేష్, యాదగిరి, చిలుకూరి శ్రీశైలం, గుండె రాంచందర్, నర్సింహులు, శంకరయ్య, గణేష్, సుధాకర్, రాంచందర్, యాదగిరి, సామయ్య, సుజయ్య, సుధాకర్, ఇంద్రసేనారెడ్డి, గడ్డం రాములు, ఎర్ర బుచ్చయ్య, వెంకటయ్య, రాములు, వెంకటేష్, మల్లేష్, యాదయ్య, శ్రీను, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- రంగారెడ్డి జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్



**మొయినాబాద్, నవంబర్ 7 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాసయాదవ్ లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందజేసి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేదల అర్హులైన వారందరికి సొంతింటి కళ సాకారం చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో బీసీలు, బడుగు బలహీన వర్గాలకు ఐదు లక్షల రూపాయలు కాగా ఎస్సీ, ఎస్టీలకు లక్ష అదనంగా ఇస్తూ ఆరు లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారు నాణ్యతతో నిర్మించుకోవాలని పేర్కొన్నారు. పేదలకు సొంతింటి కళ సాకారం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షులు వడ్ల నర్సింహ్మాచారి, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పంచలింగాల రాఘవరెడ్డి, పంచాయతీ కారోబార్ జగన్, నాయకులు పట్లోళ్ల రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్, బందీ అనిల్, శ్రీనివాసాచారి, దర్శన్, వీరాచారి, అనంతయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

## భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తి నింపిన వందేమాతరం

- అడిషనల్ కలెక్టర్ కె.సీతారామారావు



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) :** వందేమాతరం గీతం ఆలపించటం మనకు దొరికిన మంచి అవకాశమని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లో వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు పాల్గొని వందేమాతరం గేయాన్ని కలెక్టరేట్ లోని ఉద్యోగస్తులందరితో కలిసి ఆలపించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తి అయ్యాయని అన్నారు.భారత స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపి రణ నినాదంగా ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు.బెంగాలీలో రచించిన ఈ గేయం తెలుగులో భారతమాత నీకు వందనం, గలగల పారే ప్రవాహాలతో మలయ మారుతముల చల్లని గాలులతో, సస్యశ్యామలమైన దేశమా నీకు వందనాలు అని భారతదేశాన్ని కీర్తిస్తూ రచించారని తెలిపారు. వందేమాతరం గీతం నేటికి కూడ అఖండ భారత దేశంలో ప్రతి ఒక్కరి నోట పలుకుతుండడం మన అదృష్టమని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహ, గిరిజన సంక్షేమ అధికారి శంకర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సాయి, శ్రీలత,టీఎన్జీవోస్ జిల్లా సెక్రటరీ దున్న శ్యామ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇమ్మడి భద్రయ్య ఎల్ఐసీలో ఘనాపాటి

- ఎల్ఐసీలో ఎంతోమందికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఇమ్మడి భద్రయ్య
- జెడ్ఎం క్లబ్‌లో లైఫ్‌టైం మెంబర్‌గా అర్హత



**దేవరకొండ, నవంబర్ 7 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణానికి సుపరిచితులు,శ్రీ గరుడాద్రి వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఉపాధ్యక్షులు, సీనియర్ ఎల్ఐసి ఏజెంట్, ఇమ్మడి భద్రయ్య జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)లో గత 46 సంవత్సరాల (1979) నుండి ఎల్ఐసి ఏజెంట్ గా పాలసీదారులకు విశిష్ట సేవలు అందిస్తూ శుక్రవారం అరుదైన రికార్డు సాధించారు. స్థానిక సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాము చౌహాన్, డెవలప్మెంట్ ఆఫీసర్ బి శంకర్ సహకారంతో 2025-26 సంవత్సరానికి సింగిల్ ప్రీమియం 40 లక్షల పాలసీతో పాటు 4 సార్లు ఎండిఆర్టీ సాధించారు. నచ్చిన వృత్తినే దైవంగా భావిస్తూ, ఎల్ఐసిలో నలుగురు మెచ్చే సేవా కృషి తత్పరుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. నిజాయితీ, నిబద్ధత ఆయన సిద్ధాంతం. ఈ సందర్భంగా స్థానిక సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహాన్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవకు పరితపిస్తూ,కల్మషం లేకుండా నిత్యం ప్రజల మధ్యలో ఉండే ఇమ్మడి భద్రయ్య ప్రజల నమ్మకం, ఆదరణతోనే జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో రికార్డులు సృష్టిస్తూ స్థానిక బ్రాంచ్ అభివృద్ధికి పాటుపడడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దాదాపు 15 సంవత్సరాలు ఏకతాటిగా జెడ్ఎం క్లబ్లో సభ్యునిగా ఉండి జెడ్ ఎం క్లబ్ లో లైఫ్ టైం మెంబర్గా అర్హత సాధించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తనపై, సంస్థపై నమ్మకం ఉంచి ప్రీమియం చెల్లిస్తున్న పాలసీదారులందరికీ ఇమ్మడి భద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్, డెవలప్మెంట్ ఆఫీసర్ పి.శంకర్ కు అభినందనలు తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



**టేకులపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బోడు ఎస్సై పి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తన సిబ్బందితో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం టేకులపల్లి మండలంలోని బోడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైతన్యం-డ్రగ్స్‌పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాల నిర్మూలన పై కూలంకషంగా వివరించారు. మాదక ద్రవ్యాలను సేవిస్తే శారీరకంగా,మానసికంగా, కుటుంబ పరంగా, సమాజ పరంగా ఎదురయ్యే సమస్యలు, చట్టాల ద్వారా పడే శిక్షలను వివరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందని, సమాజానికి దూరమవుతారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు గానీ, వ్యక్తుల సమాచారం గానీ తెలిస్తే స్థానిక పోలీసులకు గానీ,100 నంబర్‌కు డయల్ చేసి తెలుపాలన్నారు. జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్న పోలీస్ శాఖకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఫోక్సో చట్టాల పై అవగాహన కల్పించడం జరిగింది.చెడు మార్గాలలో నడవకుండా మంచిగా చదువు కొని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల కనులను నిజం చేయాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బోడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వందేమాతరం తరతరాలకు స్ఫూర్తిదాయకం..

- నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, నవంబర్ 7 (జనం సాక్షి) :** పౌరులలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందేమాతర జాతీయ గీతం సామూహికాలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో కలెక్టర్ కార్యాలయ సిబ్బందితోపాటు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బంకిం చంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని వందేమాతర జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ రోజు చారిత్రక దినమని , బాధ్యతగల పౌరులుగా ప్రతి ఒక్కరి మనసులలో నిలిచిపోతుందని అన్నారు. వందేమాతర గీతానికి మరోసారి దేశవ్యాప్తంగా ఒక గుర్తింపు రావడానికి ఇది మంచి అవకాశమని అన్నారు.వందేమాతర జాతీయగీతం కలెక్టర్ కార్యాలయంతో పాటు, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ,సంస్థలు, విద్యా సంస్థల్లో పాడడం జరిగిందని తెలిపారు. జాతి, మత, కుల, ప్రాంతీయ భావన లేకుండా, దేశానికి మంచి గుర్తింపు వచ్చేలా వందేమాతర జాతీయ గీతం సామూహిక ఆలాపన ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో కార్డాన్ అండ్ సెర్చ్

- సరియైన పత్రాలు లేని 42 బైకులు, 5 ఆటోలు స్వాధీనం



**బూర్గంపహాడ్, నవంబర్ 7 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సారపాక గాంధీ నగర్ లో శుక్రవారం ఉదయం కార్డాన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్ఐ లు ఐదు బృందాలుగా ఏర్పడి గాంధీనగర్ ఏరియాలో ఎలాంటి పత్రాలు లేని వాహనాలు, అక్రమంగా నడిచే బెల్ట్ షాపులు, అనుమానితుల గురించి, నార్కోటిక్ డాగ్ తో అనుమానిత ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో సరియైన పత్రాలు లేని 42 బైకులు, 5 ఆటోలు, సుమారు రూ. 5,000 విలువగల లిక్కర్ను స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల జరిగే దుష్పరిణామాల గురించి వివరించారు. అంతేకాక ఆ ప్రాంతంలో అనుమానితులు, కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ మేడా ప్రసాద్, ఎస్ ఐ నాగ బిక్షం, ఎస్ ఐ దేవ్ సింగ్, ఎస్ ఐ సురేష్, ఎస్ ఐ మధు ప్రసాద్, ఎస్ ఐ కళ్యాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భవనాన్ని మూస్తారా..బాధ్యతల నుండి తప్పుకుంటారా...

- 'జనంకోసం' కసిరెడ్డి డిమాండ్



**శేరిలింగంపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి) :** చందానగర్ సర్కిల్ హాఫీజ్ పేట్ డివిజన్ పరిధి గంగారం విలేజ్ లో అక్రమ బిల్డర్ నిర్వాకం తారాస్థాయికి చేరిందని, ఇదేమి బరితెగింపు, ఇంతవరకు తాను ఇలాంటి దౌర్జన్యాన్ని చూడలేదని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ బహిరంగ లేఖను విడుదల చేస్తూ గంగారం విలేజ్ లో ఓ భారీ అక్రమ కట్టడం యదేచ్ఛగా నిర్మితమవుతుంటే సభ్య సమాజం కళ్ళు మూసుకుందా... కనీసం అధికారులకు జవాబుదారీ తనం ఏమైనా ఉన్నట్టా... లేనట్టా అని కసిరెడ్డి తీవ్రంగా స్పందించారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి అనుమతులు ఎక్కడినుండి వచ్చాయని, అయినా తాము అసలు అనుమతులనే ఇవ్వలేదని గతంలోనే చందానగర్ సర్కిల్ ఏసిపి స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో పాటు అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని హెచ్చరికలు జారీ చేస్తూ నోటీసులను అందించి ఏకంగా భవనాన్ని సీజ్ చేసిన వాస్తవాలను, అధికారుల ఆదేశాలను బేఖాతరు తనను ప్రశ్నించే రాజ్యాంగ వ్యవస్థనే లేదన్నట్టు పట్టపగలే యదేచ్ఛగా అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తూ అడిగేవాడు ఎవడు అన్నట్టు బిల్డర్ వ్యవహరిస్తున్న తీరు ఆయన దౌర్జన్యానికి పరాకాష్టగా కసిరెడ్డి అభివర్ణించారు. ఈ క్రమంలోనే తాను చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు తాను పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఇప్పటికే మొదటి రెండవ అంతస్తులలో అడ్డగోలుగా పనులను చేపడుతూ అదీ చాలదన్నట్టు కోరుతూనే పూర్తిగా తప్పుదోవ పట్టించి భవనం పూర్తయినట్టుగా నమ్మించి కోర్టులో నానుతున్న వివాదానికే పంగనామం పెట్టి మరోదఫా కోర్టునుండి స్టేటస్కో ఉత్తర్వులు తీసుకురావడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్టు కాదా అని ఆయన దుయ్యబట్టారు. గంగారం విలేజ్ లో అక్రమ నిర్మాణం విషయంలో బిల్డర్ ధోరణి చూస్తుంటే అధికారులు, యంత్రాంగం, చట్టాలు, కోర్టులు, రాష్ట్ర ప్రభుత్వం సైతం తన పరిధికి రాదు, తానే ఓ మోనార్క్, ఎవరేం చెప్పినా అనుకున్నది మాత్రమే చేస్తానన్నట్టుగా పూర్తిగా ఒక పకడ్బందీ వ్యవహారంతో అతను ముందుకు సాగుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని, తక్షణమే చందానగర్ సర్కిల్ జిహెచ్ఎంసి అధికారులు భవనాన్ని మూసేసి అతనిపై కోర్టుదిక్కార, ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు విభాగాల కింద కఠినమైన కేసులు నమోదు చేసి జీవితంలో మరో మారు ఇలాంటి అహంకార పూరిత ధోరణిని కనబరచకుండా చూడాల్సిన బాధ్యతను ఆయన గుర్తు చేశారు. ఏడు ఫీట్ల గల్లీ లేని అక్రమ స్థలానికి 800 గజాల స్థలంలో 36 ఫ్లాట్ లను నిర్మించుకునేలా హక్కు ఎవరిచ్చారో నిగ్గు తేల్చాలని, అక్రమ నిర్మాణం కూలే వరకు తాను విడిచి పెట్టే ప్రసక్తే లేదని, ఎంత దూరమైనా ముందుకెళ్తానని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు.




# ఏఐ బూమ్ ఎఫెక్ట్

## ఫ్లాష్ మెమరీ కాంపోనెంట్ల కొరత



**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వృద్ధి కారణంగా ఏర్పడిన గ్లోబల్ ఫ్లాష్ మెమరీ కాంపొనెంట్ల కొరత వల్ల ఎల్‌ఈడీ టీవీల ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎల్‌ఈడీ టీవీలు సహా అనేక కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ధరలు కూడా పెరుగుతాయని భావిస్తున్నాయి. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం ఫ్లాష్ మొమరీ కాంపొనెంట్ల తయారీలో కీలకంగా ఉన్న కంపెనీలు అధిక మార్జిన్ కలిగిన ఏఐ డేటా సెంటర్ల వైపు మళ్లడమేనని పరిశ్రమ నిపుణులు హెచ్చరిస్తున్నారు. టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్స్‌లో విరివిగా ఉపయోగిస్తున్న ఫ్లాష్ మెమరీ ధరలు కొద్ది నెలల్లోనే భారీగా పెరిగాయి. వీడియోటెక్స్ డైరెక్టర్ అర్జున్ బజాజ్ తెలిపిన వివరాల ప్రకారం 1%+దీ/8+దీ% మెమరీ ధర ఏప్రిల్‌లో 2.61 డాలర్ల వరకు ఉండగా అక్టోబర్ నాటికి అది ఏకంగా 14.40 డాలర్లకు పెరిగింది. కేవలం మూడు నెలల్లోనే ఈ ధరల పెరుగుదల 50 శాతానికిపైగా చేరాయి. ఇది టీవీ తయారీదారుల ఇన్‌పుట్ ఖర్చులపై ఒత్తిడి పెంచింది. సెమీకండక్టర్ పరిశ్రమలోని ప్రధాన కంపెనీలు ఏఐ మౌలిక సదుపాయాల వైపు దృష్టి సారించడమే ఈ కొరతకు మూలకారణం అని తెలుస్తుంది. చిప్ తయారీదారలు ఏఐ డేటాసెట్లలో ఉపయోగించే చిప్ సెట్‌ల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని కారణంగా టీవీలు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల్లో సాధారణంగా వాడే మెమరీ ఉత్పత్తి తగ్గిపోయింది. ఎస్‌పీపీఎల్ (థామ్సన్ బ్రాండ్ లైసెన్స్) సీఈఓ అవనీత్ సింగ్ మార్వా మాట్లాడుతూ..'2021-22 చిప్‌సెట్ కొరత తర్వాత ఫ్లాష్ మెమరీ అతిపెద్ద సమస్యగా ఉంది. త్వరలో ఎల్‌ఈడీ టెలివిజన్ ధరలు పెరుగుతాయి' అన్నారు. ఈ మెమరీ కాంపోనెంట్స్ ప్రధానంగా చైనా నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీదారులు 2026 కోసం మెమరీ సెట్‌లను భద్రపరచడానికి పోటీ పడుతుండటంతో సరఫరా గొలుసు అంతరాయాలు పెరిగి ధరల ఒత్తిడి మరింత తీవ్రమైందని నిపుణులు చెబుతున్నారు.

**ఈ కొరత ఎప్పటివరకంటే..**

ఈ కొరత కనీసం ఆరు నుంచి పన్నెండు నెలల వరకు కొనసాగుతుందని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీలు తమ ఆర్డర్లను వ్యూహాత్మకంగా నిర్వహిస్తున్నాయి. ఇన్వెంటరీని క్రమబద్ధీకరిస్తున్నాయి. టీవీలలో ఫ్లాష్ మెమరీని ఎందుకు ఉపయోగిస్తారంటే స్మార్ట్ టీవీలు ఆండ్రాయిడ్ టీవీ, వెబ్‌ఓఎస్ టైజెన్ వంటి ఆపరేటింగ్ సిస్టమ్‌లపై పనిచేస్తాయి. ఈ కోడ్, టీవీని నడిపించే ఫర్మ్‌వేర్ కోడ్ అంతా ఫ్లాష్ మెమరీలోనే శాశ్వతంగా నిల్వ అవుతుంది. టీవీని ఆన్ చేసినప్పుడు ఫ్లాష్ మెమరీలోని ఈ ఫర్మ్‌వేర్ నుంచి డేటా లోడ్ అవుతుంది. అప్పుడే టీవీ పనిచేయడం మొదలవుతుంది. నెట్‌ఫ్లిక్స్ యూట్యూబ్ అమెజాన్ ప్రైమ్ వీడియో వంటి యాప్‌లను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయడానికి ఫ్లాష్ మెమరీ స్థలాన్ని అందిస్తుంది.

# మూడోరోజూ నష్టాల్లోనే..



**• 25,500 దిగువకు నిఫ్టీ**

**ముంబయి(జనంసాక్షి):** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడయిన సూచీ లు.. పీఎస్‌యూ బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో ఓ దశలో లాభాల్లోకి వచ్చి మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. దీంతో వారాంతంలో సూచీలకు భారీ నష్టాలు తప్పాయి. నిఫ్టీ 25,500 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 83,150.15 పాయింట్ల వద్ద (క్రితం ము గింపు 83,311.01) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 82,670.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ 83, 390.11 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 17.40 పాయింట్ల నష్టంతో 25,492.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బ్లాక్‌డీల్ కారణంగా ఎయిర్‌టెల్ దాదాపు 4 శాతానికి పైగా నష్టపోయింది. ఎయిర్‌టెల్‌లోని తన 0.8 శాతం వాటాను సింగ్‌టెల్ విక్రయించడంతో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. టెక్ మహీంద్రా, ట్రెంట్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4004 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఇల్లు కొనడానికి ఈఎంఐ



– టెకీ సలహా..

ఇల్లు కట్టుకోవడం లేదా కొనుక్కోవడం అనేది చాలామంది కల. ఈ కల నెరవేర్చుకోవడానికి.. లోన్ తీసుకోవడం లేదా ఇతరుల దగ్గర అప్పు చేయడం వంటివి చేస్తుంటారు. ఇవన్నీ ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తాయని, హోమ్ లోన్ తీసుకుంటే వచ్చే సమస్యలు.. ఎలా ఉంటాయో ఒక టెకీ తన అబుభవాలను షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట్లో వైరల్ అవుతోంది. రూ.53 లక్షల లోన్ తీర్చడానికి తనకు ఆరు సంవత్సరాల కాలం పట్టిందని రెడ్డిట్ పోస్టులో వెల్లడించారు. అంతే కాకుండా నెలవారీ ఈఎంఐ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ఒత్తిడిని కలిగిస్తుందో కూడా పేర్కొన్నాడు. 2019లో రూ. 53 లక్షల హోమ్ లోన్ తీసుకున్నాను. 2025 నవంబర్ చివరి నాటికి లోన్ క్లియర్ చేసాను. అంటే ఈ లోన్ చెల్లించడానికి 6 సంవత్సరాల సమయం పట్టింది. ఎవరూ హోమ్ లోన్ తీసుకోవద్దని.. ఈ సందర్భంగా ఆ టెకీ సలహా ఇచ్చాడు. ఎందుకంటే అతిగా ఆలోచించేవారు.. మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు.

**రూ.14 లక్షలు వడ్డీతో..**

జర్మనీలోని ఒక ఆటోమోటివ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కారణంగా.. లోన్ తొందరగా క్లియర్ చేయగలిగాను. నేను తీసుకున్న రూ. 53 లక్షల లోనుకు.. రూ.14 లక్షలు వడ్డీతో కలిపి.. మొత్తం రూ.67 లక్షలు చెల్లించాను. విదేశాల్లో ఉద్యోగం చేయడం.. లోన్ చెల్లించడంలో చాలా సహాయపడింది. ఇల్లు కొనడం మొదట్లో భావోద్వేగంగా ఉంటుంది, కానీ నిర్వహణ సమస్యలు ఎక్కువైనప్పుడు.. భావోద్వేగం భారమవుతోంది. 'ఇంటిని సొంతం చేసుకోవడం అంటే.. దాని సమస్యలను కూడా సొంతం చేసుకోవడమే' అని ఆ టెకీ పేర్కొన్నాడు. నేను లోన్ తీసుకుని కొనుగోలు చేసిన ఇల్లు విలువ.. ఇప్పుడు కోటి రూపాయలు. కానీ నా బ్యాంక్ బ్యాలెన్స్ దాదాపు ఖాళీ అని పేర్కొన్నాడు. హోమ్ లోన్ తీసుకోవడం వల్ల ఏమైనా ప్రయోజనాలు ఉన్నాయంటే.. ఇది వ్యక్తులను మరింత కష్టపడి పనిచేసేలా చేస్తుంది. చిన్న చిన్న ఉద్యోగాలు చేసి మరింత డబ్బు ఆదా చేసేలా ప్రేరేపిస్తుందని ఆ టెకీ పేర్కొన్నాడు. దీనిపై పలువురు నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తూ అభినందిస్తున్నారు.

# ఐపీవోకు స్పేస్ ఎక్స్?

వాషింగ్టన్: మస్క్ తన రాకెట్ తయారీ సంస్థ స్పేస్‌ఎక్స్‌ను పబ్లిక్ కంపెనీగా మార్చబోతున్నట్లు హింట్ ఇచ్చారు. టెస్లా 2025 వాటాదారుల సమావేశంలో ఆయన చేసిన ప్రకటన వల్ల స్పేస్‌ఎక్స్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ వచ్చే అవకాశం ఉంటుందని కొందరు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. టెస్లా 2025 వాటాదారుల సమావేశంలో మాట్లాడుతూ మస్క్ స్పేస్‌ఎక్స్ ఐపీఓ గురించి వ్యాఖ్యలు చేశారు. 'టెస్లా వాటాదారులు స్పేస్‌ఎక్స్ వృద్ధిలో పాల్గొనడానికి ఏదైనా మార్గాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాను. అది చాలా మేలు చేస్తుంది. స్పేస్‌ఎక్స్ కంపెనీ భవిష్యత్తు కార్యకలాపాల్లో పాలుపంచుకోవడానికి ప్రజలకు అవకాశం ఇవ్వాలని ఆలోచిస్తున్నాను. ఇప్పటికే ఇతర కంపెనీల్లో స్టాక్స్ కలిగి ఉన్న మద్దతుదారులు స్పేస్‌ఎక్స్ స్టాక్ కలిగి ఉండాలని కోరుకుంటున్నాను. కానీ, ఏ సమయంలో అది జరుగుతుందో కచ్చితంగా చెప్పలేను. అయితే ఏదో ఒక సమయంలో మాత్రం స్పేస్‌ఎక్స్ పబ్లిక్ కంపెనీగా మారాలి' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రపంచంలోని అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీల్లో ఒకటైన స్పేస్‌ఎక్స్ భవిష్యత్తుపై, సాధారణ ప్రజలు పెట్టుబడి పెట్టే అవకాశంపై ఊహాగానాలకు దారితీశాయి. స్పేస్‌ఎక్స్: 2002లో ఎలాన్ మస్క్ దీన్ని స్థాపించారు. స్పేస్‌ఎక్స్ (స్పేస్‌ఎక్స్‌ప్లోరేషన్ టెక్నాలజీస్ కార్ప్) టెక్సాస్‌లోని బ్రౌన్స్ విల్లేలో ఉన్న స్టార్ బేస్‌లో ప్రధాన కార్యాలయం కలిగి ఉంది. లో-ఎర్త్ ఆర్బిట్ నుంచి అంతరిక్ష నౌకను విజయవంతంగా తిరిగి భూమిపైకి తెచ్చిన సంస్థగా గుర్తింపు పొందింది.

**ప్రముఖ వాహన తయారీ సంస్థ టయోటా రీకాల్ ప్రకటిం చింది. ఈ ప్రభావం 10 లక్షల వాహనాలపై ప్రభావం చూపిస్తుంది. నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మి నిస్ట్రేషన్‌కు పంపిన లేఖలో 1,024,407 వాహనాలను రీకాల్ చేయ నున్నట్లు ప్రకటించింది. పనోరమిక్ వ్యూ మానిటర్ సిస్టమ్ లోని లోపం ఉన్నట్లు, ఈ లోపం కారణంగా.. రియర్‌వ్యూ కెమెరా సరిగ్గా పనిచేయకపోవడం జరుగుతుంది. దీనిని పరిష్కరించడానికి టయోటా రీకాల్ జారీ చేసింది. జపాన్‌లో ఫీల్డ్ రిపోర్టులు అందిన తర్వాత, ఏప్రిల్ 2024లో టయోటా ఈ సమస్యపై దర్యాప్తు ప్రారంభించింది.**

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.80 | ₹ 5.82 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,11,850 | ₹ 1,22,020 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |


**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,65,000

# ట్రంప్‌కు 'శాంతి బహుమతి'?..

## కాని నోబెల్ కాదు..ప్రముఖ సంస్థ నుంచి..

**• డిసెంబర్ 5న ప్రదానం**

**'శాంతి బహుమతి' కోసం తాపత్రయపడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కల త్వరలో నెరవేరబోతోంది. అయితే అది నోబోల్ నుంచి కాదు.మరో ప్రముఖ సంస్థ ఆయనను 'శాంతి బహుమతి'తో సత్కరించనున్నట్లు సమాచారం. పైగా ఈ పురస్కారం అందుకునే తొలి ప్రముఖుడు ట్రంప్ అంటూ ఆ సంస్థ అధ్యక్షుడు పరోక్షంగా ప్రకటించారు. ఇంతకీ అది ఏ సంస్థ?.. ఎందుకు ట్రంప్‌కు శాంతి బహుమతి ఇస్తున్నారనే వివరాల్లోకి వెళితే..**



**వాషింగ్టన్:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడా సమాఖ్య(ఫిఫా) త్వరలో తమ సంస్థ నుంచి 'శాంతి బహుమతి'ని అందించాలని నిర్ణయించింది. దీనికి 'ఫిఫా శాంతి బహుమతి'గా నామకరణం చేసింది. ప్రపంచంలో శాంతి, ఐక్యతల కోసం విశేషంగా కృషి చేసిన వారిని గుర్తించి, వారికి 'ఫిఫా' ఈ 'శాంతి బహుమతి'ని ప్రదానం చేయనుంది. 2025, డిసెంబర్ ఐదు (శుక్రవారం)న వాషింగ్టన్ డీసీలో జరిగే 2026 ప్రపంచ కప్ డ్రా సందర్భంగా ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో తన చేతుల మీదుగా ఒక ప్రముఖునికి 'ఫిఫా శాంతి బహుమతి'ని అందించనున్నారు. 'ఫిఫా' తెలిపిన వివరాల ప్రకారం శాంతి కోసం విశేషంగా కృషిచేసి, ప్రపంచ ప్రజలను ఏకంచేసిన ప్రముఖుడు ఈ బహుమతిని అందుకోనున్నారు. 'అస్థిరత, విభజనలు పెరుగుతున్న ప్రస్తుత ప్రపంచంలో, సంఘర్షణలను అంతం చేయడానికి, శాంతియుత స్ఫూర్తితో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేసే వారి అత్యుత్తమ సహకారాన్ని గుర్తించడం చాలా ముఖ్యం' అని ఇన్ఫాంటినో అన్నారు.

# రష్యాలో ఇండియా విద్యార్థి అదృశ్యం విషాదాంతం



మాస్కో: రష్యాలో గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయిన భారతీయ విద్యార్థి కథ విషాదాంతమైంది. రాజస్థాన్‌లోని అల్వార్‌కు చెందిన 22 అజిత్ సింగ్ చౌదరి మృతదేహం ఆనకట్టలో లభ్యమైంది. దీంతో బాధిత విద్యార్థి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రష్యాలో దాదాపు మూడు వారాలుగా తప్పిపోయిన వైద్య విద్యార్థి అజిత్ సింగ్ చౌదరి మృతదేహాన్ని ఉఫా నగరంలోని ఆనకట్ట సమీపంలో గుర్తించారు. మాస్కోలోని భారత రాయబార కార్యాలయం ఈ సంఘటన గురించి కుటుంబ సభ్యులకు , అల్వార్‌లోని స్థానిక ప్రతినిధులకు సమాచారం అందించింది. అజిత్ సింగ్ చౌదరి 2023 నుండి రష్యాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ డిగ్రీ చదువుతున్నాడు. అక్టోబర్ 19న ఉదయం 11 గంటల ప్రాంతంలో తన హాస్టల్ నుండి బయటకు వచ్చిన తర్వాత అజిత్ అదృశ్యమయ్యాడు. పాలు కొనుక్కుని అరగంటలోపు తిరిగి వస్తానని స్నేహితులకు చెప్పి వెళ్లిన అతను ఎంతకీ తిరిగిరాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక అధికారులు వైట్ నది సమీపంలో అతని బట్టలు, ఫోన్ ,బూట్లు కనుగొన్నారు. పంతొమ్మిది రోజుల తరువాత, అదే నదికి ఆనుకుని ఉన్న ఆనకట్ట వద్ద అజిత్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తోటి విద్యార్థులు మృతదేహాన్ని గుర్తించారు. పోస్ట్‌మార్టం అనంతరం అతని మృతదేహాన్ని ఇండియాకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం, రష్యన్ అధికారుల మధ్య సమన్వయంతో స్వదేశానికి తిరిగి పంపే ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తి కావచ్చని అధికారులు తెలిపారు. అజిత్ అనుమానాస్పద మరణంతో అజిత్ తల్లిదండ్రులు రూప్ సింగ్ ,సాంత్రా దేవి శోకానికి అంతులేకుండా పోయింది. వైద్యవిద్య కోసం మూడెకరాల భూమి అమ్మినట్టు బంధువులు తెలిపారు. ఎన్నో కలలతో అజిత్‌ను విదేశాలకు పంపించాం, కానీ మనిషినే కోల్పోతామని అనుకోలేదంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీ రవుతున్నారు. ఎలా చనిపోయాడనే దానిపై వివరణాత్మక దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు అజిత్ గ్రామస్తులను కూడా దిగ్భ్రాంతికి గురిచేసింది. అజిత్ అదృశ్యం పట్ల త్వరగా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని మృతదేహాన్ని త్వరగా తిరిగి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ కమ్యూనిటీ సభ్యులు అల్వార్ జాట్ హాస్టల్‌లో సమావేశం నిర్వహించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు జితేంద్ర సింగ్ అల్వార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏదో అనుమానాస్పదంగా అనిపిస్తోందంటూ ట్వీట్ చేశారు. మృతదేహాన్ని తరలించేలా ఏర్పాటు చేయాలనీ, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను కోరారు.

# ఈపీఎఫ్‌వో కొత్త రూల్స్ వచ్చేశాయ్..

**న్యూఢిల్లీ:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అంటే తెలియని ప్రైవేటు ఉద్యోగులు ఉండరు. దీని పరిధిలో సుమారు 8 కోట్ల మంది క్రియాశీల సభ్యులు ఉన్నారు. ఇది కేవలం పదవీ విరమణ పొదుపు సాధనంగానే కాకుండా ఉద్యోగులకు తొలి దీర్ఘకాలిక పెట్టుబడి కూడా. సభ్యులకు సేవలను సులభతరం చేయడానికి ఈపీఎఫ్ఓ నిబంధనలలో అనేక మార్పులు చేసింది. ఉద్యోగ మార్పుల సమయంలో పీఎఫ్ నిధుల బదిలీ ప్రక్రియలో సమస్యలు ఎక్కువగా ఉండటంతో, ఈపీఎఫ్‌వో ఇటీవల భారీ మార్పులు చేసింది. ఇప్పుడు బదిలీలు వేగంగా, సులభంగా, ఆటోమేటిక్ జరుగుతున్నాయి. ఇంతకీ పీఎఫ్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించి చేసిన తాజా మార్పులు ఏంటో ఈ కింద చూద్దాం..

**ఇవి ప్రధాన మార్పులు:** ఆటోమేటిక్ బదిలీ: ఇంతకు ముందు ఉద్యోగులు ఫారం 13 ద్వారా మాన్యువల్‌గా బదిలీకి దరఖాస్తు చేయాల్సి ఉండేది. ఇప్పుడు ఉద్యోగి కొత్త సంస్థలో చేరిన వెంటనే, కొత్త యజమాన్యం చేరిన తేదీని అప్‌డేట్ చేసిన తర్వాత, ఈపీఎఫ్ బదిలీ ఆటోమేటిక్‌గా ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియలో కంపెనీ యాజమాన్యం ప్రమేయం అవసరం లేదు.

ఒకే యూఏఎన్: ఇప్పటి నుంచి ఒక ఉద్యోగికి ఒక్క యూనివర్సల్ అకౌంట్ నంబర్ మాత్రమే ఉంటుంది. ఆధార్ ఆధారిత ధృవీకరణతో కొత్త యూఏఎన్‌ను సృష్టించేందుకు వీలుండదు. దీంతో పాత, కొత్త పీఎఫ్ ఖాతాలు ఆటోమేటిక్ ఒకే యూఏఎన్‌కు లింక్ అవుతాయి. తద్వారా ఎక్కువ ఖాతాల విలీనం అవసరం తగ్గుతుంది.

**వేగవంతమైన ధృవీకరణ:** ఈపీఎఫ్ఓ ఆధార్ ఆధారిత ఈ-సైన్, ఏపీఐ ఇంటిగ్రేషన్ ద్వారా కంపెనీ యాజమాన్యాల ధృవీకరణను వేగవంతం చేసింది. ఇంతకుముందు 30-45 రోజులు పట్టిన బదిలీలు ఇప్పుడు 7-10 రోజుల్లో పూర్తవుతున్నాయి.

**పాస్‌బుక్‌లో కంబైన్డ్ బ్యాలెన్స్:** బదిలీ పూర్తయిన తర్వాత పాత ఖాతా "జీరో బ్యాలెన్స్" చూపుతుంది. కొత్త పాస్‌బుక్‌లో పాతది కొత్తది మొత్తం బ్యాలెన్స్ కనిపిస్తుంది. దీంతో ఉద్యోగులు తమ ఖాతాల్లో ఎంత మొత్తం ఉన్నది సులభంగా ట్రాక్ చేయగలరు.

**నిష్క్రమణ తేదీ తప్పనిసరి:** మునుపటి కంపెనీ యాజమాన్యం ఉద్యోగి నిష్క్రమణ తేదీని అప్‌డేట్ చేయకపోవడం వల్ల బదిలీలు ఆలస్యం కావడం సాధారణం. ఇప్పుడు ఇది తప్పనిసరి. యాజమాన్యం అప్డేట్ చేయకపోతే, ఉద్యోగి ఆధార్ ఓటీపీ ద్వారా తన నిష్క్రమణ తేదీని ప్రకటించవచ్చు.

**బదిలీ సమయంలోనూ వడ్డీ:** ఇంతకు ముందు బదిలీ సమయంలో పాత ఖాతాలో ఉన్న మొత్తంపై వడ్డీ ఆగిపోయేది. ఇప్పుడు బదిలీ పూర్తయ్యే వరకు కూడా వడ్డీ కొనసాగుతుందని ఈపీఎఫ్‌వో స్పష్టం చేసింది. ఈ మార్పులతో ఈపీఎఫ్ బదిలీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా, సులభంగా మారింది. తమ సంస్థల యాజమాన్యాలపై ఆధారపడకుండా ఉద్యోగులు స్వతంత్రంగా తమ పీఎఫ్ నిధులను నిర్వహించగలుగుతున్నారు. ఇది ఉద్యోగ మార్పుల సమయంలో సమయం, ఆందోళన రెండింటినీ తగ్గించి, ఈపీఎఫ్ వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలపరుస్తుంది.

# రూ.1800 కోట్ల భూమి రూ.300 కోట్లకే..

## భగ్గుమన్న భూ కుంభకోణం ఆరోపణలు

పుణే: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ పవార్ కోట్ల రూపాయల భూ కుంభకోణానికి పాల్పడ్డాడంటూ ఆరోపణము భగ్గుమన్నాయి. ఈ కుంభకోణంలో అజిత్ పవార్ కుమారుడి హస్త ఉందన్న ఆరోపణల నేపత్యంలమహారాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. 1800 క కోట్ల రూపాయల విలువైన భూమిని రూ.300 కోట్లకే విక్రయించారన్న కేసులో ఒక రెవెన్యూ అధికారిని మహారాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. విచారణ కమిటీకి అదనపు చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ) వికాస్ ఖర్గే సారథ్యం వహించనున్నా రు. కమిటీ తుది నివేదిక ఎనిమిది రోజుల్లోగా వచ్చే అవకాశం ఉంది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రూ.1,800 కోట్ల ఆస్తి లావాదేవీలో తీవ్రమైన అవకతవకలను వివరిస్తూ మధ్యంతర నివేదికను సమర్పించిన తర్వాత, పార్థ్ పవార్ పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ కుంభకోణంపై మహారాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. ఇది చాలా తీవ్రమైన విషయమని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పుణేకు చెందిన తహసీల్దార్ సూర్యకాంత్ యెవాలెను సస్పెండ్ చేశారు. బీజేపీ, అజిత్ పవార్‌కు చెందిన ఎన్‌సీపీ, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేతో కూడిన సంకీర్ణ ప్రభుత్వంపై ప్రతిపక్ష మహాయుతి తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పుణేలోని ముంధ్వారాలో ఉన్న 40 ఎకరాల ప్రభు త్వ భూమిని రూ.300 కోట్ల కు పార్థసారథి భాగ స్వామిగా ఉన్న ఓ ప్రైవేట్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా అమ్మేశారన్నది ప్రధాన ఆరోపణ. అలాగే రూ. 21 కోట్ల స్టాంప్ డ్యూటీని కేవలం రూ. 500 కు తగ్గించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ డీల్ విలువ రూ. 300 కోట్లు అయినప్పటికీ, పన్నులతో సహా మొత్తం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ దాదాపు రూ. 21 కోట్లు ఉండాలని అదికారులు తెలిపారు.

# మాది దేవుడి పార్టీ.. వాళ్లకు రాముడంటే ఇష్టం ఉండదు

నీతీశ్‌కుమార్ ప్రభుత్వం పనిచేయకుండా గత సర్కార్ అడ్డుకుందని విమర్శించారు. నరేంద్ర- నీతీశ్ ట్రాక్ రికార్డ్‌పై బిహార్ ప్రజలకు నమ్మకం ఉందనే విషయం తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో ఓటింగ్‌తో అర్థమవుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలోనే బిహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. "మోదీ- నీతీశ్‌ట్రాక్ రికార్డులపై బిహార్ ప్రజలకు నమ్మకం ఉంది. నేను హామీ ఇచ్చిన పనులన్నీ పూర్తి చేస్తాను. 500 ఏళ్లుగా అన్యాయానికి గురవుతున్న అయోధ్యలో ఈరోజు రామమందిరం నిర్మాణం పూర్తి అయ్యింది. ఆర్టికల్ 370ను రద్దు చేశాం. బిహార్ గడ్డపై నిలబడి పహల్గాం ఉగ్రదాడి కారకులను శిక్షిస్తామని చెప్పాను. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్‌తో ఏం జరిగిందో మీ అందరికీ తెలుసు. ఆర్జేడీ అసత్య వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీ హామీలపై కాంగ్రెస్‌కే నమ్మకం లేదు. అందువల్ల ఆర్జేడీ ఎన్నికల ప్రణాళిక గురించి కాంగ్రెస్ మాట్లాడమే లేదు. మీకు తెలుసా? ఈ 11 ఏళ్లలో సైనిక కుటుంబాలకు ఎన్ని డబ్బులు అందాయో అంచనా వేయగలరా? వన్ ర్యాంక్ వన్ పింఛన్ ద్వారా లక్ష కోట్లు ఇచ్చాం. ఆర్జేడీ నేతలకు ఒకటి తర్వాత ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా అర్థంకాదు. కానీ కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు రూ.500 కోట్లు మాత్రమే ఇచ్చామని అసత్యాలు చెబుతున్నారు." అని మోదీ అన్నారు. "బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆర్జేడీ అవమానించింది. గత 35-40 ఏళ్లలో గెలవని స్థానాలను కాంగ్రెస్?కు కేటాయించింది. పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి సీఎం పదవిని లాలు పార్టీ తస్కరించింది. ఇప్పుడు కూడా అనేక స్థానాల్లో కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీ పోటీ పడుతున్నాయి. వారి సహచరులు వారే వెన్నుపోటు పొడుస్తున్నారు. అలాంటి వారు మీకు మంచి చేస్తారా? కాంగ్రెస్, ఆర్జేడీ కేవలం అవమానం, వేధింపులతోనే రాజకీయం చేస్తుంది. కాంగ్రెస్ రాజ కుటుంబం ఛాతి మైయా పూజను డ్రామా అన్నారు. మహా కుంభమేళాను అనవసరమని చెప్పారు. మనం చేసే ప్రతీ పండగలతో వారు ఇబ్బందులకు గురవుతారు. మన విశ్వాసాలను ఈ రాజకుంటుంబీకులు అవమానిస్తూనే ఉంటారు. ఇలాంటి వారికి నవంబర్ 11న జరిగే పోలింగ్‌లో మీ ఓటుతో గట్టి బదులు చెప్పాలి. ఇప్పటికే కాంగ్రెస్ ఓటమికి కారణాల కోసం వెతుకులాడుతోంది. అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

# విపరీతమైన పని ఒత్తిడి

## - 10 మందిని చంపిన నర్స్

బెర్లిన్: ఎవరికైనా సరే విపరీతమైన పని ఒత్తిడి అనేది ఆందోళనకు దారితీస్తుంది. అది ఇంకా అధికమైతే మానసిక రుగ్మతలకు కారణమవుతుంది. ఇటువంటి సమయంలో ఒత్తిడి బాధితులు తమ మనసుపై అదుపును కోల్పోతారు. అప్పుడు విపరీత పరిణామాలు తలెత్తే అవకాశం ఉంటుంది. సరిగ్గా ఇటువంటిదే జర్మనీలోని ఒక మేల్ నర్స్ విషయంలో జరిగింది. ఈ ఘటన సంచలనంగా మారింది. పశ్చిమ జర్మనీలోని కోర్టు ఒక మేల్ నర్స్ చేసిన దారుణాలకు శిక్ష విధించింది. అతను పనిచేస్తున్న ఆస్పత్రిలో 10 మంది రోగులను హత్య చేయడానికి తోడు మరో 27 మందిని చంపేందుకు ప్రయత్నించాడు. సదరు మేల్ నర్స్ చేసిన ఘాతుకాలు రుజువు కావడంతో 'పాలియేటివ్ కేర్' నర్స్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. పేరు వెల్లడికాని ఆ నర్స్ నిత్యం రాత్రి షిఫ్టులలో పనిచేసేవాడు. తన పనిభారపు ఒత్తిడిని తగ్గించుకునేందుకు అతను తన పర్యవేక్షణలో ఉన్న వృద్ధ రోగులకు మార్ఫిన్ లేదా మత్తుమందులను ఇంజెక్ట్ చేశాడు. ఈ నేరం రుజువైన దరిమిలా అతను దోషిగా తేలాడు. ఈ హత్యలు 2023, డిసెంబర్- 2024, మే మధ్య పశ్చిమ జర్మనీలోని వుర్సెలెన్ పట్టణంలోని ఒక ఆసుపత్రిలో చోటుచేసుకున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న నర్స్.. నిత్యం సంరక్షణ అవసరమయ్యే రోగుల విషయంలో సానుభూతి చూపలేదని, బాధితుల జీవితానికి, మరణానికి యజమానిగా ప్రవర్తించాడని ప్రాసిక్యూటర్లు ఆచెన్ కోర్టుకు తెలిపారు. 'ఎఎఫ్‌పీ' తెలిపిన వివరాల ప్రకారం అతను సాగించిన నేరాలు.. ఇప్పటివరకూ గుర్తించిన వాటికన్నా అధికంగానే ఉండవచ్చని ప్రాసిక్యూటర్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరిన్ని మృతదేహాలను వెలికితీసి, పరీక్షలకు పంపించనున్నారు.

# సాదా బైనామాలకు మోక్షం కలిగేనా!

- జిల్లాలో 15 వేల దరఖాస్తులు
- విచారణ కోసం నోటీసులు జారీ చేసిన అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 7 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం సాదా బైనామాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి వెబ్సైట్ను తొలగించి భూభారతి వెబ్సైట్ను అమలు చేశారు. దానిద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూ సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాదా బైనామా ద్వారా సుమారు15 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వేములవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 6623 సాదా బైనమా దరఖాస్తులు వచ్చాయి.2 జూన్ 2014 ముందు వ్యవసాయ భూములు సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసుకున్న వారు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలన చేస్తున్నారు.గత ప్రభుత్వంలో అక్టోబర్,నవంబర్ 2020 సంవత్సరంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి భూభారతి వెబ్సైట్, రెవెన్యూ సదస్సుల ద్వారా సాదా బైనమాల దరఖాస్తులను స్వీకరించింది. వేములవాడ డివిజన్ పరిధిలో బోయిన్పల్లి మండలంలో 764 దరఖాస్తులు రాగా 909 సర్వే నెంబర్లను,చందుర్తి మండలంలో 1259 దరఖాస్తులకు 1477 సర్వే నెంబర్లను,కొనరావుపేట మండలంలో 2690 దరఖాస్తులకు 2934 సర్వే నెంబర్లను,రుద్రంగి మండలంలో 162 దరఖాస్తులకు 184 సర్వే నెంబర్లను,వేములవాడ మండలంలో 675 దరఖాస్తులకు 731 సర్వే నెంబర్లను, వేములవాడ రూరల్ మండలంలో 1072 దరఖాస్తులకు 1278 సర్వే నెంబర్ల దరఖాస్తులు వచాయి. వీటిని ఆయా మండల రెవెన్యూ



అధికారులు పరిశీలన చేస్తున్నారు. సాదా బైనామా కొరకు దరఖాస్తు చేసుకున్న వాటిలో పట్టా భూమి మాత్రమే సాదా బైనామా కానుంది. ప్రభుత్వ అసైన్డ్ భూములు సాదా బైనామాలు కావు..2 జూన్ 2014 ముందు సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములలో కొనుగోలుదారుడు మోకాపై ఉండాలి, అమ్మిన రైతు పేరు పహానిలో ఉండాలి. అమ్మిన రైతు మరెవరికైనా రిజిస్ట్రేషన్ ద్వారా తన భూమిని అమ్మిన ఎడల సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసిన రైతులకు సాదా బైనామా అమలు కాదు. ఈ విషయమై వేములవాడ ఆర్డీవో రాదాబాయి ని వివరణ కోరగా రెవెన్యూ డివిజన్ పరిధిలో సాదా బైనామాల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారికి భూములు అమ్మిన వారికి నోటీసులు ఆయా మండలాల తాసిల్దారుల ద్వారా పంపిణీ చేశామన్నారు.సాదా బైనామాల దరఖాస్తులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని త్వరితగతన సాదా బైనామాల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్డిఓ తెలిపారు.

# దోమకొండలో జిల్లా స్థాయి అర్చరీ పోటీలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిది నవంబర్ 7 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో ఆర్చరీ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో నిర్వహించారు. ఈ సందర్భం గా దోమకొండ కామారెడ్డి,నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ గంగరాజు, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమల, కోచ్ ప్రతాప్ దాస్, సెక్రటరీ మోహనరెడ్డి,బీజేపీ మండల ప్రెసిడెంట్ భూపాల్ రెడ్డి, గంగాధర్, పిఇటీ ఉదయ, ఉపాధ్యాయురాలు సురేఖ,రవీందర్ పాల్గొనారు. ఆర్చరీ సబ్ జూనియర్ ఇండియా రౌండ్ బాలుర విభాగంలో భువన్, శ్రీశాంత్, రాజేందర్, రామ్ చరణ్, ప్రణీత్, బాలికల విభాగంలో ప్రీతి,లాస్య,రమ్య, స్నేహ, భావన, శ్రీవర్చన బాలుర విభాగంలో సుమంత్, స్నేహిత్, రుత్విక్ బాలికలు విభాగంలో ఇందు, వర్షిణి, నక్షత్ర, నైతిక, అర్పిత అండర్ టెన్ విభాగంలో వర్షిత, అండర్ 19 బాలుర విభాగంలో రాజేందర్, దీక్షిత్, రిత్విక్, బాలికల విభాగంలో అమూల్య, సుమిత్ర, అశ్విని, రికరు అండర్ 14



బాలుర విభాగంలో రుత్విక్, స్నేహిత్, బాలికల విభాగంలో వర్షిని, నక్షత్ర, నైనిక, అర్పిత ,కాంపౌండ్ రౌండ్ కృష్ణ సాయి ఎంపిక య్యారు. ఈ నెల 9న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు,ఈ పోటీలకు సహాయ సహకారాలు అందించిన కామినేని అనిల్ కు, మరియు ట్రస్ట్ మేనేజర్ బాబ్జీకి కామారెడ్డి అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే పురోగతిపై చర్చ

**గోదావరిఖని, జనంసాక్షి :**
జాతీయ గణాంక కార్యాలయ అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె.అరుణశ్రీని కలిసి నగరంలో జరుగుతున్న పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే పురోగతి గురించి వివరించారు.వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థ,త్వరితగతిన జరుగుతున్న సాంకేతిక అభివృద్ధి కారణంగా విదానాల రూపకల్పనలో స్వల్ప అంతరాలలో శ్రామిక గణాంకాల అవసరం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఏర్పడుతున్నందున ఈసర్వే నిర్వహిస్తు న్నట్లు వివరించారు.ఈ సర్వే నిర్వహించడానికి ఉమ్మడి కరీం నగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో రామగుండం కూడా ఉందని తెలిపా రు. రామగుండంలో సర్వే ప్రారంభించామని తొలుత సాధారణ వివరాలు సేకరించి అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 కుటుంబాలను ఎంపిక చేస్తామన్నారు.ఇందులో కుటుంబ యజమాని పేరు సభ్యుల వివరాలు, విద్యా ర్హతలు, వృత్తివిద్య కోర్సులు, స్వయం ఉపాధి తదితర అంశాలు నమోదు చేస్తామని గుర్రం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.ఈ సంధర్భంగా అడిషనల్ కమిషనర్ మారుతిప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్రావు ఉన్నారు.

**జాతీయ గీతం ఆలాపాన..**
అదనపుకలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె.అరుణశ్రీ శుక్రవారం



రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులు సిబ్బందితో కలిసి జాతీయ గేయం వందే మాతరం ఆలపించారు.ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ బంకిమ్ చంద్ర ఛటర్జీ రాసిన వందే మాతరం గేయం 150 ఏళ్ల వేడుకల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, సెక్రెటరీ ఉమామహేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# అక్రమ పిడిఎస్ బియ్యం రవాణా

### ఇద్దరు నిందితులు పట్టివేత

**బోయిన్‌పల్లి నవంబర్ 7 (జనం సాక్షి) :**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లిలో శుక్ర వారం రోజు ఉదయం 10:30 గంటల సమ యంలో బోయినపల్లి గ్రామం రామాలయం సమీపంలో పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బోయినపల్లి పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా రేకుర్తి గ్రామానికి చెందిన కోట పోచయ్య 27 బోయిన్ పల్లి గ్రామానికి చెందిన నల్లగొండ రాకేష్ 29 రేషన్ కార్డు దారుల వద్ద నుండి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారనీ ఎస్ఐ రమా కాంత్ తెలిపారు.పోలీసులు ఘటన స్థలం లో సుమారు 4 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఎక్స్‌ఎల్ మోపెడ్ ను స్వాధీనం చేసుకూని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.అక్రమ పిడిఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

# లక్కీ డ్రా బ్రోచర్ వైరల్

### స్కాముకు సిద్ధమైన లక్కీడ్రా వ్యాపారం




**ఆర్మూర్,నవంబర్ 7(జనంసాక్షి):** లక్కీ డ్రా పేరుతో కొందరు మోసాలకు మళ్లీ తెర లేపుతున్నారు. లిమిటెడ్ కూపన్లు అంటూ కొంత మొత్తం చెల్లించి డ్రాలో బహుమతులు గెలుపొందచ్చని మాయ మాటలు చెప్పి అమాయక ప్రజలను నిండా ముంచిన సంఘటనలు ఆర్మూర్ డివిజన్ పరిధిలో కోకొల్లలుగా జరిగాయి.కొందరు అత్యాశతో మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేస్తున్న లక్కీ డ్రా బ్రోచర్ కాస్త వైరల్ గా మారింది. ముఖ్యంగా భీంగల్, మోర్తాడ్ మండల కేంద్రాలలో చిన్న చిన్న పల్లెటూర్ల ప్రజలనే టార్గెట్ చేస్తూ దందాకు తెర లేపారని సమాచారం.గత కొన్ని ఏళ్ల క్రితం కోట్ల రూపాయలు లక్కీ డ్రాల స్కీంలతో జనాలను ముంచిన సంఘటనలు ఈ ప్రాంత పరిధిలో చాలానే ఉన్నాయి.ఎలాంటి చట్టబద్ధత,రిజిస్ట్రేషన్ లేకుండా ఏకంగా షట్టర్ ల అమ్మకం మొదటి బహుమతి, తులాల బంగారం రెండో బహుమతి,మూడవ బహుమతి బైకులు,ఫ్రిజ్ లు అంటూ బ్రోచర్ తో హోరెత్తిస్తున్నారు.ఒక వైపు సైబర్ క్రైమ్ మోసాలతో జనాలు బెంబేలెత్తుతుంటే, కనుమరుగైన లక్కీ డ్రా స్కీంలతో ప్రజలను మోసగించేందుకు కొందరు బడా బాబులు సిద్ధమవుతున్నారు.ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎంత హెచ్చరిస్తున్న కూడా జనాల్లో ఈజీ మని సంపాదించాలన్న అత్యాశే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.లక్కీ డ్రా స్కీములను కోట్ల రూపాయల స్కాములుగా మలిచేందుకు సిద్ధమై, చాప కింద నీరులా సాగుతున్న దొంగ దందాపై పోలీసులు కాస్త నజరు వేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## కథలాపూంలో నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక తనిఖీలు



**కథలాపూర్ నవంబర్ 7 (జనం సాక్షి) :** కథలపూర్ పరిధిలోని రద్దీ ప్రాంతాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక విస్తృత తనిఖీలు నిర్వహించి మండలం లో గంజాయి లాంటి పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని,పోలీస్ సిబ్బంది మత్తు పదార్థాలను గుర్తించే నార్కోటిక్ జాగిలలతో తరచు మండలం పరిధిలో ఉన్న, పాన్ షాప్,కిరాణా షాప్‌లలో, బస్టాండ్ ప్రాంతాల్లో, రద్దీగాల ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో గంజాయి రవాణా చేసిన, అమ్మిన, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధించిన గంజాయిలాంటి మత్తు పదార్థాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# హాస్టల్లో అధికారుల తనిఖీలు



**బిచ్కుంద నవంబర్ (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లాలో బిచ్కుంద మున్సిపాలిటీ కేంద్రంలో సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్స్ అధికారులు శుక్రవారం నాడు పలు హాస్టల్లలో తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్, బిసి బాల బాలికల, ఎస్సీ బాల బాలికల హాస్టల్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు సరిగా అందించాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలని వార్డెన్లకు తెలియజేశారు. హాస్టల్లలో వంటగది, మరుగుదొడ్లు, విద్యార్థులు పడుకునే గదులు శుభ్రంగా ఉంచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు. విద్యార్థులకు ఏ విధమైన సమస్యలు రాకుండా ప్రతి ఒక్కటి అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్ డి ఎం.శ్రీధర్ రెడ్డి, ఏఎస్ఓ సుదర్శన్ రెడ్డి, టాస్కోఫోర్స్ ఎస్సై శ్రీనివాసరావు, డీటీలు సురేష్ ఖలిద్, వార్డెన్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న

# బృందానికి ప్రత్యేక అభినందనలు

- అక్టోబర్ నెలలో విజయవంతంగా 240 ప్రసవాల నిర్వహణ
- రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- 'ఖని' జనరల్ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :** (రామగుండం) గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష (రామ గుండం) గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని సంద ర్శించి వైద్య బృందాన్ని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో అక్టోబర్ నెలలో 240 ప్రసూతులు నిర్వహించిన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య అధికారులు, ఆసుపత్రి గైనకాలజిస్టులు, ఓ.పి. సిబ్బంది, తదితర సిబ్బంది ని కలెక్టర్ సన్మానించారు. రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.చిన్నపిల్లల వైద్య చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలకు నిధులు సమకూర్చడం జరుగుతుందని,అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.ఔట్ సోర్సింగ్ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు తీసుకోవడానికి వీలు లేదని, డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిజిహెచ్ లో పని చేసే ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఐడీ కార్డులు జారీ చేయాలని అన్నారు.ఆసుపత్రి సెక్యూరిటీ పేషెంట్, పేషెంట్ సహాయకులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తుందని, ఈ పద్దతి మార్చుకోవాలని అన్నారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్,వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ-రామగుండం

# 51వ వ్యవస్థాపక దినోత్సవం

- ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో జరుపుకుంది
- ఎన్టీపీసీ ఆర్ఈడీ చందన్‌కుమార్ సమంత



**గోదావరిఖని, జనంసాక్షి :**
ఎన్టీపీసీ-రామగుండం 51వ వ్యవస్థా పక దినోత్సవాన్ని గొప్ప ఉత్సాహం.. స్థిరత్వం.. సమిష్టి వృద్ధి పట్ల బలమైన నిబద్ధతతో జరుపుకుంది. దేశాన్ని బాధ్యతాయు తంగా శక్తివంతం చేయడంలో ఎన్టీపీసీ ఐదు దశాబ్దాల అద్భుతమైన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియం లాన్స్‌లో వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమం తెల్లవారుజామున ఎన్టీపీసీ నివాస సముదాయం సమీపంలో ప్రత్యేక సామూహిక వృక్షాల పెంపకం డ్రైవ్‌తో ప్రారంభమైంది. పరిశుభ్రమైన..పచ్చని భవిష్యత్తు కోసం దార్శనికతను బలోపేతం చేసింది. ముఖ్యఅతిథి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్అండ్‌టీ) చందన్ కుమార్ సమంత జెండా ఎగురవేయడంతో ప్రధాన కార్యక్రమం ప్రారంభమైం ది, తరువాత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వివిధ యూనియన్లు,సంఘాల ప్రతినిధుల సమక్షంలో రైజింగ్ డే కేక్ కట్, బెలూన్ విడుదల కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా, విజిలెన్స్ అవగాహన వారానికి బహుమతులు కూడా పంపిణీ చేయబడ్డాయి.సభను ఉద్దేశించి సమంత ప్రసంగిస్తూ ఎన్టీపీసీ రామగుండం స్థిరమైన పనితీరును ప్రశంసించారు.సంస్థ ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని, ఆవిష్కరణలను..స్థిరత్వాన్ని హైలైట్ చేశారు.కార్యాచరణ సామర్థ్యం..సామాజిక బాధ్యత ద్వారా ఎన్టీపీసీ వృద్ధిని నడిపించడంలో బృందం అంకితభావ ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమం ధన్యవాదాల ప్రసంగం..తరువాత రిఫ్రెష్‌మెంట్‌లతో, నోయిడా ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్ కార్పొరేట్ వ్యవస్థాపక దినోత్సవ ప్రసంగం ప్రత్యక్ష వెబ్‌కాస్ట్‌తో ముగిసింది. ఈ దినోత్సవ వేడుకలు ఎన్టీపీసీ రామగుండం శాశ్వత ఐక్యత, అంకితభావం, పర్యావరణ స్పృహను ప్రతిబింబిస్తాయి. ఇది సంస్థ విశ్వసనీయత, బాధ్యత.. స్థితిస్థాపకత.. ప్రధాన విలువలను ప్రతిధ్వనిస్తుంది.

## విద్యార్థుల మేధాశక్తి ఒక ప్రయోగశాల'

# నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం

- నైపుణ్యంతో మరింత బలం శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యసాధన భయం, అలసటను అధికమించండి
- శాతవాహన యూనివర్సిటీలో 2వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 07 (జనంసాక్షి):**
నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి తెలంగాణ గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. 25 మందికి పీహెచ్డీ పట్టాలతో పాటు 2018 నుంచి 2023 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ... క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతుందని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే వారి ప్రయోగశాలగా అభివర్ణిం చారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమా జంలో ముందుకు తీసుకెళ్తాయని తెలిపారు. అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి విద్యా రంగాల్లో , విద్యా ప్రమాణాలు నెలకొల్పాలని తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యారంగం బోర్డు, చాక్ పీస్ లకే మాత్రమే పరిమితం కావద్దన్నారు. ప్రస్తుతం విద్యా రంగం సాంకేతికతతో ముందుకు సాగుతుందన్నారు. డిజిటల్ లెర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం, నిరంతర అభ్యాసాలె విజయానికి దోహదం చేస్తాయని, ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను



అందిపుచుకోవాలని వివరించారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధికమించి ముందుకు సాగాలని అన్నారు. కృషితో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమే అన్నారు. విద్యార్థి దశ నుండే సేవా మార్గాన్నిఅనుసరించాలని పిలుపునిచ్చారు.

అనంతరం కలెక్టరేట్ చేరుకున్న గవర్నర్ మొదటగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వందేమాతర గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా తదనంతరం బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంద విద్యార్థుల పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ జె.బి. రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ యు.ఉమేష్ కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



### 'రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన సాయి చైత్ర'

డిగ్రీ , పీజీలలో ఉత్తమ ర్యాంకులు సాధించడం ద్వారా రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. కరీంనగర్లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో చదివిన కరీంనగర్‌కు (ఆంధ్ర ప్రభ విలేఖరి మధు సూదన్ రెడ్డి కూతురు) చెందిన కామినేని సాయి చైత్ర డిగ్రీలో బిబిఎం, లోను పీజీ లో ఎంబీఏ లోను శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. కళాశాల యజమాన్యం గర్వపడేలా ర్యాంకులు సాధించి రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. కరీంనగర్ లోని శాతవాహన యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన రెండవ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేస్తుల మీదుగా సాయి చైత్ర రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సాగర్ విద్యార్థిని చైత్ర ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా చెప్పారు. సహకరించిన అధ్యాపకు లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వందేమాతరం గీతాలాపన

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జనంసాక్షి :**
భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమా నికి స్ఫూర్తినిచ్చి ఇప్పటికీ జాతీయ గౌరవాన్ని,ఐక్యతను పెంపొందిస్తు న్న బంకించంద్ర చటర్జీ రచించిన ఈ అద్భుతమైన వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకు న్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు వందేమాతర గీతాలాపన కార్యక్రమం రామగుండము పోలీస్ కమీషనరేట్‌లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకి పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై అధికారులు, సిబ్బంది తో కలిసి వందేమాతరం సామూహిక గీతాలాపన చేశారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ భారత్ భారీ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ మార్పులకు లోనవుతున్న కాలంలో జాతీయ గుర్తింపు భావన, వలస పాలనపై ప్రతిఘటన పెరుగుతున్న ఆ కాలంలో వందేమాతరం..మాతృభూమిని బలం, శ్రేయస్సు, దైవత్వానికి ప్రతీకగా మార్చింది. జాతీయ సమైక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. తర్వాత కొద్ది కాలంలో ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా మారింది. మన గర్వం, గౌరవం, ఉమ్మడి గుర్తింపును పెంపొందిస్తూ మనందరికీ ఐక్యం చేస్తున్న జాతీయ గేయాన్ని గౌరవించేందుకు..దేశభక్తి, కృతజ్ఞతకు సమష్టి ప్రతీకగా ఈ కార్యక్రమాలలో దేశ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమములో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామన మూర్తి, మల్లేశం, సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి, సందీప్, సంధ్య, వివిధ వింగ్స్ ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్ఐలు, ఆర్ఐలు శ్రీనివాస్, వామనమూర్తి, మల్లేశం, సిసి హరీష్, సీపీఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




### అక్రమ ఆదాయానికి తిష్ట

కురుమూర్తి స్వామి ఉత్సవాల్లో బెల్టు షాప్‌ల నుంచి వచ్చే ఆదాయం కోసం మహబూబ్‌నగర్ రూరల్‌కు సంబంధించిన ఓ అబ్కారి అధికారి జాతరలోనే తిష్ట వేసుకుని కూర్చోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కండ్లముందే జరుగుతున్న ఈ అక్రమతంతులో వాటా కోసం ఇద్దరు కిందిస్థాయి అధికారులను పర్యవేక్షణకు పెట్టడం మరీ విడ్డూరం. ఉన్నతాధికారుల పేర్లను సైతం చెప్పకుంటూ అక్రమ మద్యం వ్యాపారస్తుల వద్ద వసూళ్లతో పాటు ప్రతిరోజూ లిక్కర్‌ను సైతం నొక్కేస్తున్నాడని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

# అక్రమ మద్యం అబ్కారీ శాఖకు కిక్కు

## కమీషన్ల కోసం జాతరలో తిష్టవేసిన అధికారి



- పుల్ బాటిల్‌కి 60 నంచి 100 వరకు అధిక వసూళ్ళు
- మైనర్లకు సైతం అమ్మకాలు.. విపరీతంగా రేట్ల పెంపు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు..!



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 07 (జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం కురుమూర్తి జాతర మద్యం దుకాణాలకు అడ్డాగా మారింది. కురుమూర్తి జాతరలోని అక్రమ మద్యం వ్యాపారం అబ్కారి శాఖకు మంచి కిక్కుని ఇస్తున్నాయి. ఇష్టమున్న రేటుకు అక్రమంగా మద్యాన్ని అమ్మకో.. మాకు ముట్ట జెప్పాల్సినంతా ముట్టజెప్పుకో అంటూ మహబూబ్‌నగర్ రూరల్‌కు చెందిన అబ్కారి శాఖ అధికారి ఈ జాతరలో తిష్టవేసుకుని కూర్చున్నాడు. మందు విందులతో జాతరలో ఎంజాయ్ చేస్తూ.. అధిక రేట్లకు మద్యం విక్రయించేందుకు ప్రత్యక్షంగా దోహదపడుతున్నాడని జాతరకు వచ్చిన భక్తులు చర్చించుకుంటున్నారు.

**సామాన్యుల నిలువు దోపిడీ**

కురుమూర్తి జాతరలో విచ్చలవిడిగా మద్యాన్ని అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఒక్క బార్ బాటిల్‌పైన 20 నుంచి 25 రూపాయలు అధికంగా అమ్ముతున్నారు. ఫుల్ బాటిల్‌కు 50 నుంచి 100 వరకు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఈ అక్రమ తంతు అంతానూ ఎక్సైజ్ అధికారులకు తెలిసే సాగుతోందని ప్రజ లు బాహటంగానే చెప్పడం గమనార్హం. అక్రమ దందాకు అండగా ఉండటమేగాక వచ్చే వాటాని మహబూబ్‌నగర్ రూరల్ ఎక్సైజ్ అధికారి దగ్గరుండి మరీ వసూళ్లు చేయడం నివ్వెరపరుస్తోంది. కురుమూర్తి ఉత్సవం అంటే మందు విందు అనేవిధం గా ఇష్టారీతిలో బెల్టు షాపులను ఏర్పాటు చేసి జాతరకు వచ్చే భక్తులకు భక్తిభావం వైపునకు కాకుండా మద్యంవైపు ప్రోత్సహిస్తున్నారని పలు సంఘాల నుంచి కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అబ్కారీ శాఖ అధికారులు ఆదాయం కోసం చేస్తున్న వికృత చేష్టలపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

**బెల్టు షాపు నుంచి జాతరదాకా..**

కురుమూర్తి జాతరలో అక్రమ మద్యం వ్యాపారాన్ని దగ్గరుండి నడిపిస్తున్న మహబూబ్‌నగర్ రూరల్ అబ్కారీ అధికారి చేతి'వాటం' అంతాఇంతా కాదు. రూరల్ ప్రాంతాల్లోని గ్రామాల్లో బెల్టు షాపుల మొదలు కల్లు దుకాణాల నుంచి సైతం అమ్యామ్యాలు పుచ్చుకుంటున్నట్టు ఎన్నో ఆరోపణలున్నాయి. ఇల్లీగల్ దందాకు తాను భరోసాగా ఉంటూ నిర్వాహకుల నుంచి నెలనెలా మామూళ్లు అందుకున్నట్టు కొందరు బాధితులు వాపోతున్నారు. ఆ మామూళ్ల మత్తు కోసమే జాతరలోనూ మద్యం వ్యాపారానికి తెరలేపాడని, అధిక రేట్లకు మద్దతు పలుకుతున్నాడని తెలుస్తోంది. ఇలాంటి అధికారిపై చర్యలు చేపట్టకపోతే ఇంటికో బెల్టుషాపు వెలుస్తుందని పలు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# ఎన్ఎండీసీ 2.0 యుగానికి నాంది

**'ట్రాన్స్ఫర్మేషన్, ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్' ఘనంగా పూర్తి**



హైదరాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి): భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండీసీ లిమిటెడ్.. ప్రత్యేక విభాగం అయిన ట్రాన్స్ఫర్మేషన్, ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్ ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు జరుపుకుంటోంది. వ్యూహాత్మక ప్రాజెక్టులను వేగవంతం చేయడం, ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక దృశ్యంలో అనుకూలతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం పన్నెండు నెలల్లోనే, ఈ విభాగం ఒక చోదక శక్తిగా మారింది. భారతదేశానికి మొట్ట మొదటి మైనింగ్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. వ్యూహాత్మక చొరవలను వేగవంతం చేయడం, ఎన్ఎండీసీ యొక్క పోటీతత్వాన్ని బలోపేతం చేయడం అనే ఉద్దేశ్యంతో సృష్టించబడిన ట్రాన్స్ఫర్మేషన్, ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్ ఆశయం, అమలు మధ్య అంతరాన్ని విజయవంతంగా తగ్గించింది. ప్రపంచ మైనింగ్ పరిశ్రమ మారుతున్న డైనమిక్స్‌కు సంస్థ ప్రతిస్పందించేలా చూసుకుంది.

"మా మొదటి సంవత్సరం నేర్చుకోవడం, ఆవిష్కరణ, పరివర్తన ప్రయాణం" అని ఎన్ఎండీ, సీఎండి అమితవ ముఖర్జీ అన్నారు. "టీ అండ్ ఐ విభాగాన్ని స్థాపించడంలో, మేము ఎన్ఎండీసీ భవిష్యత్తును నిర్మించడానికి బయలుదేరాము. ఇది మైనింగ్ విధానాన్ని మారుస్తుంది. భారతదేశ పారిశ్రామిక పురోగతిలో మా పాత్రను బలోపేతం చేయడం, బాధ్యతాయుతమైన మైనింగ్ ఏమి సాధించగలదో పునర్నిర్వచించడంపై మా దృష్టి స్పష్టంగా ఉంది" అన్నారు. భవిష్యత్తులో, తక్కువ వినియోగంలో ఉన్న ఆస్తులను అమలు చేయడం ద్వారా, సామర్థ్యం మరియు సామర్థ్యాన్ని పెంపొందించడానికి తదుపరి తరం సాంకేతికతలను ఏకీకృతం చేయడం ద్వారా ఈ ఊపును పెంచుకోవాలని ఈ విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే సంవత్సరాల్లో ప్రతి వ్యూహాత్మక చర్య బలమైన, తెలివైన, మరింత స్థిరమైన ఎన్ఎండీసీకి దోహదపడేలా చూసుకోవడం దీని లక్ష్యం. ఈ విభాగం రెండవ సంవత్సరం లోకి అడుగుపెడుతున్నప్పుడు, కంపెనీ ఎన్ఎండీసీ 2.0 యుగానికి నాంది పలికింది. సాంకేతికత, ప్రజలు, ఉద్దేశ్యం ద్వారా మైనింగ్‌ను తిరిగి ఊహించుకోవడం, భారతదేశంలో బాధ్యతాయుతమైన,వినూత్నమైన మైనింగ్ కోసం కొత్త ప్రమాణాలను నిర్దేశించడం.

# కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా

- ఒకరి మృతి,మరికొంతమందికి స్వల్ప గాయాలు
- డ్రైవర్ తోపాటు మరో ఐదుగురికి తప్పిన ప్రమాదం



చిగురుమామిడి నవంబర్ 07(జనంసాక్షి): వాళ్లంతా దినసరి కూలీలు రోజు కూలి చేస్తే తప్ప కుటుంబాలు గడిచే పరిస్థితి లేకపోవడంతో పక్క గ్రామాలకు పత్తి ఏరేందుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా మరికొంతమంది కూలీలకు స్వల్ప గాయాలు అయిన విషాద సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది..వివరాల్లోకి వెళ్తే కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన జేరిపోతుల వెంకట్ అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో కూలీలను సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకొస్తుండగా సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లె క్రాసింగ్ వద్ద ప్రమాదవశాత్తు కుక్కలను తప్పించబోతుండగా ఆటో బోల్తా కొట్టడంతో కట్ల లచ్చవ్వ(65) అనే కూలీ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది.ప్రమాదానికి గురైన ఆటోలో డ్రైవర్ తో సహా ఆరుగురు ప్రయాణిస్తుండగా రేకొండ కనకవ్వతో పాటు పలువురికి స్వల్ప గాయాలయి త్రుటిలో ప్రాణపాయం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.ముదిమాణిక్యం నుండి నిత్యం కూలీలు తీగలగుంట పల్లెకు కూలీ పనులకు వెళ్తుంటారు.ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డుపై దాదాపు పది కుక్కలు అడ్డురాగా వాటిని తప్పించబోయే పరిస్థితుల్లో ఆటో ప్రమాదానికి గురైనట్లు ఆటోడ్రైవర్ వెంకట్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న కోహెడ పోలీసులు అక్కడికి చేరుకొని,మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గాయాలైన కూలీలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# ఏఐ ల్యాబ్ ద్వారా కనీస విద్యా ప్రమాణాల పెంపుకు కృషి

- ప్రతి విద్యార్థి రోజుకు కనీసం అరగంట ఏఐ ల్యాబ్ వినియోగించాలి
- ఏఎక్స్ఎల్ పాఠశాలల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) : ఏఐ ల్యాబ్ ద్వారా కనీస విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏఎక్స్ఎల్ పాఠశాలల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఏఎక్స్ఎల్ పాఠశాలలో అవసరమైన మేర అదనంగా కంప్యూటర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులు కనీస విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ఏఎక్స్ఎల్ ల్యాబ్ లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఏఎక్స్ఎల్ ల్యాబ్ లో ప్రతి విద్యార్థి రోజుకు కనీసం అరగంట సమయం గడిపేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఏఎక్స్ఎల్ ల్యాబ్ లో అవసరమైన పరికరాలను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లల విద్యా ప్రమాణాలు పెంపు సంబంధించి వాస్తవిక రిపోర్టు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఏఎక్స్ఎల్ ల్యాబ్ లో పిల్లలకు రెగ్యులర్ గా ఇంగ్లీష్, తెలుగు, గణితం పాఠాలు నేర్చుకునేలా చూడాలని అన్నారు. విద్యార్థుల పురోగతి పై పాఠశాలల్లో సమీక్షించుకుంటూ కనీస ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల బస్సు ప్రమాద బాధితులకు

# రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- గాయపడ్డ వారికి పది లక్షలు ఇవ్వాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



యాలాల నవంబర్ 7 ( జనంసాక్షి ) : చేవెళ్ల బస్సు ప్రమాద సంఘటనలో మరణించిన 19 మందికి ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా యాలాల మండలము పేర్కంపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన ముగ్గురు అక్కచెల్లెళ్ల కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చేవెళ్ల బస్సు ప్రమాదం జరగడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆమె రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ప్రమాదం జరిగిన తర్వాత రోడ్ల మరమ్మత్తు చేపట్టడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముందే ఈ రోడ్డు మరమ్మత్తు పనులు చేపడితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని 19 మంది కుటుంబాలు రోడ్డున పడేవి కావని కవిత పేర్కొన్నారు. బాధితులను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.

# కోర్టు కేసుల ట్రాకింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

**కోర్టు కేసుల ట్రాకింగ్ పై జిల్లా అధికారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) : కోర్టు కేసుల ట్రాకింగ్ కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కోర్టు కేసుల ట్రాకింగ్‌పై జిల్లా అధికారులకు, తహసిల్దార్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కోర్టు కేసుల ట్రాకింగ్ కోసం నూతనంగా పోర్టల్ తయారు చేశామని అన్నారు. ప్రతి జిల్లా అధికారి పేరిట లాగిన్ తయారు చేసి కోర్టు కేసులు రెగ్యులర్ ఫాలో అప్ చేస్తూ ట్రాక్ చేసేందుకు వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. సోమవారం నుంచి ఈ వ్యవస్థ పని చేయాలని, కోర్టు కేసుల సంబంధించిన సంపూర్ణ వివరాలు ఈ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, సురేష్,జిల్లా అధికారులు, తహసిల్దార్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలంటే ఈ 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొన్నం సుడిగాలి పర్యటన
- బీఆర్ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరిక
- నాయీ బ్రాహ్మణ సంఘాలకు జీరో బిల్లు హామీ
- సంక్షేమ పథకాలే విజయాస్త్రం



హైదరాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి చివరి 48 గంటలు మిగిలి ఉండగా, కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. యూసుఫ్‌గూడా డివిజన్‌లో బైక్‌పై సుడిగాలి పర్యటన నిర్వహించిన ఆయన, బూత్‌ల వారీగా ఏర్పాటు చేసిన కార్యాలయాలను సందర్శించి నేతలను సమన్వయం చేశారు. ప్రతి ఓటరునూ స్థానిక నాయకులతో కలిసి స్వయంగా కలుస్తూ, కాంగ్రెస్ అభ్యర్థి, స్థానికుడు, విద్యావంతుడైన నవీన్ యాదవ్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సబ్బండ వర్గాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయని, ప్రజా పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

వెంగల్‌రావు నగర్‌లో స్థానిక నాయకులు సంజయ్ గౌడ్, ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం సమక్షంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కార్యకర్తలు, నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన, జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, యువకులు, మహిళలు పార్టీని నమ్మి చేరాలని పిలుపునిచ్చారు. నవంబర్ 11న జరగబోయే ఎన్నికల్లో నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌లోకి ఎవరైనా రావచ్చని ఆహ్వానించారు. సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్‌లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జెండా ఎగరేయాలంటే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉప ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణ సంఘాలతో మంత్రి పొన్నం సమావేశమై, నవీన్ యాదవ్‌కు ఏకగ్రీవ మద్దతు లభించింది. నాయీ బ్రాహ్మణ సోదరులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌తోపాటు, ఇతర ఇళ్లలో వచ్చే 200 యూనిట్ల విద్యుత్ జీరో బిల్లు మాదిరిగా సెలూన్లకూ జీరో బిల్లు వచ్చేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బకాయిలు ఉన్నా కనెక్షన్లు కట్ చేయకుండా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఎంపీగా ఉన్నప్పుడు నాయీ బ్రాహ్మణ సంఘానికి 10 గుంటల స్థలం, భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశానని గుర్తు చేశారు. కుల వృత్తులు మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ అప్‌డేట్ చేసుకోవాలని, సెలూన్లను మోడర్న్‌గా మార్చేందుకు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బలహీన వర్గాల బిడ్డ నవీన్ యాదవ్ గెలుపు కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### క్రమశిక్షణ పేరుతో కార్మికులను, కుటుంబాలను అవహేళన చేస్తున్న

# పట్టించుకోని గుర్తింపు సంఘాలు

**సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి**



యైటింక్లయిన్ కాలనీ నవంబర్ 07 (జనంసాక్షి) : క్రమశిక్షణ పేరుతో కార్మికులను వారి కుటుంబాలను అవహేళన చేస్తున్న పట్టించుకోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ....ఇటీవల సింగరేణి వ్యాప్తంగా గైహాజరు కార్మికులకు క్రమశిక్షణ పేరుతో యజమాన్యము సర్కులర్ విడుదల చేసిన తర్వాత గుర్తింపు, ప్రాతినిధ్య సంఘులు దానిని స్వాగతించడాన్ని తప్పుపడుతునామన్నారు. ఇట్టి సంఘాల ద్వంద వైఖరిని వ్యతిరేకిస్తున్నామని ఒక నెలలో అండర్ గ్రౌండ్ కార్మికులు 16 మస్టర్లు, సర్ఫేస్ కార్మికులు 20 మస్టర్లు చేయకపోతే వారిని కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్ పేరిట వేధింపులకు గురి చేయడము సరైన పద్ధతి కాదని, కార్మికులకు ఇంటిదగ్గర పలు సమస్యలు, పలు అవసరాలు ఉండే అవకాశం ఉన్నందున ఇట్టి సర్కులర్ ను వెంటనే రద్దు చేయాలని గైహాజర్ పేరుతో పుట్టిన ఇట్టి సర్కులర్ రెగ్యులర్గా పనిచేసే కార్మికుల వారి కుటుంబాల మనోభావాలను అవహేళన చేస్తూ, మానసికంగా ఇబ్బంది పడే పరిస్థితి ఉన్నది కనుక ఇట్టి నిబంధనను ఎత్తివేయాలని, 100 మస్టర్లు చేయలేని వారిని 150 మస్టర్లు చేయాలని క్రమశిక్షణ పేరుతో కార్మికులను వేధింపులకు గురి చేస్తూ, ఉద్యోగం నుండి తొలగించే ప్రయత్నం జరుగుతుందని, 20 సంవత్సరాల కిందట గోల్డెన్ షెక్‌హ్యాండ్ పేరుతో కార్మికులను తగ్గించే కుట్రను, మరల రాజకీయ జోక్యంతో యాజమాన్యం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఖరి వల్ల కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, కార్మికులను మానసిక ఒత్తిడికి గురి చేస్తూ ఆర్థికంగా నష్టం చేసే ఇట్టి సర్కులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించడానికి ప్రైవేటీకరణను పెంచి పోషించడానికి, ప్రభుత్వాలు పలు వ్యూహాత్మకమైన ఆలోచనలు చేస్తున్నాయని, సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి కార్మికులను వారి హక్కులను రక్షించుకోవడానికి అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాడాల్సిన బాధ్యత గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు తీసుకోవాలని లేనియెడల కార్మికులు భవిష్యత్తులో కార్మిక సంఘాలను నమ్మే పరిస్థితి ఉండదని గుర్తింపు ప్రాథమిక సంఘాలను హెచ్చరించారు, ఈ సమావేశం లో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ముత్యంరావు, ఆర్జీ-2 ఏరియా సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్, నాయకులు సంపత్, భూమయ్య, రామ్ ప్రసాద్, సాంబరావు, రాంసాగర్, నరసింహారావు, వినేష్, శివకుమార్, నాగరాజు, తిరుపతి, ప్రశాంత్, జగదీష్, వినయ్ రాజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# చెరువును కాపాడారు.. వరద ముప్పు తప్పించారు

- భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హైడ్రాకు ధన్యవాదాలు
- హైడ్రాకు బాసటగా ర్యాలీలు నిర్వహించిన ప్రజలు







హైదరాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి) : మా చెరువును కాపాడారంటూ కొన్ని కాలనీల ప్రజలు, మాకు వరద ముప్పు తప్పించారని మరికొన్ని కాలనీల నివాసితులు హైడ్రాకు శుక్రవారం అభినందనలు తెలిపారు. భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న హైడ్రాకు పలు కాలనీల ప్రజలు బాసటగా నిలిచారు. హైడ్రా వచ్చింది మా కష్టాలు తీర్చిందంటూ పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద కష్టాలను తాము నేరుగా చూశాం.. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే ఆ సమస్యను పరిష్కరించిన తీరును కూడా గమనించాం.. దశాబ్దాల సమస్యకు ఇంత త్వరగా పరిష్కారం దొరుకుతుందని తాము ఊహించలేదంటూ పలువురు హైడ్రాకు అభినందనలు తెలిపారు. ర్యాలీలు తీసి, హైడ్రాకు అభినందనలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీ కష్టాలు వర్ణనాతీతం.. 5 సెంటీమీటర్ల వర్షం పడితే ఈ బస్తీని వరద ముంచెత్తుతుంది. నడుం లోతు నీటిలో ఇళ్లకు చేరడం గగనం. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే వచ్చి హుస్సేన్ సాగర్ ప్రధాన వరద కాలువకు అనుసంధానం చేయడంతో సమస్య పరిష్కారమైంది. ఇక్కడ స్థానిక ప్రజాప్రతినిధి వరద కాలువను ఆక్రమించి మళ్లించడం వల్లే ఈ సమస్య తలెత్తిందనగానే వెంటనే ఆ సమస్యను పరిష్కరించిన హైడ్రాకు ధన్యవాదాలంటూ ర్యాలీ నిర్వహించి మద్దతు పలికారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ విలేజ్‌లోని తురకవాణికుంట నుంచి దేవరయా ంజల్ చెరువుకు వెళ్లే వరద కాలువ 6 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. అక్కడ కొంతమంది ఆ నాలాను కేవలం 2 ఫీట్ల పైపులైను వేసి మిగతా భూమిని కబ్జా చేయడంతో తమ ప్రాంతాలన్నీ నీట మునుగు తున్నాయని హైడ్రాకు ఫిర్యాదు చేశాం. నెల రోజుల్లో సమస్యను పరిష్కరించిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

**ముష్కిన్ చెరువును కాపాడిన హైడ్రాకు ధన్యవాదాలు**

ముష్కిన్ చెరువును కాపాడిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఉదయం ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరిట చెరువు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో మట్టి పోసి బండ్ నిర్మాణం చేపట్టడంతో సరస్సు సహజ ప్రవాహం ఆగిపోగా, చెరువు నీరు కాలుష్యానికి గురైంది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముష్కిన్ చెరువు మత్స్యకారుల జీవనాధారంగా ఉండేది.

వారు తరతరాలుగా ఇక్కడ చేపల వేట చేసే వారు. ఆ కాలంలో వారి కుటుంబాలు కూడా ఈ సరస్సు నీటినే తాగేవారు. కానీ ఇటీవల కాలంలో సరస్సు కాలుష్యానికి గురై జీవ వైవిధ్యం కోల్పోయింది. మా ఫిర్యాదుతో హైడ్రా అధికారులు వెంటనే స్పందించి, ఎఫ్టీఎల్ పరిధిలో పోసిన మట్టిని పూర్తిగా తొలగించారు. చెరువు సహజ పరిమాణం పునరుద్ధరించడంతో సరస్సు తిరిగి తన పాత అందాన్ని సంతరించుకుంది. మాకెంతో ఆనందంగా ఉంది.. చెరువును కాపాడిన హైడ్రాకు కృతజ్ఞతలంటూ మత్స్యకారులు, స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి నీటి వనరులను రక్షించాలనే తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
8 నవంబర్ 2025

# జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

- కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

**న్యూఢిల్లీ, నవంబరు 7 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార




కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబర్ 11వ తేదీన ఈ ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు.. తమ తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం ఆయా పార్టీలు పక్కా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నాయి. ఆ క్రమంలో అధికార పార్టీ హామీల వర్షం కురిపిస్తోంది. ఇక ప్రతిపక్షలు బీఆర్ఎస్, బీజేపీలు.. అధికార పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి. దీంతో ఈ మూడు పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఉపఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం మంత్రులు, అగ్రనేతలను ఈ నియోజకవర్గంలోని డివిజన్లకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి.. గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

## పాక్ పత్రిక ది ఫ్రాంటియర్ కథనాలపై

# రష్యా ఆగ్రహం

**మాస్కో, నవంబర్7 (జనంసాక్షి) :** పాకిస్థాన్‌కు చెందిన పత్రికల తీరుపై మాస్కో మండిపడ్డది. వ్యతిరేక, అసత్య కథనాలు రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ది ఫ్రాంటియర్ పోస్టు అనే ఆంగ్ల భాషా దిన పత్రికపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. మాస్కోకు వ్యతిరేకంగా ఈ పత్రిక కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు పాక్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. ది ఫ్రాంటియర్‌లో రష్యన్ వ్యతిరేక కథనాలను మేం గమనించాం. ఈ పత్రికకు సంబంధించిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లో ఉన్నందున దీన్ని పాకిస్థానీ అని పిలువలేము. పత్రిక తన సంపాదకీయంలో నిరంతరం రష్యా విదేశాంగ విధానం, నాయకత్వాన్ని విమర్శిస్తూ కథనాలు ప్రచురిస్తుందని పేర్కొంది. ఇతర దేశాల అజెండాపై కథనాలను ఎంపిక చేసే విషయంపై అమెరికనైజ్డ్ బృందం బాధ్యత వహిస్తుందని.. అది రష్యా విదేశాంగ విధానాలకు, అధ్యక్షుడు పుతిన్ విమర్శకులకు అధిక ప్రాధాన్యం ఇస్తోం దని ఆరోపించింది. తమ దేశానికి సానుకూ లంగా ఉండే ఒక్క కథనం కూడా ఈ పత్రికలో రాలేదని పేర్కొంది. అఫ్గాన్ వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ఈ వార్తా పత్రిక.. మాస్కో ఫార్మాట్ ఆఫ్ కన్సల్టేషన్స్‌ను పూర్తిగా విస్మరిం చడం గమనార్హం అని వెల్లడించింది. ఈ సందర్భంగా యూఎస్‌కు చెందిన ఫ్రాంటియర్ పత్రిక జర్నలిస్టులు.. రష్యా ఆర్థిక పతనం అంచున ఉన్న దుర్బల దేశంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించింది. తమ దేశ ఆర్థికవ్యవస్థను సమర్థించింది. ఏ దేశ చరిత్రలోనూ ఇంతకుముందు లేనివిధంగా.. బయట ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నా తమ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన పురోగతిలో ఉందని వెల్లడిం చింది. 2024లో రష్యా జీడీపీ 4.1 శాతం పెరిగిందని పేర్కొంది. ఇలాంటి కథనాలు ప్రచురించే ముందు నిజాలు తెలుసుకోవాలని సూచించింది.

# విమానయాన రంగంపై షట్‌డౌన్ తీవ్ర ప్రభావం

- సిబ్బంది కొరతతో వందలాది విమానాల రద్దు
- గంటల తరబడి విమానాల రాకపోకలకు ఆలస్యం




**చికాగో, నవంబర్ 7 (జనంసాక్షి) :** అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తమ ప్రయాణాలను రీ షెడ్యూల్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా దేశంలోని రద్దీ ఎక్కువగా ఉండే 40 ప్రాంతాల్లో విమాన సర్వీసులను 10 శాతం వరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటికి 750కి పైగా విమాన సర్వీసులను ముందుగానే రద్దు చేసినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. ప్రముఖ విమానయాన సంస్థ అమెరికన్ ఎయిర్‌లైన్స్ రోజుకు 220 విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, డెల్టా ఎయిర్‌లైన్స్ శుక్రవారం 170 సర్వీసులను, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ 100 సర్వీసులను నిలిపివేసినట్లు తెలిపాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది సహా వేలాది మంది కీలక ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలామంది అనారోగ్య కారణాలతో సెలవులు పెడుతుండటంతో ఏటీసీ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికే గురువారం 6,400కు పైగా విమానాలు ఆలస్యంగా నడవగా, 200 సర్వీసులు రద్దయ్యాయి. బోస్టన్, నెవార్క్ విమానాశ్రయాల్లో ప్రయాణికులు రెండు గంటలకు పైగా, షికాగో, వాషింగ్టన్ ఎయిర్‌పోర్టుల్లో గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. "ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందే మేల్కోవడం మంచిదని భావిస్తున్నాం. పరిస్థితులు దిగజారకముందే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం" అని ఎఫ్ఏఏ అడ్మినిస్ట్రేటర్ బ్రయాన్ బెడ్‌ఫోర్డ్ తెలిపారు. కొన్ని వారాల్లో థ్యాంక్స్‌గివింగ్ సెలవులు రానున్న నేపథ్యంలో ప్రయాణాల రద్దీ మరింత పెరగనుంది. ఈ సమయంలో విమానాల రద్దు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయనుంది. అట్లాంటా, డెన్వర్, చికాగో, హ్యూస్టన్, లాస్ ఏంజిల్స్ వంటి ప్రధాన విమానాశ్రయాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అయితే, విమాన ప్రయాణాలు సురక్షితమేనని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ భరోసా ఇచ్చారు. కాగా, తన 35 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని, ప్రభుత్వ షట్‌డౌన్‌ల విషయంలో ఇది ఒక కొత్త అనుభవమని బెడ్‌ఫోర్డ్ వ్యాఖ్యానించారు.

# జూబ్లీ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

- సర్వేలపైనా పలు పార్టీల నజర్

**హైదరాబాద్, నవంబర్7 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారాన్ని భేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోని బిఆర్ఎస్ - కాంగ్రెస్ వర్గాలు సర్వేలను ఆధారం చేసుకుని గెలుపు తమది అంటూ ప్రచారం చేసుకోవడం ఒక అంశం అయితే .. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు ఆధారంగా ఆయా పార్టీలు తమ నాయకులకు పదవులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తూ ఉండటం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పదవులు ఆశించిన వారు .. నామినేటెడ్ పదవులు ఆశించిన వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఆ పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడుతున్నారు. ఇక బిఆర్ఎస్ లోను ఇదే తరహా ప్రచారం జరుగుతోంది. పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ... వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారు కేసీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం .. కేటీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం గట్టిగా కష్టపడుతున్నారు. ఉప ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరిలో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి.

## స్టాక్ మార్కెట్ నష్టాలతో

# ఇంజనీర్ ఆత్మహత్య

**అరిహంత్ విహార్, నవంబర్7 (జనంసాక్షి) :** స్టాక్ మార్కెట్లో భారీ నష్టాలతో ఒక ఇంజనీర్ పొగతో నిండిన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, ఆస్తి తగాదాల కారణంగా తాను ఈ తీవ్రమైన చర్య తీసుకుంటున్నానని లవ్ కుమార్ రాసిన సూసైడ్ నోట్ గది నుండి లభించిందని పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటన బుధవారం ఉత్తరాఖండ్‌లోని అరిహంత్ విహార్ ప్రాంతంలో జరిగింది. వృత్తిరీత్యా కెమికల్ ఇంజనీర్ అయిన లవ్ కుమార్ తన గదిలోని హీటర్‌పై బొగ్గును మండించి పొగను సృష్టించి, లోపల ఉండి తాళం వేసుకుని ఊపిరాడక మరణించాడు. దీనికి ముందు కుమార్ తన భార్యకు వాట్సాప్‌లో కార్బన్ మోనాక్సైడ్ తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ సందేశం పంపాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్ స్టాక్ మార్కెట్ నష్టాలతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ అలవాటుతో ఇబ్బంది పడిన అతని భార్య తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. కుమార్ సందేశాన్ని వాట్సాప్‌లో చూసిన తర్వాత ఆమె పదేపదే అతనికి ఫోన్ చేసింది. కానీ అతను ఫోన్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో అతని కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వచ్చి తలుపు పగలగొట్టి చూసేసరికి గది పొగతో నిండిపోయింది, కుమార్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లారు, అక్కడ వైద్యులు అతను చనిపోయినట్లు ప్రకటించారు.

# శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

**హైదరాబాద్, నవంబర్7 (జనంసాక్షి) :** అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి (నవంబర్ 7) జనవరి వరకు 60 ప్రత్యేక రైళ్లను తిప్పనుంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి శబరిమల సమీప స్టేషన్ల వరకు నడుపుతుంది. శుక్రవారం నుంచి ఈ రైళ్లకు సంబంధించిన టికెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. చర్లపల్లి నుంచి కొల్లాం (రైలు నంబర్ 07107)– నవంబర్ 17, 24 తేదీల్లో, డిసెంబర్ 1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి బయల్దేరుతాయి. ఇవి మరుసటి రోజు కొల్లాం చేరుకుంటాయి. మొత్తం 10 రైళ్లను అందుబాటులో ఉంచారు. ఇవి పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతాయి. కొల్లాం నుంచి చర్లపల్లి (రైలు నంబర్ 07108)– నవంబర్ 19, 26 తేదీల్లో, డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లా నుంచి బయల్దేరుతాయి. మరుసటి రోజు చర్లపల్లి చేరుకుంటాయి. ఈ రైళ్లు రేణిగుంట, గూడూరు, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వస్తాయి.

# ఘరానా గ్యాంగ్‌స్టర్స్ అరెస్ట్

**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 7 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, హైదరాబాద్ నగర బహిష్కరణకు గురైన దాసరి సురేందర్ అలియాస్ సూరీతో పాటు ఏడుగురు సభ్యుల ముఠాను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఎనిమిది మంది ముఠా సభ్యులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మీడియా ఎదుట హాజరుపరిచారు. ఘరానా కరుడుగట్టిన నేరస్తుడు సూరీ హైదరాబాద్ పోలీసులు నగర బహిష్కరణకు గురైన తరువాత వరంగల్ నగరం లోని భీమారంలో మకాం వేశాడు. ఏడుగురితో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. అక్టోబర్ 18న రాత్రి సమయంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని శాయంపేట మండలం మందారిపేట హైవే రోడ్డులో లారీ డ్రైవర్ను బెదిరించి రెండు బైకులలో పెట్రోల్ పోయించుకున్నాడు. లారీ డ్రైవర్ పిర్యాదు మేరకు శాయంపేట, వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్కోఫర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి రెండు పిస్టల్స్, కత్తి, రెండు బైకులు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది ముఠాలో నలుగురు విద్యార్థులు ఉన్నారు. నిందితుల నుంచి రెండు రివాల్వర్లు, మూడు మ్యాగజైన్స్, ఒక బుల్లెట్, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. శాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ లారీ డ్రైవర్ ను సూరి గ్యాంగ్ గన్ బెదిరించాడు. ఇలాంటి కేసులు సూరిపై మొత్తం 45కు పైగా



క్రిమినల్ కేసు మాదగా ద్రవ్యాల రవాణా కేసుల్లో నిందితులు(డ్రగ్స్ మత్తులో కొందరిపై హత్యాయత్నం 10 మందికి పైగా ముఠా.. వీరిలో కొందరు పరారీ తుపాకుల స్వాధీనం వివరాలు డీసీపీ అంకిత్ కుమార్ ప్రకటించారు. రాచకొండ కమిషనరేట్ నుంచి సూరి పై సిటీ బహిష్కరణ వేటు పడింది. దీంతో గత కొన్ని నెలలుగా వరంగల్ అడ్డాగా ఈ గ్యాంగ్ నేరాల కు పాల్పడుతోంది. చర్లపల్లి జైల్లో బిహార్ చెందిన ఠాగూర్ తో సూరికి పరిచయమైంది. అతని ద్వారా బిహా ర్ నుంచి రెండు షార్ట్ వెపన్స్ కొనుగోలు చేశారు. వాటితో బెదిరింపులకు పాల్పడుతున్నారని మీడియా సమావేశంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధు సూదన్, శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపారు

# చెన్నయ్-విజయవాడ వందేభారత్ పొడిగింపు

**విజయవాడ, నవంబరు 7 (జనంసాక్షి) :** త్వరలోనే నరసాపురం రైల్వే స్టేషన్‌కు వందే భారత్ రైలు రానుంది. చెన్నై సెంట్రల్ – విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలును నరసాపురం వరకు పొడిగిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ సర్వీసు ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆదేశాలు కూడా జారీ చేసింది. ప్రస్తుతం చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరే వందేభారత్ రైలే.. రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్ల మీదుగా విజయవాడకు 12.10 చేరుకుంటుంది. అయితే పొడిగించిన సర్వీసు11.45 గంటలకే విజయవాడ చేరుకుంటుంది.




# టెస్లా సీఈవోకు ట్రిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ

- తొలి ట్రిలియనీర్‌గా మస్క్ చరిత్ర సృష్టించే అవకాశం



**న్యూయార్క్, నవంబర్7 (జనంసాక్షి) :** ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలాన్ మస్క్ తొలి స్థానంలో ఉన్నారు. ఆయన అపర కుబేరుడిగా నిలిచారు. ఈ క్రమంలో ఎలాన్ మస్క్ మరో ఘనత సాధించేందుకు సిద్ధమవుతున్నారు. టెస్లా సీఈవోకు ట్రిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ ఇచ్చేందుకు కంపెనీ వాటాదారులు అంగీకరించారు. దీంతో త్వరలోనే ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా మస్క్ చరిత్ర సృష్టించే అవకాశాలు కన్పిస్తున్నాయి. టెస్లా ఇప్పటికే భారత్‌లోనూ అడుగిడింది. టెస్లా కార్లకు ఇక్కడా గిరాకీ ఏర్పడింది. దీనికితోడు ఎగిరే కార్లను ప్రవేశ పెడతానని అన్నారు. గురువారం టెస్లా (కంపెనీ వార్షిక సమావేశం జరిగింది. ఈ క్రమంలో మస్క్‌కు భారీ ప్యాకేజీ ఇచ్చేందుకు 75 శాతం మందికి పైగా షేర్ హోల్డర్స్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్యాకేజీ ప్రకటన వెలువడిన అనంతరం మస్క్ ఆనందంలో మునిగిపోయారు. ఈ క్రమంలో రోబోతో కలిసి వేదికపై డ్యాన్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. ఈ క్రమంలో మస్క్ మాట్లాడుతూ.. తనకు మద్దతుగా ఓట్లు వేసిన వాటాదారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ ప్రకటన నేపథ్యంలో టెస్లా షేర్లు పెరిగినట్లు రాయిటర్స్ పేర్కొంది. మస్క్ కనీసం ఏడున్నర సంవత్సరాలు టెస్లాలో ఉండేలా చూసుకోవడమే లక్ష్యంగా తాజా ప్యాకేజీని ప్రకటించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరులో దీన్ని ప్రవేశపెట్టినప్పుడు టెస్లాలో మస్క్ వాటా 12 శాతంగా ఉంది. అది ఇప్పుడు 25 శాతానికి పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. అలా అయితే ఆయన వేతనం రోజుకు 237 మిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద వేతన డీల్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. మస్క్ ప్యాకేజీని పెంచే విషయంపై టెస్లా బోర్డు వాటాదారులకు కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. దీనికి మద్దతిచ్చేందుకు తిరస్కరిస్తే.. ఆయన కంపెనీ నుంచి వైదొలగవచ్చని పేర్కొంది.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370